www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం | 21-8-2017 | పేజీలు: 16 + 16 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 43 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం; తిథి: అమావాస్య రా. 12.00 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఆశ్లేష మ. 3.51 తదుపరి మఖ; వర్జ్యం: తె. ఉ. 6.51 వరకు, రా. 3.17-4.48; దుర్ముహూర్తం: మ. 12.44-1.34, మ. 3.14-4.04; అమృతఘడియలు: మ. 2.22-3.52; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.34 | నిజామాబాద్ సిటీ*
Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారు
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు

భారత ఉపరాష్ట్రపతి

శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు

తొలిసారిగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు
నేడు విచ్చేస్తున్న సందర్భంగా

హార్దిక స్వాగతం

తేది. 21 ఆగస్టు, ఉదయం గం॥ 11.30 ని॥ లకు రాజ్‌భవన్‌లో

పౌర సన్మానం

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

నీవులేని లోకం వృథా 'తల్లీ'!

- మాతృమూర్తి మరణంతో ఆగిన కూతురు గుండె
- అమ్మ, అమ్మమ్మ మృతితో అనాథ అయిన బాలిక

నాగిరెడ్డిపేట, ఆగస్టు 20: తల్లి పట్ల కూతురికి.. కూతురి పట్ల తల్లికి ప్రేమ సహజం! అదే ప్రేమ.. ఒకరికి మరొకరు ప్రాణమిచ్చేంత స్థాయిలో ఉంటే? మరణం కూడా తమ ప్రేమను వీడదీయలేదని తల్లీకూతుళ్లు చాటితే? కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోలి లాంగాల్‌లో ఇదే జరిగింది. గ్రామానికి చెందిన కోడే రామమ్మ(55)కు మల్లవ్వ (30) కూతురు. ఊర్లో ఉన్న విఠల్‌ను ఇల్లరికం తెచ్చుకొని కూతురికి వివాహం జరిపించింది. ఈ దంపతులకు కూతురు పవిత్ర (10) ఉంది. ఊర్లోనే ఆమె ఆరో తరగతి చదువుతోంది. ఇటీవల మనస్పర్థలు రావడంతో మల్లవ్వకు విఠల్ విడాకులిచ్చాడు. తల్లి రామమ్మ వద్దే ఉంటూ మల్లవ్వ కూలినాలి చేసుకుంటూ కూతురును పోషించుకుంటోంది. కొన్నాళ్లుగా రామమ్మకు ఆరోగ్యం బాగోలేదు. తీవ్ర అస్వస్థతతో ఆమె ఆదివారం ఉదయం మృతి చెందింది. తల్లి మరణాన్ని తట్టుకోలేక మల్లవ్వ తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో ప్రాణాలు కోల్పోయింది. అమ్మమ్మ, తల్లి వెంటవెంటనే ప్రాణాలు కోల్పోడంతో పవిత్ర తనకు దిక్కెవరంటూ గుండెలవిసేలా రోదించింది. గ్రామస్థుల సహకారంతో ఆదివారం సాయంత్రం తల్లీకూతుళ్ల అంత్యక్రియలు జరిగాయి.

అమ్మమ్మ, తల్లి మృతి చెందడంతో అనాథగా మారిన పవిత్ర

హరికృష్ణ, మహేశ్ మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబసభ్యులు

అన్నదమ్ములపై పాము కాటు

నురగలు కక్కుతూ ఒకరితర్వాత ఒకరు మృతి

పక్కలో మాటేసి బాలికను కాటేసిన కట్లపాము

వనపర్తి/ఖమ్మం క్రైం, ఆగస్టు 20: ఒకేరోజు రెండు కుటుంబాల్లో పాము తీరని విషాదం నింపింది. ఓ ఘటనలో ఇద్దరు అన్నాదమ్ములను బలితీసుకున్న పాము.. మరో ఘటనలో బాలికపై పక్కలోనే మాటేసి కాటేసింది. వనపర్తి జిల్లాలో ఒకరితర్వాత ఒకరు అన్నాదమ్ములు, ఖమ్మంలో జరిగిన మరో ఘటనలో బాలిక మృతిచెందింది. వనపర్తి జిల్లా వరదాపురం మండలం నర్సింగాపురంలో శనివారం రాత్రి సంభవించిన ఘటనలో అన్నదమ్ములు హరికృష్ణ (10), మహేశ్ (8) మరణించారు. ఆశన్న, ఈశ్వరమ్మ దంపతులు.. పిల్లలిద్దరినీ నానమ్మ బోయనాగమ్మ వద్దే ఉంచి పనికోసం వలసవెళ్లారు. నాయనమ్మ వద్ద ఉంటూ చదువుకుంటున్న పిల్లలు ఎప్పటిలాగే శనివారం నిద్రకు ఉపక్రమించాక అర్ధరాత్రి సమయంలో ఎక్కడినుంచి వచ్చిందో ఏమోగానీ పాము కాటువేసింది. కొద్దిసేపటి తర్వాత కడుపు నొప్పి వస్తోందంటూ హరికృష్ణ బాధపడడంతో అతడి నాయనమ్మ నాటువైద్యుడి వద్దకు తీసుకెళ్లింది. నోట్లోనుంచి నురుగు రావడంతో పాము కాటువేసిందన్న అనుమానంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించేలోపే మరణించాడు. అతడిని ఇంటికి తీసుకొచ్చిన కాసేపటికే అతడి తమ్ముడు మహేశ్ కూడా అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు. అన్నాదమ్ములిద్దరూ కొద్దిసేపట్లోనే ప్రాణాలు కోల్పోవడం గ్రామస్థులను కలచివేసింది. మరోఘటనలో పక్కలో దూరి న కట్లపాము పదేళ్ల బాలికను బలిగొంది. ఖమ్మం పోలీస్ క్వార్టర్స్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఉపేం ద్ర, ఉమాభారతి దంపతుల కుమార్తె సిరివెన్నెల(10) ప్రాణాలు విడిచింది. తెల్లవారుజామున కడుపులో నొప్పివస్తోందని ఆ పాప చెప్పింది. నోటి నుంచి నురగరావడంతో పరిసరాలను గమనించిన తల్లిదండ్రులకు.. ఆమె పక్కలోనే మాటు వేసిన కట్లపాము కనిపించింది. వెంటనే బాలికను ఆస్పత్రికి తరలించినా ప్రాణం మాత్రం నిలవలేదు.

ఆల్మట్టిలో నిండుగా ఉన్న నీరు

నీరు వదలని ఆల్మట్టి ప్రాజెక్టు గేట్లు

నీటి బొట్టు కోసం వెతుకులాట..

ఎగువన నిండుకుండలా ఆల్మట్టి, నారాయణపూర్.. దిగువన బోసిపోతున్న కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు

- శ్రీశైలం, జూరాల ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- తాగు, సాగు నీటి గండాన్ని గట్టెక్కడమెలా?
- తెలుగు రాష్ట్రాల ముందున్న ప్రశ్న

గద్వాల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి నదుల్లో నీటి బొట్టు కోసం వెతుక్కోవడం తెలుగు ప్రభుత్వాలకు కష్టంగా మారింది. రెండు నదుల పరివాహక ప్రాంతాల్లో వర్షా భావ పరిస్థితి నీటి గండాన్ని తెచ్చి పెట్టింది. మహారాష్ట్ర మినహా కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితితో జీవ నదులకు జీవం లేకుండా పోయింది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు వరదలొచ్చి కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీరు చేరింది. 129.72 టీఎంసీల పూర్తి సామర్థ్యం గల ఆల్మట్టి ప్రాజెక్టులో 125.47 టీఎంసీల నీరు ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండినా జలవిద్యుత్‌కు మాత్రమే నీటిని విడుదల చేస్తున్నారు. ఆ నీళ్లు నారాయణపూర్ జలాశయానికి చేరుతున్నాయి. దీంతో 37.646 టీఎంసీల సామర్థ్యం గల నారాయణపూర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 30.65 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పైపెచ్చు ఆల్మట్టి - నారాయణపూర్ ప్రాజెక్టుల మధ్య 60 కి.మీ.ల మేర విస్తరించిన కృష్ణా నదిలో నీటిని కర్ణాటక భారీగా నిల్వ చేసింది. ఈ ప్రాంతంలో మరో 50 టీఎంసీలకు పైగా నీరు నిల్వ ఉందని అంచనా. అయినా కిందికి నీటిని విడుదల చేయడం లేదు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో జలాశయాలు, నదులు వెలవెలబోతున్నాయి. కృష్ణా బేసిన్‌లోని జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల్లో నీళ్లు లేక తెలుగు రాష్ట్రాల్లో సాగు, తాగు నీటికి తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. పైగా కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు భయపెడుతున్నాయి. దీంతో గోదావరి పరివాహక ప్రాంతంలోని ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. తాగు నీటి అవసరాలకు 15 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సర్కారును తెలుగు రాష్ట్రాలు కోరినా ఫలితం లేకపోయింది. దీంతో తాగు, సాగు నీటి ఇబ్బందులు రెండు ప్రభుత్వాలను భయపెడుతున్నాయి. కరువు నుంచి గట్టెక్కాలంటే వరుణుడి కరుణ ఒక్కటే తెలుగు ప్రజల ముందున్న మార్గంగా కనబడుతోంది.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వ వివరాలు

ప్రాజెక్టు	నీటి సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	125.47	నిల్	29,499
నారాయణపూర్	37.646	30.65	27,600	299
జూరాల	9.66	6.16	2052	2573
శ్రీశైలం	215.807	20.75	2238	42
నాగార్జున సాగర్	312.045	115.78	705	705
శ్రీరాంసాగర్	90.31	9.66	5116	174
శ్రీపాద ఎల్లంపల్లి	20.18	11.31	2688	418

రూ. 4.10 కోట్ల సిగరెట్లు.. ఉఫ్!

సినీ ఫక్కీలో కంటైనర్ దారి మళ్లింపు.. డ్రైవర్‌ను కట్టేసి.. కొట్టిన దుండగులు

- 2 సుమోలు, లారీతో వెంబడించారు
- సిగరెట్లు లోడు చేసుకుని పరారు

హయత్‌నగర్/హైదరాబాద్, ఆగస్టు 20: సినీ ఫక్కీలో ఓ ముఠా నాలుగు కోట్ల విలువైన సిగరెట్లను కొల్లగొట్టింది. కంటైనర్‌ను దారి మళ్లించి..డ్రైవర్‌ను బంధించి.. అందులోని సిగరెట్లను మరో లారీలో పట్టుకుపోయింది. ఈ దోపిడీ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కోస్టల్ రోడ్ లైన్స్‌కు చెందిన కంటైనర్ శనివారం రాత్రి 10.30 గంటలకు ముషీరాబాద్‌లోని ఐటీసీ లిమిటెడ్ నుంచి రూ.4,10,12,667 విలువైన సిగరెట్లతో తిరుపతికి బయలుదేరింది. రాము అనే రూట్ గైడ్ కంటైనర్‌లో ఉప్పల్ వరకు వచ్చి డ్రైవర్ అఖిలేష్ కుమార్ యాదవ్‌కు దారి చూపించి వెళ్లాడు. సుమారు 30 మంది దుండగులు రెండు సుమోలు, ఒక లారీతో కంటైనర్‌ను వెంబడించారు. కంటైనర్ పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్దకు చేరుకోగానే 8 మంది దుండగులు అడ్డుకున్నారు. వారు క్యాబిన్‌లోకి ప్రవేశించి డ్రైవర్ యాదవ్‌ను చంపేస్తామని బెదిరించారు. అతన్ని కాళ్లు చేతులు కట్టేసి పక్కన కూర్చోబెట్టారు. దుండగులలో ఒకరు కంటైనర్ నడిపి, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కాపురం శివారుకు తీసుకుపోయారు. అక్కడ రోడ్డు పక్కన కంటైనర్‌ను నిలిపి డ్రైవర్‌ను అడవిలోకి తీసుకువెళ్లి కొట్టి గంటసేపు కూర్చోబెట్టారు. ఆ సమయంలో కంటైనర్‌లోని సిగరెట్లను దుండగులు తమ లారీలోకి లోడ్ చేసుకున్నారు. డ్రైవర్‌ను అక్కడే వదిలి సిగరెట్ల లోడ్‌తో పరారయ్యారు. డ్రైవర్ కట్లు విప్పుకుని రోడ్డుపైకి వచ్చి ఒక దాబా యజమాని ద్వారా చౌటుప్పల్ పోలీసులకు సమాచారం అందించాడు. ఈ దోపిడీ ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. సమాచారం అందుకున్న వెంటనే సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య, జాయింట్ సీపీ తరుణ్ జోషి, ఎల్‌బీ నగర్ డీసీపీ వెంకటేశ్వర్‌రావు, క్రైం అదనపు డీసీపీ జానకీ, వనస్థలిపురం ఏసీపీ రవీందర్ రెడ్డి, చౌటుప్పల్ ఏసీపీ స్నేహితతో పాటు ఎస్‌వోటీ, సీఐడీ అధికారులు హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. దుండగులను పట్టుకునేందుకు 15 ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు.

సిగరెట్ల కంటైనర్ ఇదే; (ఇన్‌సెట్) డ్రైవర్ అఖిలేష్ కుమార్ యాదవ్

జయశంకర్ జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు జల ధారలు ఉవ్వెత్తున ప్రవహిస్తుండడంతో ప్రకృతి ప్రేమికులు మంత్రముగ్ధులవుతున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కొండలను దాటుకుంటూ నల్లందేవీ వాగు మీదుగా బొగత వద్ద 50 అడుగుల ఎత్తు నుంచి దుముకుతున్న జలధారలను చూసేందుకు ఆదివారం జనాలు క్యూ కట్టారు. కాగా, జలపాతం నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న నలుగురు యువకులను రెస్క్యూ బృందం సభ్యులు రక్షించారు. - వాజేడు (జయశంకర్‌జిల్లా)

నేడు అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం

- నాసా వెబ్‌సైట్, ఫేస్‌బుక్ ఖాతాల్లో లైవ్!

విశాఖపట్నం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సుమారు 100 ఏళ్ల తర్వాత అమెరికాలో సంపూర్ణ సూర్యగ్రహణం సోమవారం ఏర్పడబోతోంది. ఈ గ్రహణం అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో సంపూర్ణంగా కనిపించనుంది. అమెరికాలో ప్రధానంగా 12 రాష్ట్రాల్లో దీని ప్రభావం పూర్తిగా ఉంటుంది. భారత కాలమాన ప్రకారం రాత్రి 9.16 గంటల నుంచి 12.52 వరకు ఈ సూర్య గ్రహణాన్ని చూడవచ్చు. ఈ గ్రహణాన్ని ప్రపంచం మొత్తం వీక్షించడం కోసం నాసా తన వెబ్‌సైట్‌తో పాటు, ఫేస్‌బుక్, ట్విటర్ ఖాతాల్లోనూ దీన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

వచ్చే ఏడాది నుంచి ఆన్‌లైన్‌లో జేఈఈ-అడ్వాన్స్‌డ్

చెన్నై: ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)ల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది నుంచి పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరగనుంది. ఈ మేరకు ఐఐటీ అడ్మిషన్లపై విధి విధానాలు ఖరారు చేసే జాయింట్ అడ్మిషన్ బోర్డు(జేఏబీ) ఆదివారం నిర్ణయం తీసుకుంది. '2018 నుంచి జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్షను ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. పరీక్షకు సంబంధించిన వివరాలు తర్వాత వెల్లడిస్తాం' అని జేఏబీ-2017, ఐఐటీ-మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ భాస్కర్ రామమూర్తి పేర్కొన్నారు. సునాయనంగా మూల్యాంకనం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని, ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహణకు చాలా ఏళ్ల నుంచి చర్చలు జరుగుతున్నా.. పరీక్ష నిర్వహణకు సదుపాయాలు కావాలని బోర్డు సభ్యుడొకరు మీడియాకు తెలిపారు.

కన్నడనాట మళ్లీ కాంగ్రెస్ జెండా!

బెంగళూరు, ఆగస్టు 20: దేశవ్యాప్తంగా మోదీ హవా వీస్తున్న ప్రస్తుత తరుణంలో.. కర్ణాటక ప్రజలు మాత్రం ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెనకాలే ఉన్నట్టు ఓ సర్వే తేల్చింది. కర్ణాటకలో మళ్లీ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని 'సీ ఫోర్' సంస్థ నిర్వహించిన ప్రీ పోల్ సర్వేలో వెల్లడైంది. బీజేపీ గతంలో కన్నా ఎక్కువ స్థానాలను సాధిస్తుందని ఈ సర్వే పేర్కొంది. కర్ణాటక అసెంబ్లీకి వచ్చే ఏడాది తొలి అర్థభాగంలో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 225 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ 120 నుంచి 132 స్థానాలను సాధిస్తుందని, బీజేపీ 60 నుంచి 72 స్థానాలను దక్కించుకుంటుందని సీ ఫోర్ సర్వే పేర్కొంది. జేడీ(ఎస్)కి 24 నుంచి 30 స్థానాలు రావచ్చని తెలిపింది. మొత్తం మీద కాంగ్రెస్‌కు 43 శాతం, బీజేపీ 32 శాతం ఓట్లు దక్కుతాయని తేల్చింది. సర్వేలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25వేల మంది అభిప్రాయాలను తెలుసుకున్నట్లు సీఫోర్ సంస్థ ప్రకటించింది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 123 స్థానాలను దక్కించుకోగా బీజేపీ 44, జేడీ(ఎస్) 32 స్థానాలను గెల్చుకున్నాయి.

అది కేంద్ర సర్కార్ సంస్థ కాదు

- కేసీఆర్‌కు అవార్డు వెనక కుట్ర
- ఎంజే ఖాన్.. విత్తన సంస్థల బ్రోకర్
- రైతులకు బేడీలు వేయించినందుకా?
- కాంగ్రెస్ నేతలు శ్రవణ్, జీవన్ రెడ్డి

హైదరాబాద్/జగిత్యాల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ ఇచ్చిందొక అవార్డు.. దానికంత ప్రచారమా? అని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు ప్రకటన వెనుక పెద్ద కుట్ర ఉందని, ఆ సంస్థను కేంద్ర ప్రభుత్వ సంస్థగా రాష్ట్ర ప్రభుత్వం భ్రమింపజేసి తప్పుదోవ పట్టించిందన్నారు. ఆ సంస్థ చైర్మన్ ఎంజే ఖాన్ పెద్దలాబీయిస్టు అని, విత్తన సంస్థల బ్రోకర్ అని ఆరోపించారు. రాష్ట్రాన్ని సీడ్‌బౌల్‌గా చేస్తామన్న ప్రభుత్వం..ప్రైవేటు విత్తన కంపెనీలకు దోచిపెట్టేందుకు కుట్ర చేస్తోందని, దాంట్లో భాగమే ఈ అవార్డు ప్రకటన అని ఆరోపించారు. "కేసీఆర్‌కి ఇచ్చింది పనికిరాని అవార్డు. ఇచ్చేవాడికి ఇంగితం లేకున్నా తీసుకునేటోనికన్నా బుద్ధి ఉండాలి కదా?"అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు భిక్షమయ్యగౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'దున్నపోతు ఈనిందిరా అంటే.. దొడ్లో కట్టెయ్యండి' అన్న చందంగా గవర్నర్ పద్ధతి ఉందన్నారు. కేసీఆర్‌కు ప్రకటించిన అవార్డు, ఆ సంస్థ ఏంటో తెలుసుకోకుండా సీఎంను అభినందించారన్నారు.రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకుంటుంటే పట్టించుకోని పాలకుడు అవార్డుకు ఎలాఅర్హుడని ప్రశ్నించారు. కేసీఆర్‌కు అవార్డు ఇవ్వాలని ప్రముఖ శాస్త్రవేత్త స్వామినాథన్ సిఫార్సు చేసిన పక్షంలో ఆయనకు ఇక్కడి రైతుల కష్టాలు, వ్యవసాయ సంక్షోభం గురించి సవివరంగా లేఖరాస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో రైతులకు బేడీలు వేసినందుకే సీఎం కేసీఆర్‌కు కేంద్ర వ్యవసాయ పురస్కారం లభించిందని సీఎల్పీ ఉపనేత టి.జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

హామీలకే అవార్డునివ్వడం సిగ్గనిపించడం లేదా?: నన్నూరి

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ వ్యవసాయంపై కురిపిస్తున్న హామీలకే అవార్డు ఇవ్వాలనుకోవడం సిగ్గనిపించడం లేదా? అని భారత వ్యవసాయ మండలిని టీడీపీ-టీఎస్ అధికారప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి ప్రశ్నించారు. వ్యవసాయం, రైతాంగ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని కేంద్ర సంస్థలే తప్పుబడుతూ అవార్డు ఇవ్వాలనుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. 'ఎకరాకు రూ.8వేలు ఇస్తామని సీఎం ప్రకటించినట్లు చెబుతున్న వ్యవసాయ మండలికి, టీఆర్ఎస్ గతంలో ఇచ్చిన హామీలు, వాటిని విస్మరించిన విషయం గుర్తుకులేదా? రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ రెండోస్థానంలో ఉందని నేషనల్ క్రైం బ్యూరో నివేదిక స్పష్టం చేసిన విషయం తెలియదా ? అని ప్రశ్నించారు.

లోకం తీరు

మీకు అమ్మాయి పుట్టింది..ఈ నాలుగు మందులతో పాటు నాలుగు ఆక్సిజన్ సిలిండర్లు కూడా తెచ్చుకోండి!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	21.1	26.2
మహబూబ్‌నగర్	21.6	27.1
ఆదిలాబాద్	21.6	29.0
వరంగల్	23.0	27.0
రామగుండం	23.4	26.8
సంగారెడ్డి	24.0	27.0

మోదీ లక్ష్యం... ఉగ్రవాద రహిత భారత్

"1942లో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం ఐదేళ్లపాటు కొనసాగి 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అదే స్ఫూర్తితో వచ్చే ఐదేళ్లలో దేశం నుంచి ఉగ్రవాదాన్ని పారదోలడమే లక్ష్యంగా మోదీ ప్రభుత్వం పని చేస్తోంది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదం చివరి దశలో ఉంది. ఐదేళ్లలో దీన్ని నిర్మూలిస్తాం."

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

ఉద్యోగాలిచ్చే స్థాయికి యువత

'ఒకప్పుడు దేశంలోని యువత ఉద్యోగార్థులుగా ఉండేవారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియాలతో ఇప్పుడు వారే ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగారు. దేశాన్ని న్యూ ఇండియాగా మార్చే బాధ్యత యువతపైనే ఉంది.'

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.72.40	పాత ధర 60.00
కొత్త ధర రూ.72.56	కొత్త ధర 61.93
పెరుగుదల 16 పైసలు	పెరుగుదల 1.93



మెదడు సంకేతాల్ని పసిగట్టే కృత్రిమ మేధస్సు

బెర్లిన్, ఆగస్టు 20: మెదడు అందించే సంకేతాలను పసిగట్టే సరికొత్త కృత్రిమ మేధస్సును శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. పక్షవాతానికి గురైన వారి ఆలోచనలతో సమన్వయానికి, మూర్ఛ రోగాన్ని ముందే గుర్తించేందుకు, నాడీ విశ్లేషణకు ఈ అత్యాధునిక సాంకేతికత సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మెదడు సంకేతాలతో ఈ స్వీయ అభ్యాస అల్గారిథం.. యూజర్ ఉద్దేశాన్ని విశ్వసనీయంగా గుర్తిస్తుందని జర్మనీలోని యూనివర్సిటీ హాస్పిటల్ ఫ్రీబర్గ్ పరిశోధకులు తెలిపారు.

స్మార్ట్‌ఫోన్ దూరమైతే రక్తపోటు!

లాస్‌ఏంజెలెస్, ఆగస్టు 20: స్మార్ట్‌ఫోన్.. ప్రస్తుతం చాలామంది శరీరంలో ఇది ఓ ముఖ్యమైన అంగంగా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్ లేకపోతే చాలామందికి తెల్లారదు.. రాత్రి సమయాల్లో నిద్రపట్టదు. ప్రపంచవ్యాప్తంగా ఇది మానవుల జీవితాల్లోకి చొరబడిపోయింది. అలాగే స్మార్ట్‌ఫోన్ బానిసలుగా మారుతున్న చాలామందిలో 'నోమోఫోబియా' (స్మార్ట్‌ఫోన్ దూరమైతే బెంగ పడడం) లక్షణాలు కనబడుతున్నాయని అమెరికాలోని ఇంటరాక్టివ్ మీడియా పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్ దూరమైతే కొంతమందిలో రక్తపోటు పెరగడం, ఇతర మానసిక సమస్యలకు గురవడం జరుగుతోందని వారు వెల్లడించారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం 21-8-2017

4.10 కోట్ల సిగరెట్ల దోపిడీ

సినీ పక్కీలో దారి మళ్లింపు
డ్రైవర్‌ను కొట్టిన దుండగులు
సుమో, లారీతో వెంబడించారు
సిగరెట్ల లోడు తీసుకుని పరార్

2

ఈపీఎస్, ఓపీఎస్ వర్గాల..

విలీనం నేడే!

పన్నీరుకు డిప్యూటీ సీఎం పదవి
ప్రధాన కార్యదర్శి పదవిపై బెట్టువీడిన మాజీ సీఎం

16

కన్నడనాట మళ్లీ కాంగ్రెస్ జెండా!

120 నుంచి 132 స్థానాలు
బీజేపీ 72, జేడీఎస్ 30 వరకు
సీ ఫోర్ సర్వేలో వెల్లడి

వచ్చే ఏడాది నుంచి జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఆన్‌లైన్‌లో

2

టార్గెట్ టి-కాంగ్రెస్

6

ఆ పార్టీని ఖాళీ చేయాలి
బీజేపీ పకడ్బందీ వ్యూహం
రాంమాధవ్‌కు బాధ్యత
రాష్ట్ర నేతల ప్రమేయం శూన్యం
అమిత్‌షా సమక్షంలో భారీగా చేరికలుండే అవకాశం

అమెజాన్ వెబ్‌సైట్‌లో అమ్మకానికి పెట్టిన సిల్డెనాఫిల్ టాబ్లెట్లు

ఏదైనా అమ్మేజాన్

ఆన్‌లైన్‌లో వయాగ్రా తరహా ఔషధం

ఆర్డరిస్తే చాలు సిల్డెనాఫిల్ టాబ్లెట్లు డోర్ డెలివరీ

- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మితే నేరం
- రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం
- గుండె జబ్బుతో వాడితే ప్రాణానికే ప్రమాదం
- ఇవేమీ లెక్క చేయని అమెజాన్ సంస్థ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - హైదరాబాద్)

ఆన్‌లైన్ వ్యాపారం ఇటీవల బాగా జోరందుకుంది. దుకాణాలకు వెళ్లే బదులు ఆన్‌లైన్‌లో కొనడానికి చాలామంది మొగ్గు చూపుతున్నారు. ఇదే అవకాశంగా కొన్ని ఆన్‌లైన్ సంస్థలు అక్రమాలకు తెర లేపాయి. డాక్టర్ సిఫారసుతో మాత్రమే వాడాల్సిన మందుల్ని, ప్రమాదకరమైన ఔషధాల్ని సైతం ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్ముతున్నాయి. వాస్తవానికి ఆన్‌లైన్‌లో ఔషధాలు అమ్మాలంటే ఎన్నో

మిగతా 14వ పేజీలో...

ఇంటికి చేరిన అమెజాన్ పార్సిల్

సిల్డెనాఫిల్ సిట్రేట్.. వయాగ్రా బ్రాండ్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఔషధం! అంగస్తంభన సమస్యతో బాధపడే మగవారు వైద్యుల సిఫారసుతో మాత్రమే వాడాల్సిన మందు ఇది!! అయితే కామోద్దీపన కోసం, సరదా కోసం అనేకమంది ఈ మందును వాడుతున్నారు. వైద్య పర్యవేక్షణ లేకుండా ఇలా వాడడం ప్రమాదం. గుండె జబ్బులు ఉన్నవారు వాడితే మరణం సైతం సంభవించే ముప్పుంది. అందుకే దీని అమ్మకాలపై ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ ఆంక్షలు ఉన్నాయి. వైద్యుడి సిఫారసు లేకుండా మెడికల్ షాపుల్లో గానీ, ఆన్‌లైన్‌లో గానీ సిల్డెనాఫిల్‌ను అమ్మకూడదు. భారత్‌లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మితే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు. కానీ ఈ నిబంధనను గాలికి వదిలేసి ఓ ఆన్‌లైన్ సంస్థ యథేచ్ఛగా సిల్డెనాఫిల్ విక్రయాలు సాగిస్తోంది. వెబ్‌సైట్‌లో సొమ్ము చెల్లించి ఆర్డర్ ఇస్తే చాలు... ప్రిస్క్రిప్షన్ అక్కర్లేదు, రూల్సూ అక్కర్లేదు.. సిల్డెనాఫిల్ టాబ్లెట్లను డోర్ డెలివరీ చేసేస్తోంది. ఇలా అమ్ముతున్నది ఏదో ఆషామాషీ సంస్థ కాదు... విశ్వవిఖ్యాత ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్!

సరగసీ ఉత్తదే!

ఆ బిడ్డ సరగసీ ద్వారా జన్మించలేదు
డీఎన్ఏ పరీక్ష ద్వారా తేలిన వాస్తవం
ఒప్పందానికి ముందే ఝాన్సీ గర్భవతి
పుట్టిన బిడ్డను తీసుకునేందుకు గుంటూరు దంపతుల ఒప్పందం
కడుపులో ఆడబిడ్డని తెలిసి దూరం
దాంతో బయటపడ్డ సరగసీ నాటకం

హైదరాబాద్ సిటీ, చార్మినార్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సరగసీ ఉత్తదే! ఆ బిడ్డ సరగసీ ద్వారా పుట్టలేదు! ఈ విషయం గుంటూరు దంపతులకూ తెలుసు! మహబూబ్‌నగర్ దంపతులకూ తెలుసు! అయినా, చివరి వరకూ హైడ్రామా! చివరకు, ఆ బిడ్డ మహబూబ్‌నగర్ దంపతుల బిడ్డే అని డీఎన్ఏ పరీక్ష తేల్చింది. వారి డీఎన్ఏ ఆ బిడ్డ డీఎన్ఏతో సరిపోలింది. సరగసీ ద్వారా బిడ్డకు

మిగతా 14వ పేజీలో...

థాయ్ మసాజ్ రట్టు

స్పా, మసాజ్ పార్లర్లలో హైటెక్ వ్యభిచారం
ఉద్యోగాల పేరిట విదేశీ యువతులకు గాలం
గుట్టు రట్టు చేసిన సైబరాబాద్ పోలీసులు
34 మంది థాయ్ యువతుల గుర్తింపు
పునరావాస కేంద్రానికి 65 మంది తరలింపు
19 మంది మసాజ్ నిర్వాహకుల అరెస్ట్
ఎడిక్షన్ బాధితుడిని విచారించగా బట్టబయలు

మాదాపూర్/గచ్చిబౌలి, ఆగస్టు 20: పేరుకేమో స్పా, మసాజ్ పార్లర్లు! లోపల జరిగేదేమో పక్కా వ్యభిచారం. సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలి, రాయదుర్గం, మాదాపూర్ ప్రాంతాల్లోని ఈ తరహా స్పా, మసాజ్ సెంటర్ల గుట్టును మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలు రట్టు చేశాయి. శనివారం రాత్రి మాదాపూర్‌లోని తంత్ర స్పా, ఆరా స్పా, సప్త, రివేరా, మోహమ్, బ్లీచ్‌తో పాటు 9 మసాజ్ సెంటర్లపై పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 34 మంది థాయ్‌లాండ్ యువతులు, 21 మంది ఈశాన్య రాష్ట్రాల

మిగతా 6వ పేజీలో...

నిజామాబాద్ జిల్లాలో అలుగు పారుతున్న సింగీతం రిజర్వాయర్

వానకు విరామం!

నేటి నుంచి తగ్గనున్న భారీ వర్షాలు
ఇక తేలికపాటి నుంచి ఓ మోస్తరు జల్లులే
శని, ఆదివారాల్లో తడిసిముద్దయిన రాష్ట్రం
పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు
వరంగల్, నిజామాబాద్‌లలో అత్యధికం
నీటిపారుదల శాఖలో హై అలర్ట్
ఇంజనీర్లు ఫీల్డ్‌లోనే ఉండాలి: హరీశ్

14

కూరల మంట

రియల్ బూమ్‌తో తగ్గిన సాగు విస్తీర్ణం

భూములను అమ్ముకుంటున్న రైతులు
రాజధాని శివార్లలో 25శాతం తగ్గుదల
వాణిజ్యపంటలపైనే రైతుల ఆసక్తి!
కూరగాయల కొరత నానాటికీ తీవ్రం
ధరలు దిగివచ్చే అవకాశాలు శూన్యం
ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే కొండెక్కిన కూరగాయల ధరలు భవిష్యత్తులో చుక్కలు చూపించనున్నాయా!? మనకు కావాల్సిన కూరగాయలను దిగుమతి చేసుకోవడం తప్ప మరో గత్యంతరం లేదా!? మనకు కావాల్సిన కూరగాయలను మనమే పండించుకుందామని సీఎం కేసీఆర్ స్పష్టం చేస్తున్నా.. రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అన్న జవాబే వస్తోంది. రాష్ట్రంలో కూరగాయల సాగు గణనీయంగా తగ్గడమే ఇందుకు కారణం. రియల్ భూం కారణంగా కూరగాయల సాగును పక్కనబెట్టి, భూములను అమ్ముకోవడమే అసలు కారణం. హైదరాబాద్ శివారు జిల్లాలైన మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండల్లో కూరగాయల సాగు ఎక్కువ. కొత్త జిల్లాలు ఏర్పడడంతో సాగు భూములకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. కొత్త జిల్లాల్లో వివిధ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో రియల్ భూం పెరిగింది. ఫలితంగా సాగు భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. కలలో

మిగతా 14వ పేజీలో...

కమలం గూటికి జగన్!

ఎన్డీయేలో చేరేందుకు రంగం సిద్ధం?
ముగ్గురు బీజేపీ నేతలతో చర్చలు
మధ్యవర్తిగా గాలి జనార్దన రెడ్డి
'రిపబ్లిక్ టీవీ' ప్రత్యేక కథనం

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ఎన్నికల్లో బేషరతు మద్దతు! ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనూ అదే మద్దతు! ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని నిలదీయకుండా... రాష్ట్ర ప్రభుత్వంపై రుసరుసలు! కేంద్రంలో పేరుకు ప్రతిపక్షమైనప్పటికీ... అధికారపక్షానికి అనుబంధంగానే వైసీపీ ఉంటోందనేందుకు నిదర్శనమని ఇప్పటిదాకా విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పుడు ఆ పార్టీ అధినేత జగన్ మరో అడుగు ముందుకు వేయనున్నారని, బీజేపీతో చేతులు కలిపేందుకు సిద్ధపడుతున్నారని తెలుస్తోంది. ప్రముఖ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు అర్ణబ్ గోస్వామి

మిగతా 14వ పేజీలో...

రైలు వస్తుంటే పట్టాలు అమర్చారు

నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- అనుమతుల్లేకుండా మరమ్మతులు
- సమీప స్టేషన్లకు సమాచారం లేదు
- ధ్రువీకరించిన ప్రాథమిక నివేదిక
- ఎనిమిది మందిపై రైల్వే శాఖ వేటు
- నలుగురు అధికారులు సస్పెన్షన్
- సెలవుపై వెళ్లాలని ముగ్గురికి ఆర్డర్
- చీఫ్ ట్రాక్ ఇంజనీరు బదిలీ
- బాధ్యులెవరో తేల్చండి: సురేశ్ ప్రభు
- యూపీలో పట్టాలు తప్పిన గూడ్సు

ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ బోగీల వద్ద జాగిలాలతో తనిఖీ నిర్వహిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

ముజఫర్‌నగర్, ఆగస్టు 20: రైల్వే అధికారుల నిర్లక్ష్యమే 24 నిండుప్రాణాలను బలిగొంది. రైల్వే ట్రాఫిక్ విభాగం .. ఇంజనీరింగ్ విభాగం నడుమ సమన్వయ లోపమే ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి కారణమని స్పష్టమైంది. ఈమేరకు ప్రాథమిక నివేదికను అందజేసినట్లు రైల్వే బోర్డు (ట్రాఫిక్) సభ్యుడు మహ్మద్ జంషెడ్ తెలిపారు. ఉత్కళ్ రైలు ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య 24కి చేరింది. ఈ ఘటనలో మొత్తం 156 మంది గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన ఎనిమిది మంది అధికారులపై రైల్వే శాఖ చర్యలు తీసుకుంది. వీరిలో రైల్వే బోర్డు కార్యదర్శి స్థాయి అధికారి ఉండటం గమనార్హం. రైల్వే బోర్డు(ఇంజనీరింగ్) సభ్యుడు, నార్తరన్ రైల్వే జనరల్ మేనేజర్, ఢిల్లీ డివిజన్ రీజినల్ మేనేజర్‌ను సెలవుపై వెళ్లాల్సిందిగా ఆదేశించారు. ట్రాక్ నిర్వహణను పర్యవేక్షించే సీనియర్ డివిజనల్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్,

మిగతా 16వ పేజీలో...

కేంద్ర మంత్రులూ జాగ్రత్త!

పీఎస్‌యూల వాహనాల దుర్వినియోగం కుదరదు
స్టార్ హోటళ్ల బసలు వద్దు.. ప్రధాని మోదీ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 20: బుగ్గకార్ల సంస్కృతిని వదిలేయాలని ఇప్పటికే పిలుపునిచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. తాజాగా తన మంత్రివర్గ సహచరులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక నుంచి కేంద్రమంత్రులెవరూ అధికారి కార్యక్రమాల కోసం ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేయవద్దని హెచ్చరించారు. ఈ మేరకు ప్రభుత్వం సమకూర్చుతున్న వసతి ఏర్పాట్లనే కచ్చితంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. అలాగే మంత్రిత్వ శాఖలకు చెందిన వివిధ ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఎలాంటి ప్రయోజనాలూ పొందవద్దని మంత్రులను హెచ్చరించారు. ఈ మేరకు సదరు సంస్థలకు చెందిన వాహనాలను

మిగతా 16వ పేజీలో...

వివిధ
ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక

'మట్టిబండి'లో కన్యాశుల్క జైత్రయాత్ర

అలనాటి భాగీరథి సగరుడి పూర్వీకులను పునీతమొనర్చి నట్టే, 'కన్యాశుల్కం' పావన జలాలు మానవాళి అడియాసలకు తిరిగి పొంగెత్తే ఆశల రంగులిస్తాయి. పాతకొత్తల మేలు కలయికగా గతాన్ని దట్టించి, వర్తమానాన్ని ముట్టించి, భవితను రెట్టింపుగా సుసాధ్యం చేస్తాయి. అందుకే ఇవాళ నూట పాతికో మైలురాయి దగ్గర ఆ నాటకం, మన కన్నా ముందు నిలబడి, "నాతో రాగల ధీరులెవ్వరో తెల్పుడీ" అంటూ తెలుగు వారిని పేరు పేరునా పలకరిస్తున్నది.

పురాణ ఇతిహాసాల పరికల్పనలు కేవలం పండిత లోకం ప్రజలకు చెప్పే గాథలుగానే ఉండే కాలం రెండువేల అయిదు వందల ఏళ్ల కిందటిది. ఇవి దృశ్యమానం అయితే ఎలా ఉంటాయి; ఆ రాముడు, ఆ కృష్ణుడు, ఆ రావణుడు, ఆ కౌరవ పాండవులు, ఎలా వీరిని శ్రవ్య గాథల లోంచి దృశ్యకోణంలోకి తీసుకు రావడం? భాస మహాకవి తొలిసారిగా రంగస్థలం అనేదాన్ని భారతీయ సాహిత్యంలో ఊహ చేశాడు. పెద్ద పెద్ద రచనల నుంచి చిన్న ఇతివృత్తాలను ప్రదర్శన యోగ్యంగా మలిచాడు. జన కోలాహలం ఉండే తీర్థాలు, క్షేత్రాలు, వారాంతపు సంతలు, ఇవన్నీ ఈ ప్రదర్శనలకు అనువైన ప్రదేశాలు. భాస నాటక చక్రం పేరిట- రామాయణంపై మూడు, భారతంపై ఏడు, తాను స్వయంగా చెప్పిన నాటక కథలు మూడు. ఈ మూడింటిలో రెండు- 'ప్రతిజ్ఞా యౌగంధరాయణం', 'స్వప్న వాసవదత్తం' కాగా, ఆఖరుది- సాదా సీదా ప్రజలకు చెందిన నాటకం. అదే 'దరిద్ర చారుదత్తం'. అయిదు అంకాలుగా ఈ కథ చెప్పాడు భాస మహాకవి. అయితే ఇది అసంపూర్ణంగా ఉన్న కారణం చేత, తరువాతి శతాబ్దాల్లో శూద్రక మహాకవి ఈ నాటకాన్ని పది అంకాలుగా పూర్తిచేసి, దీనికి 'మృచ్ఛకటికం' (మట్టిబండి)అని పేరుపెట్టాడు. పేరు దగ్గరి నుంచీ శూద్రకుని ఈ నాటకం భాసుడి కొత్తదనాలకు మరింత సంపన్నత తెచ్చి పెట్టింది. వెరసి రెండువేల ఏళ్ల కిందటే, సామాన్య పౌరులు, కన్నం దొంగలు, జూద గాళ్ళు, వేశ్యలు, అధికారం చెలాయించే రాజుగారి బావమరుదులు, విప్లవ కారులు, అందరూ భారతీయ నాటకంలోకి కదిలి వచ్చారు.

శూద్రక కవి 'మట్టి బండి' నాటకం పేరు పెట్టడంలోనే, నాయికానాయకుల పేర్లు ఏవీ లేకుండా, కథలో ఒక కీలక అంశమైన 'మట్టి బండి' పేరు పెట్టి దీన్ని బతుకు మట్టి బండిగా చెక్కాడు. ఇద్దరు స్రష్టల నవ్య ప్రియత్వ భూమిక అయిన ఈ నాటకం ప్రభావంలోనే, తెలుగు వారి ఆధునిక నాటకం 1892లో మూడు పదుల యువకుడైన గురజాడ అప్పారావు కలం నుంచి రూపు దిద్దుకున్నది.

19వ శతాబ్దంలో, వాడుక వచన భాషలో గురజాడ ఎలా ఒక పూర్తి నాటకాన్ని నిర్మించాడో, ఈ నిర్మాణం కోసం ఎలా పాత్రలకు తగిన మాట తీరు, వ్యవహారిక తెనుగు వాడాడో చూస్తే, తెలుగు మాట స్పెల్లింగ్ కూడా, గురజాడ రాసినంత కొత్తగా, తరువాతి ఆధునిక రచయితలు రాయలేక పోయారని గ్రహిస్తాము. ఈ ధైర్యం ఆయనకు కలగడానికి కారణం వేలఏళ్ల కిందటి 'మట్టి బండి'లోనే ఉన్నది. "కొన్ని మాటలు పలికినవి పలికినట్టు రాయడానికి, నాకు తెలుగులో అక్షరాలు సరిపోవడం లేదు, అటువంటి కొత్త అక్షరాలు కావాలి" అని తన కన్యాశుల్కం రెండో పీఠికలో కోరిన అసాధ్యుడు గురజాడ. ఇదే పాత్రలకు తగిన మాట తీరు అలనాడు శూద్రకుడు 'మట్టిబండి'లో వాడాడు. అప్పటికే, దేవనాగరి ఉత్తర భారత దేశంలో ఎన్నో పలుకుబళ్లలో ఉన్నది. ప్రజలే పాత్రలు అయిన ఈ నాటకంలో, శూద్రక కవి నాటకం పేరు నాయికా నాయకుల పేర్లను విస్మరించి, కొత్తగా పెట్టడం, నాటక ప్రదర్శన నియమావళి పాటించక పోవడం, జనసామాన్య కథను కళాత్మక బిగింపుతో ప్రదర్శన యోగ్య నాటకంగా మలచడం, హాస్య రీతిలో కథన పద్ధతిని ఎంచుకోవడం, తన పాత్రలచే భిన్న ప్రాంతీయ పలుకుబడులను మాట్లాడించడం, ఆట ఎక్కడచూసినా, అక్కడి ప్రజలు నాటకంతో మమేకమయ్యేలా జాగ్రత్తలు తీసుకోవడం, ఇవన్నీ చేశాడు. పాత్రల పలుకుబళ్ళు ఆయా ప్రాంతాల పరిమళాలతో ఉండడం శూద్రక కవి చూపిన విశేషం.

ఈ ప్రత్యేకతలను మనం కన్యాశుల్కం నాటకంలో కూడా చూస్తాము. ఒక్క గిరీశం మాత్రమే పట్టణీకరణ చెందిన తెలుగులో ఇంగ్లిష్ మాటలు కలిపి మాట్లాడతాడు. మిగతా పాత్రల మాటతీరు గురజాడ ఎంత జాగ్రత్తగా ఎంపికచేశారంటే, వైదిక బ్రాహ్మణుల మాట తీరు, మఠం శీనులో కలగలిసే భిన్నస్వరాలు చూస్తాము. నాటకం మొదటి దృశ్యాలలోనే, నాజూకు మాటలాడే నాగరికత లేనివాడు పొటిగరాప్పంతులు నౌకరు. ఇలా మాట్లాడేది ఎవరు? ఆ నౌకరే! అతని యజమాని కూడా కొంచెం నాగరికంగానే మాట్లాడుతాడు, ఎందుకంటే ఫోటో స్టుడియో నడుపుతున్నాడు కనుక. ఫోటోగ్రాఫ్లు తీస్తున్నాడు కనుక. --నౌకరు పలికేది పొటిగరాపులు అనే. ఈ మాటల్లోనే ఆ పాత్రను పరిచయం చేశారు రచయిత. ఇది శూద్రక మహాకవి తీసుకున్న జాగ్రత్తలకు తీసిపోని విధానం.

మృచ్ఛకటికంలో పాచికలాట ఉంటుంది, కన్యాశుల్కంలో పేకాట. శృంగారం రెండు వేల ఏళ్ల కిందట ఎలా జనులకు ఒక శక్తివంతమైన ధ్యాసో, పరిమితుల సరళత కూడా ఆ సమాజంలో ఎంతగా ఉన్నదో, శూద్రక కవి చూపుతాడు. ఆ నాటకంలో రక్షకభటులు ఉన్నారు, ఇక్కడా పోలీసు హెడ్, కనిపించని ఎస్.ఐ ఉన్నారు. శకారుడు, తన దురుసు ప్రవర్తనలో, మాటలను డాబుసరిగా లేనివి ఉన్నట్టుగా పలకడం అనే లక్షణం ఉన్నవాడు. కన్యాశుల్కంలో గిరీశం ఈ శకారుడి పోలికల్లో ఉంటాడు. శకారుడు పొరపాటున ఇతిహాసాల్లోని, పురాణాల్లోని పాత్రలను కలగాపులగంచేసి మాట్లాడేస్తూ ఉంటాడు. ఇదే, చాలా శతాబ్దాల తర్వాత ఇంగ్లిష్ నాటకల్లో కూడా 'మాలప్రాపిజమ్'గా మిసెస్ మాలప్రాప్ అనే పాత్ర ఇలా కలగాపులగంగా మాట్లాడడం వలన ఏర్పడ్డది. శ్రీమతి 'మాలాప్రోప్' అనే పాత్ర 1755లో రిచర్డ్ షెరిడన్ రాసిన 'ది రైవల్స్' నాటకంలో దర్శనం ఇస్తుంది. ఇది భారతీయ నాటక రంగం దాదాపు పదిహేను వందల ఏళ్ల కిందటే, శూద్రక కవి రచనలో, శకారుడి ఒక సాకార లక్షణంగా చూపెట్టి, భారతీయ నాటక రంగ శక్తి ఏమిటో కాలానికి నిరూపణ వదిలిపెట్టింది.

పాత గాథల పాత్రలను కలగాపులగం చేయకపోయినా, అడ్డమైన కోతలరాయుడిగా గిరీశం స్వభావ చిత్రణలో ఒక ప్రత్యేకతను చొప్పించారు గురజాడ. ఇందులో వేల ఏళ్ల కిందటి ఒక శకారుడు, తనకు నూట యాభై ఏళ్ల కాలం కిందటి ఒక 'శ్రీమతి మాలప్రాప్' కూడా కనిపిస్తారు. తన నాటక రచనా ప్రక్రియలో భాగంగా గురజాడ షెరిడన్ నాటకం 'ది రైవల్స్' చదివారు కూడా. ఈ దృష్టాంతాలు గురజాడ వారి లైబ్రరీలోని ఈ పుస్తకంలోనే ఉన్నాయి.

శూద్రక కవి రచనలో ఎక్కడా నేరం ఉండదు. ఆర్యకుడి పరివారం అయిన విప్లవకారులు రాజుని చంపి వేసి, తామే రాజ్యాధికారం చేపట్టారన్న వార్త ఊరేగింపుగావచ్చే ఆర్యకుడి కోలాహలం ద్వారా తెలియడం తప్ప ఇంకో సంఘటన ఉండదు. ఇది నాటకంలో దృశ్యమానం కాదు. గురజాడ కన్యాశుల్కంలోనూ నేరం జరగదు, నేరం జరిగిందన్న భావన మాత్రమే రామచంద్రపురం వాసుల మూర్ఖత్వాలకు మంగళ గీతం పాడుతుంది. వారెవరూ కోర్టుకు రారు. బుచ్చమ్మ విషయంలో గిరీశం ఎవరో ఏమీ చెప్పలేక పోతాడు కోపం తప్ప మరో తెలివి లేని అగ్నిహోత్రావధాన్లు, కేసు రాసుకోండి అంటూ ఎద్దేవాచేసి మూసేస్తాడు డిప్టీ కలెక్టర్. కోర్టులకు అందని గిరీశం మోసాన్ని మధురవాణి సాయంతో నిలుపుదల చేస్తాడు, తానూ ఒక ప్లీడరే అయిన సౌజన్యారావు.

కన్యాశుల్క నాటకం నేడు నూట పాతికేళ్ళ ఏకైక ఆధునిక భారతీయ సజీవ నాటకంగా నిలిచిందీ అంటే, మనం చెప్పే ఎన్నో సహేతుకమైన కారణాలతో బాటు, ప్రజలే పాత్రలైన ప్రదర్శన రూపొందిద్దాం అన్న వేలఏళ్ల నాటి భాసుని జేగీయమాన జన చింతన తలకెత్తుకుని శూద్రక మహాకవి స్పర్శవేదిగా నిర్మించిన మృచ్ఛకటికం ప్రాణ తేజం అయిన పట్టిందల్లా బంగారం అయ్యే శక్తిని గురజాడ పొందటమూ ఒక కారణం. అందుకే, కన్యాశుల్క కోలాహలంలో దాగిఉన్న మహానది మృచ్ఛకటికం కూడా. నదులను కలపగలిగిన వారిని భగీరథులు అంటాము. ఆ కోవలో గురజాడ కూడా ఆధునిక మహాప్రవాహానికి దారులుతీసిన అక్షర భగీరథుడే. అలనాటి భాగీరథి సగరుడి పూర్వీకులను పునీతమొనర్చి నట్టే, కన్యాశుల్క పావన జలాలు మానవాళి అడియాసలకు తిరిగి పొంగెత్తే ఆశల రంగులిస్తాయి. పాతకొత్తల మేలు కలయికగా గతాన్ని దట్టించి, వర్తమానాన్ని ముట్టించి, భవితను రెట్టింపుగా సుసాధ్యం చేస్తాయి.

అందుకే సాగుతున్నది మట్టి బండిలో, మట్టి గుండెల కన్యాశుల్క ధ్వన్యాలోక జైత్ర యాత్ర. ఇది జీవన పాత్రోచిత ఆకాంక్షా కేతనాలెత్తి నడిచే దరిద్ర చారుదత్తుల, ప్రేమ స్వరూపిణులైన వసంతసేన, మధుర వాణుల, పిచ్చి బుచ్చమ్మల, రదనికల, మీనాక్షుల, శర్విలకుల, వెర్రి వెంకటేశాల సౌజన్య చైతన్య ఉత్తుంగ కోలాహలం. దీనికే గురజాడ పెట్టిన పేరు, పాత కొత్తల మేలు కలయిక. 1910లో ముత్యాల సరాలలో ఈ లక్ష్యం తనది అని వాచ్యం చేశాడు కానీ, మహారాజా ఆనంద గజపతి ప్రేరణతో తాను యువకుడిగా రాసిన 1892 నాటి నాటక రచనలోనే, ఈ కళా ప్రమాణాల కోసమని వ్యవహారిక గంగావతరణానికి నడుం కట్టి, వ్యవహారికం అంటే కేవలం భాష కాదు అనీ మొత్తం జీవన వ్యవహారమే ప్రజానుకూల పథాల పయనించాలనీ అందుకై సాహిత్య దీపాలు తాను వెలిగిస్తాననీ ముందుకొచ్చిన సృజన దీపక రాగం గురజాడ అప్పారావు. అందుకే ఇవాళ నూట పాతికో మైలు రాయి దగ్గర ఆయన నాటకం, మన కన్నా ముందు నిలబడి, "నేనింకా ముందుకు పోతాను, నాతో రాగల ధీరులెవ్వరో తెల్పుడీ" అంటూ తెలుగు వారిని పేరు పేరునా పలకరిస్తున్నది.

మహాకవి మనకిచ్చిన మహత్తర కానుక పట్ల కృతజ్ఞతా భారంతో మరిన్ని ఆచరణల దారులుతీస్తూ, నవీన సృజనతో ఎదురెళ్లడమే వర్తమానతరాలుగా మనం చేయవలసిన పని.

■ రామతీర్థ
98492 00385

(గురజాడ 'కన్యాశుల్కం' తొలి ప్రదర్శన జరిగి 125 ఏళ్లయిన సందర్భంగా ఆగస్ట్ 25 నుంచి 27 వరకు విజయనగరం, విశాఖపట్నం వేదికల్లో జాతీయ ఉత్సవాలు జరుగుతాయి.)

పద్యానిదేముంది

పద్యానిదేముంది పిలిస్తే వస్తుంది
బుజ్జి కుక్క పిల్లలానో, పాదాల్ని చల్లగాతాకే సముద్రపు అలల్లానో
నక్షత్రాలన్నీ రాలిపోయిన నల్లటి ఖాళీ ఆకాశంలానో
తెల్లటి లిల్లీ పూల గాఢ పరిమళంలానో
గడ్డిపరకల మైదానాల కింద దాగిన వానపాముల గుంపులలానో
పద్యాలు వస్తాయి ఎలానో ఓలాగా

అడవి దారుల్లో రాలిపడిన
ఎండుటాకుల్లానో
కురియని మేఘాల్లానో, నిశ్చల
జలపాతాల్లానో
కాలాన్ని మోస్తున్న ముసలి అవ్వ
ముఖంపైన ముడతల్లానో
కాందిశీకుల పగిలిన బరువైన
పాదాల చప్పుడుల్లానో
అనాథపిల్లల గుక్కపట్టిన కన్నీళ్ల
ఉప్పటి తడిలానో
అవి వస్తాయి ఎలాగోలా

పద్యాలు రాయడమంటే ఏమిటి చెప్పు
ఖాళీ డబ్బాలో రాళ్లను వేసి గలగలలాడించినట్లు
మనలోకి కాసిన్ని అక్షరాల్ని ఒలికించుకుని
పిలిస్తే రావూ పద్యాలు పరుగెత్తుకుని గజ్జల గుర్రాల్లా
మనక్కొంచం మాయచేయడం రావాలంతే
మనలో లేనిదేదో కొంచం చూపించడం రావాలంతే

నిప్పును రాజేసే పద్యాలనైనా, పగిలిన కలల గాయాలనైనా
మన ఆత్మలోకపు దివాళానైనా, మన అతిశయపు గెలుపులైనా
పద్యాలదేముంది అవి వస్తాయి ఎలావోలా
గొర్రెల మందలలా ఒకదానివెనుక మరొకటి సాగుతాయి
మనం పద్యాల్ని కాస్తున్నప్పుడైనా
గొర్రెల కాపరుల్లా కళ్లపై అరచేతిని గొడుగులా పట్టి
చీకటి ఆకాశంలో ఒక పద్యం మిణుగురు చుక్కలా మెరిసేదాకా వెతకగలగాలి
బహుశా అది శంఖం వినిపించే సముద్రపు ఘోషలా
మనకు అసలైన పద్యాన్ని రాసే దారి చూపుతుందేమో

■ విమల

సదాచరణ

ఎవరు నేసారో ఈ సదాచార చెరని
చిక్కగా ఒంటికి కట్టబెట్టారు

వాకిట్లో ఇసుకగూళ్ళు కట్టుకుని
ఆడుతున్న
నా పసరు నేలపై... లేత సిగ్గు గూళ్ళు
మొలిచాయని
నిండు నిలువుగా తాటాకు కొంగును చుట్టబెట్టారు

తొక్కుడుబిళ్ళ గళ్ళలో గంతులేస్తున్న
ఆటవిడుపుతనానికి పసుపు రాసి
ఘాటైన లక్ష్మణ రేఖ గడి పెట్టారు

ముందుచూపుకు ఎర్రని కుంకుమ...
ఆశల రెప్పలకు నల్లని చీకటిని దిద్దారు

పారాణి కుచ్చిళ్ళలో కట్టుబాట్ల కలనేతలు పూసి
కాలి అంచుల పగ్గపు ఊరేగింపు మువ్వలు కట్టారు

జీరాడే అంచుల్లో వంటింటి ఊచల
నిలువు గీతలు అడ్డంగా అద్దారు

పైటంచులో పొగ చూర్ణపు వర్ణ చిత్రాలు
నొసటంచులో కొత్త పుంతల రంగులరాట్నం
నన్ను నాలో తిప్పేస్తున్నా...
ఉడికుడికి ఊడిపోదేం నగ్న తిత్తి నన్నొదిలి..?!

■ సత్యా సూఫీ
97013 83438

మాలతీ చందూర్ పురస్కారం

రచయిత్రి, చిత్రకారిణి, బుచ్చిబాబు సతీమణి శివరాజు సుబ్బలక్ష్మి గారికి మాలతీ చందూర్ పురస్కారాన్ని ప్రదానం చేసే సభ అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి, చెన్నై ఆధ్వర్యంలో ఆగస్టు 21 సా.6గం.లకు డా.నందమూరి తారక రామారావు కళామండపం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు నందు జరుగుతుంది. ముఖ్య అతిథి కె. రోశయ్య; గౌరవ అతిథులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, డి. వెంకట్రామయ్య, సి.మృణాళిని, కె.శంకర్రావు (అజంతా); వ్యాఖ్యాత రెంటాల జయదేవ.

- పొట్టిశ్రీరాములు స్మారక సమితి

'మిర్గం' ఆవిష్కరణ

తెలంగాణ కవుల కవితా సంపుటి 'మిర్గం' ఆవిష్కరణ, వనపట్ల సుబ్బయ్యకు తెలంగాణ సాహిత్య కళావేదిక పురస్కార ప్రదానోత్సవ సభ ఆగస్టు 27 సా.5.30గం.లకు దొడ్డి కొమరయ్య హాల్, సుందరయ్య విజ్ఞానకేంద్రం, హైదరాబాద్ నందు జరుగుతుంది. అధ్యక్షులు ఏనుగు నరసింహారెడ్డి, ముఖ్య అతిథి ఘంటాచక్రపాణి, విశిష్ట అతిథి రాజేందర్‌జింబో.

- అమ్మంగి వేణుగోపాల్

పల్లేరు స్వయంప్రభ పురస్కారం

పల్లేరు స్వయంప్రభ సాహితీ పురస్కారాన్ని బి.ఎస్. రాములు ఆగస్టు 26 మ.12గం.ల నుంచి స్వర్ణ గార్డెన్స్, అంబేడ్కర్ చౌరస్తా, పరకాల (వరంగల్ జిల్లా)లో జరిగే సభలో అందుకుంటారు. ముఖ్య అతిథి దేవులపల్లి ప్రభాకర్‌రావు; సభాధ్యక్షులు టి. రంగస్వామి; గౌరవ అతిథి పసునూరి దయాకర్.

- టి. రంగస్వామి

బంజారాలపై జాతీయ సదస్సు

మూడు వందల ఏళ్ల క్రితం దక్షిణ భారత దేశంలో జన్మించి, బంజారాల ఆర్థిక, సాంఘిక సమస్యలను అర్థంచేసుకొనేందుకు శ్రమించిన సద్గురు సేవాలాల్ జీవితాన్ని, సామాజిక కార్యక్రమాలకు చర్చించేందుకూ, బంజారా సమాజపు సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక సాహిత్య కోణాలను చర్చించేందుకు ఆగస్టు 21 ఉ.10గం.ల నుంచి హైదరాబాదు విశ్వవిద్యాలయం హ్యూమానిటీస్ హాలులో జాతీయ సదస్సు జరుగుతుంది.

- ఆర్.ఎస్. సర్రాజు

చిన్న కథలకు ఆహ్వానం

సోమేపల్లి కుటుంబం నిర్వహిస్తున్న చిన్న కథల పోటీకి కథలు పంపమని కోరుతున్నాం. బహుమతులు అత్యుత్తమ కథకు రూ.2,500, ఉత్తమ కథకు రూ.1500, మంచి కథకు రూ.1000. కథల నిడివి ఐదు పేజీలలోపు కాగితం ఒకవైపు, డిటిపి ఐతే రెండు పుటలు. కథలను సెప్టెంబర్ 30లోపు రమ్యభారతి, పి.బి.నెం.5,11-57/1-32, జె.ఆర్. కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజకవీధి, విజయవాడ, ఫోన్ 92474 75975కు పంపాలి.

- చలపాక ప్రకాష్

నల్లమల పోరాటానికి యథార్థ చిత్రణ

నక్సలైట్ ఉద్యమాన్ని చిత్రిస్తూ చాలా సాహిత్యం ఉత్పన్నమైంది. ఇదివరకు అల్లం రాజయ్య 'వసంత గీతం' అనే ఒక మంచి నవలను రచించాడు. అదే ఒరవడిలో పి.చంద్ 'నల్లమల' పేరుతో, ఒక దశలో నల్లమల అడవుల్లో కేంద్రీకృతమైన ఈ మావోయిస్టు ఉద్యమాన్ని అత్యంత వాస్తవికంగా చిత్రించాడు. నవలల్ని ఎవరూ చదవడంలేదనుకుంటున్న తరుణంలో 419 పేజీల ఈ బృహత్ నవలను రచించినందుకు పి.చంద్‌ను అభినందించాలి.

1980లలో నక్సలైట్ ఉద్యమం నల్లమల అడవుల్లో కేంద్రీకృతమైంది. అంతకుముందు శ్రీకాకుళం ప్రాంతంలోనూ, ఉత్తర తెలంగాణ ప్రాంతంలోనూ కేంద్రీకృతమైన ఈ ఉద్యమం మహబూబ్ నగర్ - కర్నూలు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న నల్లమల అడవులకు వెళ్లిపోయింది. నల్లమలలో 30సంవత్సరాల పాటు సాగిన ఈ ఉద్యమ స్వరూపాన్ని సమగ్రంగా ఈ నవలారూపంలో మన ముందుంచటంలో పి.చంద్ చాలా వరకు కృతకృత్యుడయ్యాడనే చెప్పవచ్చు.

'నల్లమల' నవలను వసంత అనే పాత్ర 'నేనూ' అంటూ ఉత్తమ పురుషలో చెప్పినట్టుగా రచయిత ఈ నవలకు రూపకల్పన చేశాడు. ఈ వసంత అనే బడుగు బలహీన వర్గానికి చెందిన స్త్రీ నక్సలైట్ ఉద్యమంలో చేరడంతో నవల ప్రారంభమౌతుంది. సాధారణంగా ఉత్తమపురుషలో కథచెప్పే పాత్ర నవలలో ప్రధానపాత్రగా ఉంటుంది. కానీ ఈ నవలలో వసంత ప్రధానపాత్ర కాదు. తన చుట్టూ జరుగుతున్న అనేక సంఘటనలకు ఆమె కేవలం సాక్షీభూతురాలు మాత్రమే. ఆమె మావోయిస్టు పార్టీలో చేరి పోరాటంలో పాల్గొన్నది కాబట్టి నవలంతా మావోయిస్టులకు అనుకూలంగానే, వాళ్లు చేపట్టిన ప్రతి చర్యను సమర్థిస్తూనే సాగుతుంది. రచయిత వసంత అనే మావోయిస్టు చేత కథ చెప్పిస్తున్నాడు కాబట్టి నవలంతా మావోయిస్టుల దృక్కోణంలోంచే సాగిందని ఎవరూ తప్పుపట్టటానికి వీల్లేకుండా రచయిత జాగ్రత్త పడ్డాడు. శిల్పపరంగా పి.చంద్ విజయమిది.

అడవుల్లో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరగటం, అటువైపు కొందరు, ఇటువైపు కొందరు మరణించటం జరుగుతుంటుంది. ఈ నవలలోని ఇలాంటి సంఘటనలతో పాటు నల్లమల అడవుల్లో నివసిస్తున్న చెంచుల జీవన విధానాన్ని రచయిత ఎంతో వాస్తవికంగా చిత్రించటంవల్ల ఈ నవలకొక ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తున్నది. చెంచుల జీవితాలను లోతుగా చిత్రించటానికి ఈ రచయిత అడవుల్లోకి వెళ్లి కొంతకాలం చెంచులతో కలిసి జీవించాడని తెలుస్తున్నది. చెంచులను గురించి కిరణ్ అన్న మావోయిస్టు నాయకుడు ఇలా చెబుతాడు: "మొదట్నించి కూడా చెంచులు వేట మీద, అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడి సంచార జీవితానికే అలవాటు పడ్డారు. వారికి వ్యవసాయం మీద ఆసక్తి ఉండేది కాదు. నిజాం కాలంలో చెంచులకు స్థిర నివాసం ఏర్పాటు చెయ్యటానికి ఒక ప్రయత్నం జరిగింది. ఆరోజుల్లోనే ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త హేమన్ డార్ఫ్ చెంచుల మీద అధ్యయనం చేసిన సూచనలను బల్మూరు, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో అమలు చేసే ప్రయత్నమైతే జరిగింది కాని అది అంత సఫలం కాలేదు" అంటాడు.

ఇంకా చెంచులను గురించి కిరణ్ ఇలా చెబుతాడు:

"ఒక స్థాయిలో చెంచులకు వ్యవసాయం అలవాటు చెయ్యటానికి చాలా ప్రయత్నాలు జరిగినవి. చెంచులకు భూమి ఇవ్వటమే కాకుండా పశువులను, పనిముట్లను ఇవ్వడం కూడా జరిగింది. దానికి తోడు మైదాన ప్రాంతాలకు చెందిన సుగాలీలు, పేదలైన మాలమాదిగలకు కూడా కొంత భూమిని ఇచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. కనీసం వారిని చూసైనా చెంచులు స్థిరనివాసానికి అలవాటు పడ్తారని ఆశించారు. కానీ ఆ ప్రయత్నం కూడా విఫలమైంది. చివరకు చెంచులు ప్రభుత్వం ఇచ్చిన భూములను, పశువులను కూడా అమ్ముకొని మరింత లోతట్టు అడివి ప్రాంతాలకు పోయి బతికింద్రు తప్ప వ్యవసాయానికి అలవాటు పడలేదు".

మావోయిస్టు పోరాటం ఎప్పుడూ విజయవంతంగా శత్రువులను ఎదురుకున్నది అని చెప్పడం కాకుండా ఈ పోరాటం ఎదురుకున్న అనేక ఎదురుదెబ్బల్ని వాస్తవికంగా తన నవలలో చిత్రించినందుకు పి. చంద్‌ను అభినందించాలి.

స్వాతంత్ర్యం తర్వాత చెంచుల పరిస్థితి మెరుగు కాకపోవటం అటుంచి ఇంకా దిగజారింది అంటాడు కిరణ్. అడవిలో బతికే చెంచుల మీద ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించటంతో వాళ్ళ బతుకులు ఇంకా అధ్వాన్నమైపోయాయంటాడు. ఇలాంటి పరిస్థితుల్లో చెంచుల గుడారాల్లోకి మావోయిస్టులు ప్రవేశించారు. చెంచు తెగకు చెందిన లక్ష్మక్క కుటుంబ హింసను ధిక్కరించి మావోయిస్టు ఉద్యమంలో చేరుతుంది.

ఈ నవలలోని ముఖ్య పాత్రల్లో మాధవ్ ఒకడు. అతని జీవిత సహచరి శాంత కూడా ఒక ముఖ్య పాత్రే. నిజానికి ఈ నవలలో మాధవే నవలంతా ఉండాలి, అతని చుట్టే నవలంతా తిరుగుతుంది అనుకుంటాం. కానీ చెంచు జాతికి చెందిన అనేకమందిని పాత్రలుగా ఈ నవలలోకి తీసుకురావడంతో మాధవ్ పాత్రకు లభించాల్సినంత ప్రాధాన్యత లభించలేదనిపిస్తుంది. ఒక నాయకుడి పాత్ర ద్వారానే నవలంతా నడిచి ఉంటే ఈ నవల ఇంకా ఆసక్తికరంగా ఉండేది.

నల్లమలలోని భౌగోళిక వాతావరణాన్ని చెబుతూ రచయిత



"నల్లమలలో అన్ని కాలాలు అతిగానే ఉంటాయి. ఎండాకాలంలో ఎండలు మండిపోతాయి. ఆకురాల్చిన అడవిలో నీడ కూడా దొరకదు. తాగేందుకు గుక్కెడు నీళ్ళు దొరకవు. వర్షాకాలంలో చిన్న వానకే పొంగే సెలయేర్లు, ఎండా కాలంలో బీటలువారి రాళ్లు తేలుతాయి. నిల్వ ఉండే చిన్నచిన్న నీటి గుంటలు (మడకలు) కూడా ఎండిపోతాయి. అక్కడక్కడ కొన్ని మడకల్లో నీరు ఉంటుంది. ఆ నీరు అడవిలోని పశుపక్ష్యాదులకు దాహం తీరుస్తుంది. అటువంటిచోట పులి అడవి జంతువుల కోసం మాటువేసుకొని నీళ్లు తాగటానికి వచ్చిన జంతువులను వేటాడుతుంది."

"ఎండాకాలంలో నీళ్ళ తావులకాడ పోలీసులు దళాల కోసం మాటువేసుకొని ఉంటారు. అటువంటి సమయంలో పరిమితమైన నీటితోనే రోజులు గడపాల్సి వచ్చేది. గొంతులు తడారిపోతోంటే గుక్కెడు గుక్కెడు నీళ్ళతో కాలం వెళ్ళదీయాల్సి వచ్చేది" అంటుంది ఈ కథ చెబుతున్న వసంత.

"చెంచులు బుడ్డగోసులు పెట్టుకొని శతాబ్దాల తరబడి ఈ అడవిలో ఇలాగే బతుకుతున్నారు. ఈ చలికి, ఎండకి, వానకు వాళ్ళ శరీరాలు అలవాటుపడిపోయాయి"- ఇలా నల్లమల అడవుల్లో నివసిస్తున్న చెంచుల జీవితాలకు, వారి జీవన విధానాలకు అద్దం పడుతుందీ నవల. అలాగే నల్లమల అడవుల్లోని ప్రకృతి సౌందర్యాన్ని కూడా ఈ రచయిత అద్భుతంగా వర్ణించాడు. మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఒక భీకర పోరాటంతో రచయిత నవలను ముగించాడు. నల్లమల పోరాటం అత్యంత విషాదాంతంగా ముగిసిందన్న ధ్వని ఈ ముగింపులో ఉంది. నవలలోని చివరిపేజీల్లో ఆ పోరాటాన్ని రచయిత వర్ణించిన తీరు చదువుతున్నవారి గుండెల్ని పిండేసేలా సాగింది.

మావోయిస్టు పోరాటం ఎప్పుడూ విజయవంతంగా శత్రువులను ఎదురుకున్నది అని చెప్పడం కాకుండా ఈ పోరాటం ఎదురుకున్న అనేక ఎదురుదెబ్బల్ని అత్యంత వాస్తవికంగా చిత్రించినందుకు పి. చంద్‌ను అభినందించాలి. 400పేజీలకు పైగా సాగిన ఈ నవల ఎక్కడా విసిగించకుండా చదివిస్తుంది. మావోయిస్టుల పోరాటాన్ని గూర్చి, పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగే ఎదురు కాల్పులను గురించి వినడమే కాని ప్రత్యక్షంగా మనం చూడలేం. కానీ ఈ నవలను చదువుతోంటే అలాంటి దృశ్యాలను ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలుగుతుంది.

■ అంపశయ్య నవీన్

భద్రాద్రిలో మళ్లీ కల్యాణ లడ్డూ

ప్రతిపాదిత ధరలను వెల్లడించిన దేవస్థానం

సెప్టెంబరు ఒకటి నుంచి అమలు..?: ఈవో

భద్రాచలం, ఆగస్టు 20: భద్రాచంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మళ్లీ కల్యాణ లడ్డూ ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. 500 గ్రాముల కల్యాణ లడ్డూ ప్రపాదిత ధర రూ.100గా, వంద గ్రాముల లడ్డూ ధర రూ.20గా ప్రతిపాదిస్తూ ఈవో ప్రభాకర శ్రీనివాస్ నిర్ణయం తీసుకున్నారు. ప్రసాదం బరువు ధరలపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు లిఖితపూర్వకంగా పది రోజుల్లోపు దేవస్థానం కార్యాలయానికి అందజేయాలని భక్తులను ఆయన కోరారు. భక్తుల నుంచి సానుకూల స్పందన వస్తే సెప్టెంబరు ఒకటి నుంచి ప్రకటించిన ప్రసాద బరువు, ధరలను అమలు చేయనున్నట్లు ఈవో వెల్లడించారు. కాగా, భద్రాద్రిలో కల్యాణ లడ్డూ విక్రయాల నిలిపివేతపై భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. గతంలో నష్టం వస్తోందనే సాకుతో విక్రయాలు నిలిపివేశారు.

యాదాద్రి టౌన్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ధర్మదర్శనానికి 4 గంటల సమయం పట్టింది. స్వామి వారినిత్యకల్యాణోత్సవంలో 114 మంది దంపతులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సత్యనారాయణస్వామి వ్రత పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేకువజామునే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపిన అర్చకులు బాలాలయ కవచమూర్తులకు ఆరాధనలు జరిపారు. ఆలయ మండపంలో అభిషేకం, అర్చనలు హోమపూజలు, నిత్యకల్యాణం కొనసాగాయి.

రాజన్న సన్నిధిలో రుద్రయాగం

వేములవాడ, ఆగస్టు 20: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో ఆదివారం రుద్రయాగం ఘనంగా నిర్వహించారు. శ్రావణ చతుర్దశి, మాస శివరాత్రి సందర్భంగా వేదపండితులు ఉదయం శ్రీరాజరాజేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రావణమాస ప్రత్యేక పూజల సత్వర ఫలితం కోసం శ్రీస్వామివారి కల్యాణ మంటపంలో రుద్రయాగం నిర్వహించి పూర్ణాహుతి గావించారు. సాయంత్రం స్వామి వారికి మహాలింగార్చన చేశారు. ఈ సందర్భంగా 365 మట్టి లింగాలను రూపొందించి లింగాకారంలో అమర్చారు. 365 పిండి ప్రమిదలను లింగాకారంలో అమర్చి జ్యోతులు వెలిగించారు.

పూర్ణాహుతి గావిస్తున్న అర్చకులు

‘పాలమూరు’ కోసం పోరాటం: రాఘవాచారి

షాద్‌నగర్‌టౌన్: పాలమూరు జిల్లా వాసుల గొంతు ఆరిపోకుండా.... రైతులకు సాగు కోసం నీరు అందే విధంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల సాధనకు పార్టీలకు అతీతంగా ఉద్యమం కొనసాగించాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి పిలుపునిచ్చారు. ఆదివారం షాద్‌నగర్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతూ నల్గొండ జిల్లాకు న్యాయం చేస్తూ పాలమూరు జిల్లాకు మాత్రం ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. జూరాల నుంచి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఫేజ్-1గా చేపట్టాలని, శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి చేపట్టిన భాగాన్ని ఫేజ్-2గా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగం చేసి భూముల ముంపు నివారించి రైతులకు కాపాడాలని డిమాండ్ చేశారు. పాలమూరు పథకంలో నార్లాపూర్ నుంచి డిండి పేరిట నీరు తరలించే పథకాన్ని వెంటనే ఆపాలని అన్నారు. నిర్మాణం చివరి దశలో ఉన్న కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ పథకాలు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణాకు కేటాయింపున్న కృష్ణా నది నీటిని రాష్ట్రంలో మళ్ళీ పంచి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు న్యాయమైన వాటా ఇవ్వాలని పేర్కొన్నారు. చేవెళ్ళ నుంచి గోదావరి నీటిని షాద్‌నగర్ నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లికి తీసుకురాగల అవకాశాలను పరిశీలించాలని కోరారు. 28న జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో చేపట్టే ఉద్యమంలో పార్టీలకు అతీతంగా ప్రతిపక్షాల ప్రజాప్రతినిధులు, నేతలు పాల్గొని ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, సీపీఎం, సీపీఐ నాయకులు హాజరయ్యారు.

అన్నారం బ్యారేజీ పనులు పరిశీలిస్తున్న చైర్మన్ ప్రకాశ్‌రావు

లక్ష్యంలోగా కాళేశ్వరం పూర్తి

- టీడబ్ల్యూఆర్డీసీ చైర్మన్ వి.ప్రకాశ్‌రావు

మహదేవపూర్: తెలంగాణకు వరప్రదాయిని కానున్న కాళేశ్వరం ప్రాజెక్టును అనుకున్న సమయంలోగా పూర్తవుతుందని తెలంగాణ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న కన్నెపల్లి పంప్‌హౌజ్, అన్నారం బ్యారేజీ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్షలు నిర్వహిస్తున్నారని, నిర్దేశిత లక్ష్యంలోగా ప్రాజెక్టులు పూర్తి చేసి పంటలకు నీరందించనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకానికి కూడా ఇక్కడి నుంచి నీరు తరలించనున్నట్లు తెలిపారు.

బోనం.. తెలంగాణ సంస్కృతికి ప్రాణం: స్వామి గౌడ్

ఆదిభట్ల: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలకు శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి గౌడ్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతిలో భాగంగా అభివర్ణించారు. గ్రామాల్లో కులమతాలకు అతీతంగా అందరు సమష్టిగా జరుపుకునే పండుగ అని తెలిపారు.

భూవివాదంలో దేవాదాయశాఖ ఈవో!

- జగ్గయ్యపేట పీఎస్‌లో ఛీటింగ్ కేసు

జగ్గయ్యపేట: తెలంగాణా రాష్ట్రం ప్రసిద్ధ శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవస్థానం ఈవో చిట్టిప్రోలు సత్యనారాయణపై కృష్ణాజిల్లా జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఛీటింగ్ కేసు నమోదైంది. జగ్గయ్యపేటకు చెందిన కర్నాటి పున్నమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. తన ఆరో సంతానమైన ఉష, ఆమె భర్త చిట్టిప్రోలు సత్యనారాయణతో వచ్చి మాయమాటలు చెప్పి ఖాళీ స్టాంపు పేపర్లపై సంతకం చేయించుకుందని పున్నమ్మ తెలిపింది. పట్టణ శివారు పద్మావతినగర్‌లో ఉన్న 1.38 ఎకరాల భూమిని ఆమెకు ఇచ్చినట్టు రాయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొంది. ఇటీవల ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని లీగల్ నోటీసులు ఇచ్చారని పేర్కొంది. తనకు ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారని, ఆస్తిని ఎవరికీ దక్కకుండా చేయాలనే కుట్రతో మోసం చేసి ఆస్తి రాయించుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఉష, సత్యనారాయణలపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలి

- ఉప ముఖ్యమంత్రి కడియం
- వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్
- కేసీఆర్‌కు అవార్డు గర్వకారణం: పోచారం
- ఆలయాల అభివృద్ధికి 50 కోట్లు: అల్లోల
- ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి: జగదీశ్
- బీసీల అభివృద్ధికి సీఎం కృషి: డీఎస్

సర్వేల్‌లో భవన సముదాయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కడియం శ్రీహరి, మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: తెలంగాణలో చదివిన ప్రతి విద్యార్థి ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్‌లోని గురుకుల పాఠశాలలో రూ.18.61 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన భవన నిర్మాణ పనులు, మౌలిక సదుపాయల కల్పనకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. సర్వేల్ గురుకుల పాఠశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు రాష్ట్రం, దేశం, ప్రపంచం గర్వించే స్థాయిలో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వ్యవసాయానికి అసెంబ్లీలో ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెడ్తామని ఆ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రైతుల పాలిట దేవుడు అన్నారు. కేసీఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు రావడం తెలంగాణ ప్రజలకు గర్వకారణమన్నారు. రైతులకు 9 గంటల నాణ్యమైన కరెంటు, కోటి ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులు, రైతులకు పెట్టుబడిగా ఎకరాకు రూ.4 వేలు, మిషన్ కాకతీయ కింద చిన్ననీటి వనరుల అభివృద్ధి, 5వేల ఎకరాలకు ఓ ఏఈఓ నియమాకం, రుణమాఫీ తదితర వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలే సీఎంకు అవార్డు వచ్చేలా చేశాయన్నారు. వ్యవసాయ రంగంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అప్పులు, ఆత్మహత్యలు లేని రైతులున్న తెలంగాణను నిర్మించటమే లక్ష్యంగా కేసీఆర్ శ్రమిస్తున్న తీరును గుర్తించిన స్వామినాథన్ కమిటీ వ్యవసాయ నాయకత్వ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. శ్రీరాంసాగర్, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తయితే 3 పంటలకు సమృద్ధిగా సాగు నీరు అందుతుందన్నారు. పంట దిగుబడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, రైతును - కొనుగోలుదారుడిని అనుసంధానం చేసి రైతును రాజును చేసి చూపుతామన్నారు. కేసీఆర్‌కు అవార్డు రావడాన్ని కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని పోచారం ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కోర్టుల్లో కేసులు వేస్తున్న కాంగ్రెస్ నేతలకు న్యాయస్థానాలు కూడా మొట్టికాయలు వేస్తున్నాయన్నారు. ప్రజలు కూడా అసహించుకుంటున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆపబోమన్నారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.50కోట్లను కేటాయించినట్లు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌లోని అతి పురాతనమైన త్రిలింగేశ్వరాలయంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతనమైన ఈ ఆలయ అభివృద్ధి కోసం సుమారు రూ.కోటి వరకు మంజూరు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆర్యవైశ్యులకు అన్ని విధాలా సముచిత స్థానం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన వైశ్య సంఘటన్, ఆర్యవైశ్య శ్రావణమాస వనభోజన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం మార్కెట్ ఆవరణలో హరితహారంలో ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సామాజిక సేవలో ఆర్యవైశ్యుల పాత్ర మరువలేనిదన్నారు. వైశ్యులకు రాజకీయ అవకాశాలు కల్పించే విధంగా సీఎం కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ బీసీ కులాల అభివృద్ధికి పాటుపడుతున్నారని రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ లోని ప్రగతినగర్ మున్నూరు కాపు కల్యాణ మండపంలో మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులు డీఎస్, ఎమ్మెల్సీ ఆకుల లలిత, నగర మేయర్ ఆకుల సుజాత తదితరులను జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బీసీల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ బీసీల వెన్నంటే ఉన్నారని, మున్నూరు కాపుల కోసం ఎలాంటి సహకారం అందించడానికైనా ఆయన సిద్ధమని డీఎస్ పేర్కొన్నారు.

నెత్తిమీద టోపీలు తప్ప ఏమీ మారలేదు..?

టీ-మాస్ ఆవిర్భావ సభలో గద్దర్ బృందం ఆటాపాట

- టీ-మాస్ ఆవిర్భావ సభలో ప్రజా గాయకుడు గద్దర్
- రాజకీయశక్తిగా టీ-మాస్: ప్రొఫెసర్ కంచె ఐలయ్య
- అందరికీ అండగా టీ-మాస్: తమ్మినేని వీరభద్రం

పాలమూరు: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయినప్పటికీ నాయకుల నెత్తి మీద టోపీలు తప్ప ప్రజల స్థితిగతులు మారలేదని ప్రజాగాయకుడు గద్దర్ విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన టీ-మాస్ ఆవిర్భావ సభలో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు అవుతున్నా ప్రజల జీవన స్థితిగతుల్లో మార్పురాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరానికి పార్టీలను మారుస్తున్న రాజకీయ నాయకుల నెత్తి మీద టోపీలు మాత్రం మారుతూ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 93 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనారిటీలు, సబ్బండ కులాల జనులు, మహిళలు సామాజిక న్యాయం కోసం ఎదురు చూస్తుంటే, ప్రభుత్వం ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. ‘శ్రమ చేయని మీరు (అగ్రవర్ణాలు) నెయ్యి దగ్గర... కష్టపడి పనిచేసిన మేము పియ్యి (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు) దగ్గర ఉండడమేమిటని’ ప్రశ్నించారు. ప్రొఫెసర్ కంచె అయిలయ్య మాట్లాడుతూ 93 శాతం ఉన్న ప్రజలందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని, అందుకోసమే టీ-మాస్ రాజకీయ శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాట్లాడుతూ గతంలో సీపీయం పార్టీ నాలుగు నెలల పాటు నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను గుర్తించిందన్నారు.

ఎల్లంపల్లి నీటి కోసం పాదయాత్ర

కొడిమ్యాల, ఆగస్టు 20: ఎల్లంపల్లి నీటితో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పోతారం చెరువు నింపాలని అఖిపక్షం ఆధ్వర్యంలో పోతారం చెరువు నుంచి కలెక్టరేట్ వరకు ఆదివారం మహా పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర, టీడీపీ నాయకుడు, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నీరులేక సిరుల పండించే భూములు బీళ్లుగా మారుతున్నాయని అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలలోపు పోతారం జలాశయం నింపకుంటే అసెంబ్లీ ముట్టడిస్తామని పేర్కొన్నారు. ఈ పాదయాత్రలో బీజేపీ, నాయకులు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న అఖిల పక్షం నాయకులు

సభలో మాట్లాడుతున్న డాక్టర్ అంపశయ్యనవీన్

మల్లేష్ అనుభవాల నుంచే ‘కుంపటి’

- పుస్తకావిష్కరణలో అంపశయ్య నవీన్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్: మండవరాజు మల్లేష్ అనుభవాల నుంచే ‘కుంపటి’ కవితా సంపుటి పుట్టిందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. మల్లేష్ కవిత్వం చైతన్యవంతమైన సమాజాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. మహబూబాబాద్‌లోదళిత బహుజన రచయితలు, కళాకారులు, మేధావుల ఐక్యవేదిక(ద.బ.ర.క.మే) ఆధ్వర్యంలో ఆదివారం కవి, గాయకుడు మండవరాజు మల్లేష్ రచించిన ‘కుంపటి’ కవితా సంపుటి పుస్తకాన్ని అంపశయ్యనవీన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లేష్ నిజ జీవితంలో ఎదుర్కొన్న అవమానాలు, బాధలు, గాధలు, అణచివేతలు, కన్నీళ్ల అనుభవాల నుంచి పుట్టినదే ఈ కుంపటి కవితా సంకలనమని అన్నారు.

అమ్మవారికి అలంకరించిన నగలు మాయం

- రూ.10 లక్షల విలువైన ఆభరణాల చోరీ

నగలు అలంకరించిన లక్ష్మీదేవి (ఫైల్)

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 20: శ్రావణ మాసం చివరి శుక్రవారం లక్ష్మీవ్రతం చేశారు.. ఇంట్లో ఉన్న నగలను అమ్మవారికి అలంకరించారు! ఆభరణాలను మూడు రోజులు అలాగే ఉంచడం సంప్రదాయం. ఆదివారం వేకువజామున చూడగా రూ.10 లక్షల విలువైన ఆ నగలతో పాటు వెండి లక్ష్మీదేవి విగ్రహం కూడా మాయమైంది. ఈ ఘటన మహబూబాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం చివరి శ్రావణ శుక్రవారం కావడంతో కాలనీకి చెందిన సురేందర్ ఇంట్లో లక్ష్మీవ్రతం నిర్వహించారు. 13 తులాల బొట్లోర్సా మూడు వరుసల గొలుసు, ఆరు తులాల గుండ్ల హారం, రెండు తులాల సాధారణ గొలుసు, రెండు తులాల చెవికమ్మలు, బుట్టలు, రెండు తులాల చెంపచేరాలు, 5 తులాల నల్లపూసల గొలుసులు అమ్మవారికి అలంకరించారు. 8 తులాల వెండి లక్ష్మీదేవి విగ్రహాన్ని పూజలో ఉంచారు. సంప్రదాయం ప్రకారం లక్ష్మీదేవికి అలంకరించిన నగలు మూడు రోజులు అలాగే ఉంచాలి. ఈ నేపథ్యంలో సురేందర్ ఆదివారం తెల్లవారుజామున 3 గంటల వరకు టీవీ చూస్తూ మెలకువగానే ఉన్నారు. ఆ తర్వాత నిద్రకు ఉపక్రమించిన ఆయన 6 గంటలకు బాత్‌రూంకు వెళ్లేందుకు బయటకు వచ్చారు. ఆ సమయంలో పూజ గది తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించారు. అమ్మవారికి అలంకరించిన నగలు లేకపోవడంతో అవాక్కయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ రాజమహేంద్ర నాయక్, టౌన్ సీఐ జబ్బార్, ఎస్సై తిరుపతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వరంగల్ నుంచి క్లూస్ టీంను రప్పించి వివరాలను సేకరించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే కొంత సమాచారం లభించిందని, త్వరలోనే కేసును ఛేదిస్తామని తెలిపారు.

చోరీలకు సీసీ కెమెరాలతో చెక్

బహిరంగ మలవిసర్జనా కట్టడి.. టీచర్ల సమయ పాలనపై కన్ను

ఓ గిరిజన గ్రామస్థుల హైటెక్ ఆలోచన.. ఊళ్లోని ప్రధాన కూడళ్లలో 24 కెమెరాలు



గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ఆదిలాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అదో మారుమూల గిరిజన గ్రామం.. అక్షరాస్యత కూడా తక్కువే! ప్రజల ఆలోచన మాత్రం ‘హైటెక్’ పుంతలతో ఔరా అనిపిస్తోంది. ఊళ్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలను నివారించేందుకు.. ఊర్లో అంతా పరిశుభ్రత పాటించేందుకు.. టీచర్లు కచ్చితమైన సమయ పాలన పాటించేందుకు ఆ ఊరి గొప్ప ఆలోచనే చేశారు. స్వచ్ఛందంగా తలా ఇన్ని డబ్బులు వేసుకొని ఊళ్లో ఎక్కడికక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇలా నిఘా నేత్రంలో ఊరు ఊరే భద్రంగా ఉన్న ఆ గ్రామమే ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని బాది గ్రామ పంచాయితీ అనుబంధంగా ఉన్న మసాల (బి). ఊళ్లో 180కి పైగా కుటుంబాలున్నాయి. జనాభా 800 పైచిలుకు. నిరుడు ఊళ్లో పలు చోరీలు జరిగాయి. రైతుల పత్తి పంట, వ్యవసాయ పనిముట్లు, మూడు ఎడ్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోయారు. ఇకముందైనా చోరీలు జరగకుండా నివారించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి కుటుంబం నుంచి డబ్బులు పోగేసి రూ.3లక్షలు సమకూర్చుకున్నారు. ఆ డబ్బుతో 24 కెమెరాలు, ఒక ఎల్ఈడీ టీవీని కొనుగోలు చేశారు. గ్రామ ప్రధాన కూడళ్లు, పాఠశాల, రామాలయం, హనుమాన్ ఆలయాల ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఊరు అటవీ ప్రాంతంలో ఉండటంతో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల అడవి జంతువుల సంచారాన్ని ముందే తెలుసుకొని అప్రమత్తమవుతున్నారు. పైగా రాత్రివేళల్లో గస్తీ తిరిగే అవసరం కూడా లేకుండా పోయిందని సీసీ కెమెరాల ఏర్పాటుతో ఊరు ఊరంతా ప్రశాంతంగా ఉందని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చోరీల నివారణకే కాదు.. ప్రజలు ఎక్కడ పడితే అక్కడ మూత్ర, మల విసర్జన చేయకుండా ఉండడానికి, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా.. లేదా? అని తెలుసుకోవడానికి ఈ నిఘా నేత్రాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

దొంగతనాలు బంద్

ఊర్లో దొంగతనాలు జరుగుతుండటంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులంతా కలిసి నిర్ణయం తీసుకున్నాం. ఈ వ్యూహం ఫలించింది. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఇవి ఉపయోగపడుతున్నాయి. ఊర్లో అందరం కలిసి మరిన్ని వసతులకు కృషి చేస్తాం”

- బుబన్ రమేశ్, మసాల (బి) గ్రామ రైతు

బాబోయ్ బ్యాంక్ ఉద్యోగం

పెరిగిన పనిభారం.. ఉద్యోగులు బెంబేలు.. బ్యాంకింగ్ విధుల కన్నా ఇతరత్రా భారమే ఎక్కువ

- మానసిక ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు
- సెలవు రోజుల్లోనూ తప్పని సేవలు

(ఆంధ్రజ్యోతి-బిజినెస్ డెస్క్)

బ్యాంకు ఉద్యోగమంటే అదో గొప్ప! ఉదయం 10 నుంచి 5 దాకానే పని. బోలెడన్ని సెలవులు. కడుపులో చల్ల కదలకుండా దర్జాగా కరెన్సీ కట్టల మధ్య కూర్చుని చేసే ఉద్యోగమనే భావన!! కానీ అదంతాగతం. ఇప్పుడు ఏ బ్యాంకు ఉద్యోగిని కదిలించినా 'బాబోయ్ బ్యాంకు ఉద్యోగం' అనే పరిస్థితి. క్లరికల్ స్థాయిలో కొంతవరకూ ఫర్వాలేదు. మేనేజర్, ఆపైస్థాయిలోని అధికారులకు క్షణమైనా తీరిక దొరకని దుస్థితి. వారి పనివేళలు 'టెన్ టు ఫైవ్' అనే సంగతి మరిచిపోయి చాలాకాలమే అయింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా వారికీ టార్గెట్లు. లక్ష్యాలను అందుకోలేకపోతే చీవాట్లు. పనితీరు మదింపుపై ప్రభావం. ఇలా ఎన్నోసమస్యలు. బ్యాంకింగ్ విధులకన్నా మ్యూచువల్ ఫండ్స్, లైఫ్ ఇన్సూరెన్స్.. ఇలా నాన్-బ్యాంకింగ్ విధుల భారమే వారిపై అధికంగా పడుతోంది. టెక్నాలజీ, ఆటోమేషన్ వల్ల పనిభారం మరింత పెరుగుతోంది. దీంతో బ్యాంకు ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒత్తిడి వల్ల ఆరోగ్య సమస్యలూ పెరుగుతున్నాయని బ్యాంకింగ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నోట్ల రద్దు నరకం..

ప్రధాని మోదీ నోట్ల రద్దు ప్రకటించినప్పటి నుంచి బ్యాంకు ఉద్యోగులకష్టాలు రెట్టింపయ్యాయి. ఓ వైపు పాత నోట్ల డిపాజిట్లు.. మరోవైపు కొత్త నోట్ల పంపిణీ.. వందలు, వేల సంఖ్యలో వచ్చిన వినియోగదారులకు సేవలందించేందుకు గంటల తరబడి పనిచేయాల్సిన పరిస్థితి. నగదు కొరతతో వేడెక్కిన కస్టమర్లు నోటికి వచ్చిన 'దీవెన'లతో ఆశీర్వదిస్తున్నా పడాల్సి రావడం వారికి నరకాన్నే చూపింది. పలువురు బ్యాంకు ఉద్యోగులు ఒత్తిడి దెబ్బకు ఐసీయూల పాలయ్యారంటే అతిశయోక్తి కాదు. రోజుకు 100 మంది కస్టమర్లను తట్టుకునే సామర్థ్యం ఉన్న బ్యాంకులు 1000-1500 మంది కస్టమర్లకు జవాబు చెప్పుకోవాల్సిన పరిస్థితి. దాన్ని అధిగమించేందుకు రోజుకు కనీసం 12 గంటలు పనిచేశారు. ఇంతకు ముందు ఏటీఎంల పక్కనే బల్క్ నోట్ యాక్సెప్టెన్స్ మెషీన్లుండేవి. వీటిలో డిపాజిట్ చేసిన నోట్లను అవసరాన్ని బట్టి ఆటోమేటిక్‌గా పక్కనే ఉన్న ఏటీఎంలలోకి సర్దుబాటు చేసేవారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత వాటి సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయలేదు. దీంతో ఈ మెషీన్లను పక్కన పెట్టారు. బ్యాంకు శాఖలపై ఒత్తిడి పెరగడానికి ఇదీ ఓ కారణమని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. పనిభారాన్ని తట్టుకోవడానికి చాలా మంది సిబ్బంది రోజూ రాత్రి 8 గంటల వరకూ పని చేయాల్సి వస్తోందని ఆలిండియా ఆంధ్రా బ్యాంక్ అవార్డ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐఏబీఏఈయూ) ప్రధాన కార్యదర్శి టి.రవీంద్రనాథ్ చెప్పారు. గ్రామాల్లో ఈ భారం మరింత ఎక్కువగా ఉంది. ఆసరా పెన్షన్లు, సబ్సిడీలు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల చెల్లింపులనూ ప్రభుత్వాలు బ్యాంకులపై వేయడంతో పరిస్థితి మరింత విషమిస్తోంది. ఆసరా పెన్షన్ల చెల్లింపుల కోసమైతే బ్యాంకుల సిబ్బంది ముందు రోజు రాత్రి పదింటి వరకు పని చేసి చెల్లింపుల లెక్కలు సిద్ధం చేయాల్సి వస్తోంది.

సిబ్బంది కొరత

పనిభారం పెరుగుతున్నా ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల్లో నియామకాలు మాత్రం అందుకు తగ్గట్టు లేవు. దీంతో గ్రామాల్లోని కొన్ని బ్రాంచ్‌ల్లో బ్రాంచ్ మేనేజర్, క్లర్కే అన్ని పనులూ చేసుకోవాల్సి వస్తోంది. ఉదాహరణకు ఆంధ్రా బ్యాంకుకు ఉన్న 2,900 శాఖల్లో దాదాపు 700 శాఖల్లో ఇదే పరిస్థితి. మిగతా పీఎస్‌బీల్లోనూ దాదాపుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులన్నింటిలో కలిపి ప్రస్తుతం12 లక్షల మంది ఉద్యోగులున్నారు. ఇంకా 3 లక్షలమంది సిబ్బంది అవసరం ఉందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. యాజమాన్యాలు మాత్రం కంప్యూటరీకరణ, డిజిటల్ బ్యాంకింగ్ పేరుతో నియామకాలు పెంచేందుకు ఇష్టపడడం లేదు. "రిటైర్ అయిన ఉద్యోగి స్థానంలో కొత్తవారిని తీసుకోవట్లేదు. దీంతో వారి పని కూడా మిగిలిన సిబ్బందే చేయాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్యూన్లు చెయ్యాల్సిన పనులు కూడా మేమే చేసుకుంటున్నాం" అని హైదరాబాద్‌లో ఓ ప్రభుత్వ రంగ బ్యాంకు మేనేజర్ వాపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రోజూ 15% ఉద్యోగులు సెలవుల్లో ఉండటంతో సిబ్బందిపై పని భారం పెరుగుతోందని 'అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం' (ఎఐబిఇఎ) ప్రధానకార్యదర్శి బి.ఎస్.రాంబాబు చెప్పారు.

నాటి ఓటీ నేటికీ ఇవ్వలేదు

పెద్ద నోట్ల రద్దు తర్వాత బ్యాంకు సిబ్బంది, రోజుకు మూడు నాలుగు గంటలు అదనంగా పని చేశారు. ఇందుకు ఓవర్ టైమ్ అలవెన్స్ చెల్లిస్తామని ప్రభుత్వం, ఆర్బీఐ ప్రకటించాయి. అయితే ఇప్పటి వరకూ ఎవరికీ పైసా కూడా అందలేదు. ఒక్క ఆంధ్రా బ్యాంక్ సిబ్బందికే ఓటీ రూ.3 కోట్ల వరకు అందాల్సి ఉందని అధికారులు అంటున్నారు.

సెలవు రోజూ వెళ్లాల్సిందే!

సెలవులైన 2, 4 శనివారాలు, ఆదివారాల్లోనూ మీటింగులకు రమ్మంటున్నారని.. మార్కెటింగ్, కొత్తవ్యాపారాల ప్రమోషన్, బకాయిల వసూళ్ల పేరుతో రోడ్లు పట్టుకు తిరుగుతున్నామని.. ఇంట్లో భార్యాబిడ్డలతో కలిసి ఉండే సమయమే దొరకట్లేదని బ్యాంకు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత లక్ష్యాలు పెట్టి మరీ ముద్ర రుణాల పంపిణీ, వసూళ్ల బాధ్యత కూడా ప్రభుత్వం తమ మీదే పెట్టడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు. జన్‌ధన్ ఖాతాల భారమంతా బ్యాంకులపై పడుతోంది. పైగా బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనం ప్రతిపాదనలు ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

జీతాల పెంపు అరకొరే..

"బ్యాంకుల ఆపరేటింగ్ లాభాలు ఏటా బాగానే పెరుగుతుంటాయి. కానీ.. ఆ లాభాల్లో కొంతమొత్తాన్ని 'నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్' లోటు పూడ్చటానికి మళ్లిస్తున్నారు. లాభాలు తగ్గినట్టుగా చూపించి మా జీతాల పెంపులో కోత పెడుతున్నారు" అని ఒక బ్యాంక్ మేనేజర్ ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలోనే.. కోట్ల రూపాయలను ఎగవేసిన వారిని నేరగాళ్లుగా ప్రకటించి బకాయిలు వసూలు చేయాలని, లాభాలను ఎన్‌పీఏలకు మళ్లించి జీతాల పెంపులో కోత పెట్టొద్దని యూనియన్లు కోరుతున్నాయి. ఈ సమస్యలన్నిటినీ ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లేందుకే ఆగస్టు 22న దేశ వ్యాప్త సమ్మెకు బ్యాంకింగ్ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు.

రేపు బ్యాంకు ఉద్యోగుల సమ్మె!

- యథావిధిగా పనిచేసే ప్రైవేటు బ్యాంకులు
- చెక్ క్లియరెన్స్‌లు ఆలస్యమయ్యే అవకాశం

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనం, నష్టాల్లో ఉన్న బ్యాంకుల మూసివేత, నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) రైటాఫ్‌ను వ్యతిరేకిస్తూ మంగళవారం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఉద్దేశపూర్వక ఎగవేతలను క్రిమినల్ నేరంగా ప్రకటించడం, ఎన్‌పీఏల రికవరీకి పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలను అమలు చేయడం వంటివి వారి డిమాండ్లలో మరికొన్ని. కార్పొరేట్ ఎన్‌పీఏల భారాన్ని.. చార్జీలు పెంచడం ద్వారా సామాన్య బ్యాంకు ఖాతాదారులపై మోపకూడదని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం అన్నారు. బ్యాంక్స్ బోర్డు బ్యూరోను ప్రభుత్వం రద్దు చేయాలని, మొండిబకాయిల వసూలుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, మంగళవారం నాడు ప్రైవేటు బ్యాంకులు యథావిధిగానే పనిచేస్తాయిగానీ.. ప్రభుత్వ రంగ బ్యాంకుల సమ్మె కారణంగా చెక్ క్లియరెన్స్ ఆలస్యమయ్యే అవకాశం ఉంది.

కార్మిక చట్టాల్లో సంస్కరణలు తీసుకొస్తాం

- కేంద్ర కార్మిక శాఖ మంత్రి దత్తాత్రేయ

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో కార్మిక చట్టాలకు సంస్కరణలు తీసుకు రానున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మజ్దూర్‌సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించినట్టుగానే ఎన్టీపీసీ కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తామని తెలిపారు. సింగరేణి పరిధిలో 15వేల మంది కార్మికులకు కేంద్ర ప్రభుత్వ కార్మిక చట్టాల మేరకు కనీస వేతనాలు అందనున్నాయని చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం మజ్దూర్‌సంఘ్ నేతలు దత్తాత్రేయ, లక్ష్మణ్‌ను ఘనంగా సత్కరించారు. కాగా, కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాన్ని రూ.15 వేలకు పెంచిన నేపథ్యంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య పోరాట సమితి నేతలు దత్తాత్రేయను ప్రత్యేకంగా సన్మానించారు. ఈఎస్ఐతోపాటు ఇతర సదుపాయాలు కల్పించాలని కార్మిక నేతలు ఆయనకు విజ్ఞప్తి చేశారు.

థాయ్ మసాజ్ రట్టు

(మూడో పేజీ తరువాయి)

యువతులు, ఒక పంజాబీ అమ్మాయి, 9 మంది హైదరాబాదీ యువతులు పట్టుబడ్డారు. 19 మంది నిర్వాహకులను అరెస్ట్ చేశారు. స్పా, మసాజ్ కేంద్రాల నుంచి కండోమ్స్, లాప్‌టాప్స్/కంప్యూటర్లు, 11స్వైపింగ్ మెషీన్స్, 28మొబైల్ ఫోన్లు, రూ.3,38,440 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన యువతులను పునరావాస కేంద్రానికి తరలించారు.

దాసరి సిద్దార్థ.. కీలక సూత్రధారి

ఈ హైటెక్ వ్యభిచార కార్యకలాపాలకు ప్రధాన సూత్రధారి దాసరి సిద్ధార్థ(32). ట్రైపాడ్ వెర్నస్, హీలింగ్ సర్వీసెస్ పేరుతో బంజారాహిల్స్‌లో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాడు. బంజారాహిల్స్, నందగిరిహిల్స్, హైటెక్‌సిటీ, బెంగళూరుల్లో 10కి పైగా స్పా, మసాజ్ సెంటర్స్ నిర్వహిస్తున్నాడు. సర్ఫరాజ్ అలి, వినయ్, అజయ్ తదితరులతో కలిసి మసాజ్ కేంద్రాల్లో రహస్య కార్యక్రమాలు సాగిస్తున్నాడు. 2013 వరకు అతడు ముంబైలో స్పా వ్యాపారం చేశాడు. అక్కడ పోలీసులు పెద్ద ఎత్తున కేసులు నమోదు చేయడంతో వ్యాపారాన్ని మాదాపూర్‌కు మార్చాడు. ఇక్కడ శాండ్‌విచ్ మసాజ్, కాక్‌టైల్ మసాజ్, వీకెండ్ మజా వంటి పేర్లతో కస్టమర్స్‌ను ఆకర్షిస్తున్నాడు. సిద్ధార్థపై తమిళనాడులోనూ వ్యభిచార కార్యకలాపాలకు సంబంధించి క్రిమినల్ కేసు నమోదైంది. ఈ ముఠాకు చెందిన వెంకటరెడ్డి, బాలసుబ్రమణ్యం, తోట విజయ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అంతా ఆమె కనుసన్నల్లోనే..

పేదరికంలో మగ్గుతున్న ఈశాన్య రాష్ట్రాల మేఘాలయ, త్రివేండ్రం, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాలతోపాటు మసాజ్‌కు గుర్తింపు వున్న థాయ్‌లాండ్ తదితర ప్రాంతాల నుంచి యువతులకు ఉద్యోగ, ఉపాధి అత్యవసరం. దీన్ని అవకాశం చేసుకుని వారికి గాలం వేస్తారు. థాయ్‌లాండ్ నుంచి యువతులను ముంబై, బెంగళూరు, హైదరాబాద్ చేర్చేందుకు కాకే అనే మహిళా దళారి ఉంది. ముంబైలో నివాసం ఉండే ఆమె.. తనకు గల పరిచయాలతో థాయ్‌లాండ్ నుంచి తీసుకొచ్చిన అమ్మాయిలను దేశంలోని పలు నగరాలకు సరఫరా చేస్తోంది. 3 నెలల ప్యాకేజీల పేరుతో నగరానికి వచ్చే ఈ యువతులకు భోజనం, వసతి, విలాసవంతమైన జీవితం గడిపే విధంగా నిర్వాహకులు సౌకర్యాలు కల్పిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లో ట్రిపుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌లో యువతులకు ఆవాసం కల్పించారు.

అంతా ఆన్‌లైన్‌లోనే..

కస్టమర్స్ అపాయింట్‌మెంట్.. బిల్లింగ్ అంతా ఆన్‌లైన్‌లో కొనసాగుతుంది. రూ.6000-9000 వరకూ ఒక్కొక్కరి నుంచి వసూలు చేస్తారు. అమ్మాయిలకు విటుల నుంచి వచ్చిన గ్రేడింగ్ ఆధారంగా వేతనం, స్పెషల్ ఇన్సెంటివ్స్ ఇస్తున్నట్లు సమాచారం. అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వచ్చి తిరిగి అక్కడకు చేరే వరకూ అమ్మాయిలపై నిఘా ఉంటుంది. ఎవరైనా బయటి వ్యక్తులతో మాట్లాడినట్లు గుర్తిస్తే చాలు ఆ రోజు వారికి ఆహారం ఉండదు. పాస్‌పోర్ట్ తిరిగి ఇవ్వబోమని, నగరంలో అక్రమంగా నివాసం ఉంటున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బ్లాక్‌మెయిలింగ్‌కూ పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ సెక్స్ రాకెట్‌ను వెలుగులోకి తీసుకురావటంలో కీలకంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిని సైబరాబాద్ పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య అభినందించి రివార్డులు ప్రకటించారు.

గుట్టు ఇలా రట్టు..

కూకట్‌పల్లికి చెందిన ఓ యువకుడి(24)ని అతడి తల్లిదండ్రులు ఇటీవల సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వద్దకు తీసుకొచ్చారు. తమ కుమారుడు స్పాలకు అడిక్ట్ అయ్యాడని, ఇంట్లో నుంచి ఒకసారి రూ.2 లక్షలు.. మరోసారి రూ.3 లక్షలు తీసుకెళ్లి స్పాలకు సమర్పించుకున్నాడని చెప్పారు. మళ్లీ రూ.2 లక్షలు దొంగతనం చేస్తుండగా పట్టుకొని తీసుకొచ్చామన్నారు. అతణ్ని విచారించిన పోలీసులు.. కొన్ని స్పా కేంద్రాల్లో బాడీ మసాజ్ పేరిట లగ్జరీ వ్యభిచారం జరుగుతోందని గుర్తించారు.

టార్గెట్ కాంగ్రెస్

- తెలంగాణలో కాంగ్రెస్‌ను ఖాళీ చేయాలి
- బీజేపీ పకడ్బందీ వ్యూహం
- రాంమాధవ్‌కు 'ఆపరేషన్ ఆకర్ష్' బాధ్యతలు
- టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదగడమే లక్ష్యం

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నేతలను బీజేపీ టార్గెట్ చేసింది. వీలైనంత ఎక్కువ మంది నేతలను కాంగ్రెస్ నుంచి ఆకర్షించేందుకు ఆ పార్టీ పావులు కదుపుతోంది. రాష్ట్ర నేతలతో సంబంధం లేకుండా ఆపరేషన్ ఆకర్ష్ అమలు చేసే బాధ్యతను బీజేపీ అధిష్ఠానమే తీసుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఖాళీ చేస్తే టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా నిలవడం సులువవుతుందని బీజేపీ ఢిల్లీ నేతలు భావిస్తున్నారు. 2019లో అధికారంలోకి రాకపోయినా ప్రత్యామ్నాయ శక్తిగా నిలిచి 2024లో అధికారం చేజిక్కించుకోవాలన్న దిశగా బీజేపీ అగ్రనాయకత్వం వ్యూహం రచిస్తోంది. 'బీజేపీలో చేరేందుకు కాంగ్రెస్ ముఖ్యనేతలు సిద్ధంగా ఉన్నారు. వారు మాతో చాలాకాలం గా టచ్‌లో ఉన్నారు' అని కేంద్ర కార్మిక మంత్రి దత్తాత్రేయ నిజామాబాద్‌లో ప్రకటించడం, మాజీ ఎమ్మెల్యేలు, తాజా ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ వెల్లడించడం ఉత్కంఠ రేపుతోంది.

అంతర్గత పోరుపై ఆరా

కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన ఏఐసీసీ నేత రామచంద్ర కుంతియా ప్రకటనతో టీకాంగ్రెస్‌లోఅంతర్గత పోరు మరోసారి బహిర్గతమైంది. 2019 వరకు ఉత్తమే టీపీసీసీ ప్రెసిడెంట్ అన్న కుంతియా ప్రకటన ఆ పార్టీని ఓ కుదుపు కుదపడంపై బీజేపీ నేత లు సంతోషంగా ఉన్నారు. దీంతో టీ.కాంగ్రెస్‌పై ఆపరేషన్ ఆకర్ష్‌ను మళ్లీ ప్రయోగించే అవకాశం బీజేపీ అధిష్టానానికి చిక్కింది. కాంగ్రెస్‌ను జిల్లాలవారీగా టార్గెట్ చేయాలని వ్యూహ రచన చేసినట్లు తెలిసింది. ఆపరేషన్ కాంగ్రెస్ బాధ్యతను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌కు అప్పగించినట్లు సమాచారం. కాంగ్రెస్ ముఖ్యనేతలతో బీజేపీ నేతలు మంతనాలు జరుపుతున్నారన్న ప్రచా రం సాగుతోంది. కాంగ్రెస్‌లోని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బీజేపీ గాలం వేసినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్‌లో అమిత్‌షా పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నుంచి ముఖ్యనేతలు బీజేపీ తీర్థం పుచ్చుకుంటారని బీజేపీ నేతలు స్పష్టం చేస్తున్నారు. దీంతో సెప్టెంబర్‌లో అమిత్‌షా తెలంగాణ పర్యటన సందర్భంగా ఏం జరుగుతుందన్న విషయమై అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది.

ఏడాది ముందే అడుగులు

తెలంగాణ కాంగ్రెస్ నేతలపై ఆపరేషన్ ఆకర్ష్‌ను ఈ ఏడాది ప్రారంభంలోనే బీజేపీ ప్రారంభించింది. అమిత్‌షా తొలి విడత పర్యటన మే నెలలో జరిగిన విషయం తెలిసిందే. అంతకు ముందే ఆ పార్టీ బీదర్ ఎంపీ భగవంత్‌కూబాను కాంగ్రెస్ నేతలపె బీజేపీ అధిష్ఠానం ప్రయోగించింది. కూబా పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలను కలిసి బీజేపీలో చేరాలని కోరారు. కొంత కాలం వేచి చూసి సరైన సమయంలో నిర్ణయం చెబుతామని కాంగ్రెస్ నేతలు ఆయనతో అన్నట్టు సమాచారం. ఆ తర్వాత అమిత్‌షా తెలంగాణ పర్యటనపై సీఎం కేసీఆర్ విమర్శలు గుప్పించడం, కొన్ని రోజులకే సంగారెడ్డిలో ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ బహిరంగసభ విజయవంతమవడంతో పార్టీ వీడే ఆలోచన నుంచి కాంగ్రెస్ నేతలు వెనక్కి తగ్గారని తెలుస్తోంది.

ప్రజల మధ్య బీజేపీ చిచ్చు

- పసిపిల్లల ప్రాణాల కంటే ఆవులే వారికి ముఖ్యం
- రాజీవ్ గాంధీ జయంతిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్

హైదరాబాద్/న్యూఢిల్లీ/హుజూర్‌నగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దేశ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో ఆదివారం రాజీవ్‌గాంధీ 73వ జయంతిని కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ గోరఖ్‌పూర్‌లో పసిపిల్లల ప్రాణాలు పోతున్నా బీజేపీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పసి పిల్లల ప్రాణాల కంటే ఆవులే ఆ పార్టీ నేతలకు ముఖ్యమయ్యాయని విమర్శించారు. దేశంలోనే అత్యుత్తమ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. దేశ రాజకీయాల్లో యువత పాత్ర పెరగటానికి రాజీవ్ చూపిన చొరవే కారణమన్నారు. దేశం కోసమే శ్రీలంక టెర్రరిస్టుల చేతిలో ప్రాణాలర్పించారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల పటిష్టత కోసం రాజ్యాంగ సవరణ చేసి అన్ని వర్గాలకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించారని గుర్తు చేశారు. అంతకుముందు వి.హనుమంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజీవ్ సద్భావన్ రన్‌ను ఉత్తమ్ ప్రారంభించారు. అలాగే, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ముత్యాలమ్మ జాతరకు హాజరయ్యారు. కాగా, రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని వీర్ భూమి వద్ద తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య, సుధాకర్‌రెడ్డి, బలరాం నాయక్, పొన్నం ప్రభాకర్, సురేష్ షట్కర్, రాజయ్య నివాళి అర్పించారు. శ్రీపెరంబదూరు నుంచి తీసుకొచ్చిన రాజీవ్ జ్యోతిని వీర్‌భూమిలో ఉంచి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు.

సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాల్సిందే: బీజేపీ

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17న తెలంగాణ విమోచనదినాన్ని అధికారికంగా నిర్వహించేవరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటామని బీజేపీ స్పష్టం చేసింది. విమోచన దినం, అమిత్‌షా మలివిడత పర్యటనపై చర్చించేందుకు బీజేపీ రాష్ట్ర పదాధికారులు ఆదివారంనాడిక్కడ సమావేశమయ్యారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణవిముక్తి పోరాట యోధులను గుర్తించటంలోనూ టీఆర్ఎస్ ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందన్నారు. సెప్టెంబర్-17న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు కేంద్రహోంశాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆహ్వానించామన్నారు. అమిత్‌షా పర్యటనలోపు బూత్ స్థాయిల్లో పార్టీని పటిష్ఠం చేస్తామన్నారు.

ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కాంగ్రెస్: కర్నె

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను అడ్డుకోవడమే లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు పని చేస్తున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణను మారుమూల ప్రాంతంలో ఏర్పాటు చేశారంటూ కేంద్ర పర్యావరణశాఖ కార్యదర్శి అజయ్‌నారాయణకు కాంగ్రెస్ నేత మర్రి శశిధర్‌రెడ్డి ఫిర్యాదు చేయడాన్ని తప్పుబట్టారు. కాంగ్రెస్ నేతల నీచ బుద్ధి, దుర్మార్గపు ఆలోచనలు ఈ ఫిర్యాదుతో మరోసారి బహిర్గతమయ్యాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో గందరగోళం సృష్టిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఆర్టీసీ ఇంత దిగజారుతుందా?: వీహెచ్

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులపై వేసే యాడ్స్ మరీ ఘోరంగా ఉంటున్నాయని, డబ్బుల కోసం ఆ సంస్థ ఎంతకైనా దిగజారుతుందా? అని మాజీ ఎంపీ వి.హనుమంతరావు ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సులపై వేసిన అర్జున్‌రెడ్డి సినిమా యాడ్స్‌పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అవి యువతను చెడగొట్టేలా ఉన్నాయన్నారు. ఇప్పటికే సినిమాల వల్ల యువత చెడిపోతోందని, ఇలాంటి పోస్టర్లతో ఏం చెప్పదలచుకున్నారని ప్రశ్నించారు.

1న ఉద్యోగ, టీచర్ల మూకుమ్మడి సెలవు

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకాన్ని(సీపీఎస్) రద్దు చేయాలని, పాత పింఛన్ విధానాన్నే ప్రవేశపెట్టాలన్న డిమాండ్‌తో 1.50 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు మూకుమ్మడి సెలవులు, భారీ ప్రదర్శనలు, ధర్నాలు, నిరసనలతో ఆందోళనలు నిర్వహించనున్నారు. సెప్టెంబరు 1 న సామూహిక సెలవులు పెడ్తామని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం(టీఎస్‌సీపీఎస్ఈఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగారపు స్థితప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్, అదే రోజున రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శనలను చేపట్టనున్నట్లు తెలంగాణ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం(టీసీపీఎస్ఈఏ)అధ్యక్షుడు పుప్పాల కృష్ణకుమార్ వెల్లడించారు.

నేడు హస్తినలో 'ధర్నాచౌక్' ఆందోళన

న్యూఢిల్లీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ధర్నాచౌక్‌ను ఇందిరా పార్క్ వద్దే కొనసాగించాలంటూ ధర్నాచౌక్ పరిరక్షణ కమిటీ చేపట్టిన ఆందోళన దేశ రాజధానికి చేరింది. వివిధ రూపాల్లో హైదరాబాద్‌లో నిరసన తెలిపిన కమిటీ.. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఢిల్లీలో సోమవారం ఆందోళన చేపట్టబోతోంది. జంతర్‌మంతర్ వద్ద ధర్నా కోసం నేతలు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్, సహా సీపీఐ, సీపీఎం, ఆర్జేడీతో పాటు జాతీయ పార్టీల అగ్రనేతలను ఈ ధర్నాకు హాజరు కావాలని కమిటీ నేతలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే ధర్నాచౌక్‌ను ఇందిరాపార్క్ దగ్గర నుంచి ఎత్తివేయడాన్ని నిరసిస్తూ, కేంద్రానికి తమ గొంతుక వినిపించేలా జంతర్‌మంతర్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇదే అంశాన్ని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు.

డిప్యూటీ సర్వేయర్ల పరీక్షకు 78% హాజరు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో డిప్యూటీ సర్వేయర్ల పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణీప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షకు 26,874 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 21,060 (78.37%) మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. 273 డిప్యూటీ సర్వేయర్ల పోస్టుల భర్తీకి గతేడాది జూన్ 2న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

రాచకొండ ఇన్‌చార్జి సీపీ.. సందీప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ వ్యక్తిగత పనుల రీత్యా 20 రోజులు సెలవుపై బయటి ప్రాంతాలకు వెళ్లనున్నారు. దీంతో సెప్టెంబరు 9వ తేదీ వరకూ సైబరాబాద్ ఇన్‌చార్జిగా పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్యా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

'రాంకీ'పై చర్యలు తీసుకోండి: తమ్మినేని

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఎలిమినేడు, గుండంపల్లి, సుంకెనపల్లి గ్రామాల్లో రాంకీ సంస్థ జరిపిన భూకొనుగోళ్లలో అక్రమాలకు పాల్పండిందని, వాటిపై సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. పట్టాదారుతో సంబంధం లేకుండా దొంగ ఫొటోలు పెట్టి బినామీ పేర్లతో వందల ఎకరాల భూముల్ని ఆ సంస్థ రిజిస్ట్రేషన్ చేయించుకుందని ఆరోపించారు. గత ప్రభుత్వాల అండతో రాంకీ సంస్థ ఈ అక్రమాలకు పాల్పండిదని, రెండు నెలలుగా రాంకీ మోసాలు బయటపడుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాగా, స్థానిక సంస్థలకు నేరుగా 40% నిధులు కేటాయిస్తామన్న హామీని నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

చర్లపల్లి జైలుకు శ్రీరాముల శ్రీనివాస్

గజ్వేల్ అర్బన్, ఆగస్టు 20: మావోయిస్టు మాజీ నేత శ్రీరాముల శ్రీనివాస్ అలియాస్ సుదర్శన్‌ను అరెస్టు చేసిన సిద్దిపేట పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. గతంలో అక్రమ ఆయుధాలు కలిగి ఉన్నారన్న కేసులో శనివారం సాయంత్రం శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదివారం ఉదయం గజ్వేల్ న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు. అక్రమ ఆయుధాల కొనుగోలుకు డబ్బు సమకూర్చడంతో పాటు జిల్లాలో పలు సెటిల్‌మెంట్లలో అతని పాత్ర ఉన్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. కాగా సుదర్శన్‌ది అక్రమ అరెస్టు అని ఆయన భార్య, కూతురు ఆరోపించారు.

టీటీడీ మాజీ ఈవో ప్రసాద్‌కు గుండెనొప్పి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఈవో, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్ శనివారం అర్ధరాత్రి గుండెనొప్పితో కేర్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు ఐసీయూలో చికిత్సలు అందిస్తున్నారు. ప్రసాద్‌ను తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎం సీపీఆర్‌వో జ్వాల నర్సింహారావు పరామర్శించారు.

తెలంగాణ రైతాంగపోరాటంపై వచ్చిన 'మాభూమి' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. ఎన్నో అభ్యుదయ చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపును పొందారు. పాతికేళ్లుగా నటనకు దూరంగా ఉన్న ఆయన ఇప్పుడు తండ్రి పాత్రలో నటించి అందరినీ 'ఫిదా' అయ్యేలా చేశారు. ఆయనే త్రిపురనేని రామస్వామి చౌదరి మనుమడు, త్రిపురనేని గోపీచంద్ కుమారుడు సాయిచంద్. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ 'ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కే' కార్యక్రమం కోసం ఆయనతో సంభాషించారు.

- తెనాలిలో తాతగారి జ్ఞాపకార్థం సభ నిర్వహించారు. దానికి మద్రాసు ముఖ్యమంత్రి అన్నాదురై ముఖ్య అతిథిగా వచ్చారు. అప్పుడు నా వయసు పదేళ్లు. ఆయన నన్ను చాలాసేపు తన ఒళ్లో కూర్చోపెట్టుకున్నారు. ఆ సంఘటన ఇప్పటికీ మరిచిపోలేదు.
- నేను పుట్టినపుడు ఎక్కువ రోజులు బతకనని అన్నారట డాక్టర్లు. నా కొడుకు బతికితే అందరం నీ భక్తులుగా ఉంటాం అని షిర్డీసాయిని మొక్కుకున్నాడట మానాన్న. నేను బతకడంతో నాన్న పూర్తిగా ఆస్తికునిగా మారిపోయాడు. నేను ప్రత్యేకంగా గుళ్లకు వెళ్లను. దైవం ఉందని నమ్ముతాను. కాసేపు ఇంట్లో షిర్డీసాయి దగ్గర కూర్చుంటాను. అంతే...

తాత బయోపిక్ తీయాలనుంది!

చాలా రోజుల తరువాత సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టినట్టున్నారు?

అవును. ఉర్దూలో ఒక సామెత ఉంది. ఊపర్ వాలా దియేతో చప్పడ్ పాడ్‌కే దేగా. అలా వచ్చింది సినిమా అవకాశం నాకు. 1980లో రిలీజయిన మాభూమితో సినిమా ప్రస్థానం ప్రారంభమయింది. అంకురం తరువాత కొద్దికాలం బ్రేక్ తీసుకుందాం అనిపించింది. అందుకూ కారణం ఉంది. డాక్యుమెంటరీలు తీయాలని ఆలోచనతో ఆపేశాను. అలా గ్యాప్ వచ్చింది. వెనక్కి తిరిగి చూసుకుంటే పాతికేళ్లు గడిచిపోయాయి.

ఎందుకంత గ్యాప్ వచ్చింది?

ఏమైందంటే 'అంకురం' సినిమా సమయంలోనే దూరదర్శన్ ప్రారంభమయింది. ఆ సమయంలో ఒక సమాంతరమైన మీడియాగా దూరదర్శన్ డెవలప్ అవుతోంది. అప్పుడు శంకర్‌నాగ్, ఆర్ కె నారాయణ్ గారి మాల్గుడిడేస్ చేస్తున్నారు. చాలా సక్సెస్‌ఫుల్‌గా వచ్చింది. అప్పుడు నాన్నగారి కథలను నేనెందుకు అలా తీయకూడదు అనిపించింది. దూరదర్శన్ వారిని అప్రోచ్ కావడం, వాళ్లు సంతోషంగా ఒప్పుకోవడం జరిగింది. దాంతో నాన్నగారి 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా'ను చేశాను. ఆ సమయంలోనే తెలుగు సినిమా డైమండ్ జూబ్లీ జరుపుకుంటోంది. 'మీరు తెలుగు సినిమాకు బాగా కనెక్ట్ అయి ఉన్నారు కదా. డైమండ్ జూబ్లీ సందర్భంగా ఏదైనా చేయండి' అని దూరదర్శన్ వాళ్లు అడిగారు. అప్పుడు 'తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్న మహామహుల డాక్యుమెంటరీలు సీరిస్‌గా చేద్దాం. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడుతుంది' అని చెప్పాను. వాళ్లు ఒప్పుకున్నారు. ఇవన్నీ చేస్తూ బిజీగా ఉండి సినిమాల గురించి ఆలోచించలేకపోయాను.

సినిమాల్లోకి పనికొస్తావని గుర్తించి అవకాశం ఇచ్చింది ఎవరు?

అది చాలా గమ్మత్తుగా జరిగింది. అమ్మ, నాన్న పోయిన తరువాత 'గోరా' గారి దగ్గర పెరిగాను. అన్నయ్యకు గోపీచంద్ ఆర్ట్స్ అని నాటక సంఘం ఉండేది. మాతో చిన్నప్పుడు నాటకాలు వేయించేవాళ్లు. అన్నయ్యకు నర్సింగ్‌రావు, తోట వైకుంఠం, చంద్ర ఆర్టిస్ట్ వీళ్లందరు ఫ్రెండ్స్. నర్సింగరావుగారు మాభూమి తీద్దామనుకున్నప్పుడు వాళ్ల దృష్టిలో నేను లేను. నర్సింగరావు పార్ట్‌నర్ జి.రవీంద్రనాథ్ ఉండేవాడు. ఆయన బ్రదర్ నారాయణరావు యాక్టర్. గౌతమ్‌ఘోష్ కలకత్తా నుంచి వచ్చి ఉన్నారు. అప్పటికే ఆరేడు నెలలు గడిచిపోయాయి. సినిమా పోస్ట్‌పోన్ అవుతూ వస్తోంది. ఎవరితో చేయిద్దాం అనుకుంటూ ఉంటే గోపీచంద్ అబ్బాయి సాయిచంద్ ఉన్నాడుగా అని ఎవరో అన్నారట. అప్పటికి గౌతమ్‌ఘోష్ నన్ను చూడలేదు. ఒకసారి ఆఫీస్‌కు రమ్మని పిలిస్తే వెళ్లాను. ఒక గదిలో గౌతమ్‌ఘోష్, నర్సింగ్‌రావు ఉన్నారు. లోపలికి వెళితే ఒకసారి షర్ట్ తీయమన్నారు. నాకేం అర్థం కాలేదు. షర్ట్ ఎందుకు తీయమంటున్నారు అని. సరేలే అని షర్ట్ తీశాను. అప్పుడు చాలా బక్క పలుచగా ఉన్నాను. అప్పుడు గౌతమ్‌ఘోష్ 'నువ్వే నా హీరో' అన్నారు. హీరో ఎవరో ఫిక్స్ అయి ఉన్నారు, ఇతర నటుల కోసం చూస్తున్నారని అనుకున్నాను. కానీ ఏకంగా హీరో అనేసరికి నమ్మలేకపోయాను. 22 ఏళ్లకే హీరో అవకాశం వచ్చింది.

> **తెలంగాణ పల్లెల్లోకి వెళ్తే మనుషుల మంచితనం, ముగ్ధమనోహరత్వం, ఆప్యాయతలు ఎంతో బాగుంటాయి. మనసు విప్పి మాట్లాడతారు. నిష్కల్మషంగా ఉంటారు. కపటం అస్సలు తెలియదు. తెలంగాణ సంస్కృతిలో అది ఎక్కువ కనిపిస్తుంది. ఆ మధ్య స్కాంలు ఎక్కువ జరిగినప్పుడు కూడా అక్కడి వాళ్లే ఎక్కువ ఉన్నారు తప్ప ఇక్కడి వాళ్లు కనపడలేదు. ఒకవేళ ఉన్నా కూడా చిన్న చిన్నవేమో ఉండొచ్చు. స్కాం అనేది పెద్ద పదం తెలంగాణ వాళ్లకు!**

'మాభూమి' షూటింగ్ సమయంలో బాగా చేయలేదని గౌతమ్‌ఘోష్ ఎప్పుడైనా తిట్టారా?

లేదు. ముందు షూటింగ్ వాతావరణం అలవాటు కావాలని కాస్ట్యూమ్ వేసుకుని లొకేషన్‌లో తిరగమన్నారు. నాలుగైదు రోజులు నాతో ఎలాంటి సీన్లు తీయలేదు. తరువాత ఒకరోజు సీన్ తీశారు. నేను, హీరోయిన్ నడుచుకుంటూ వెళుతుంటే ఇద్దరు ఎదురుగా వస్తారు. వాళ్లను పలకరించే సీన్ తీశారు. లాంగ్‌షాట్‌లో తీశారు. షాట్ అయిపోగానే ఫెంటాస్టిక్ సాయి అంటూ వచ్చి కౌగిలించుకున్నారు గౌతమ్‌ఘోష్. అసలు ఏం చేశానో నాకు తెలియదు. అద్భుతంగా చేశావని అన్నారు. తరువాత ఇంకోసారి తీద్దాం అన్నాడు. అంటే ఎంకరేజ్ చేయడం కోసం అలా అన్నాడని అర్థమయింది.

మీరు పెళ్లెందుకు చేసుకోలేదు?

పెద్ద కారణమంటూ లేదు. స్త్రీ ద్వేషమని కాదు. పెళ్లి మటుకు వద్దనిపించింది. ఒంటరితనం అంటారు కానీ, నాకు అది అర్థం కూడా కాదు. ఏకాంతాన్ని ఇష్టపడతాను.

నిజజీవితంలో మీరు తండ్రికాదు, కానీ సినిమాలో తండ్రి పాత్రను అంత అద్భుతంగా ఎలా పోషించారు?

శేఖర్‌కమ్ముల ఆఫర్ చేసినపుడే నేను కన్ఫ్యూజ్ అయ్యాను. నేను ఆయనకు చెప్పాను కూడా. నాకు మ్యారేజ్ కాలేదు. ఆ ఫీలింగ్స్ కూడా లేవు అన్నాను. కానీ శేఖర్‌కమ్ముల ఒప్పుకోలేదు. నలభై మందిని చూశాను. మిమ్మల్ని తప్ప వేరే ఎవ్వరినీ ఊహించుకోవడం లేదని అన్నారు. దాంతో ఒప్పుకున్నాను. షూటింగ్ ప్రారంభం కాకముందే రిహార్సల్ కోసమని సాయిపల్లవిని రమ్మన్నారు. రిహార్సల్ అయిపోయాక నేను వెళ్లిపోతూ ఉంటే వెనక నుంచి నాన్నా అని పిలిచింది. వెనక్కి తిరిగి చూస్తే పరుగెత్తుకుంటూ వచ్చి 'నాన్నా టేక్ కేర్, వి విల్ మీట్ యు సూన్' అంది. అప్పుడు నాలో కలిగిన అనుభూతి మాటల్లో చెప్పలేను. సాయిపల్లవిని దేవుడిచ్చిన కూతురులా ఫీలయ్యాను. సినిమాలో పెద్ద కూతురుగా నటించిన శరణ్య మొదట్లో కొద్దిగా క్లోజ్‌గా ఉండేది కాదు. తరువాత తను కూడా బాగా క్లోజ్ అయింది.

తెలంగాణ భాష ఎలా ఒంటబట్టింది?

పెరిగిందంతా ఈ వాతావరణంలోనే. మేం నారాయణగూడలో ఉండేవాళ్లం. 1956లో కర్నూల్ నుంచి హైదరాబాద్ వచ్చాం. మాభూమి సినిమా సమయంలో నర్సింగరావు భాష పట్ల చాలా ఫోకస్‌గా ఉండేవాడు. డబ్బింగ్ సమయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. దాంతో నేను బాగా ట్యూన్ అయిపోయాను.

ఉద్యమానికి ఎప్పుడైనా ఆకర్షితులయ్యారా?

చిన్నప్పుడు ఉండేది. చెరబండరాజు ప్రభావం నాపైన చాలా ఉంది. ఆయనకు కూడా నేనంటే చాలా ఇష్టం. ఆయన పాట 'కొండలు పగిలేసినం, కండలు కరిగించినం, మా నెత్తుటి కంకరతో ప్రాజెక్టులు కట్టినం...' పాటను ఇష్టంగా పాడుకునే వాణ్ణి.

అప్పట్లో దోపిడి, అన్యాయాలు తెలంగాణలో ఎక్కువ. ఆంధ్రాలో అంత లేదు. అయినప్పటికీ అక్కడి నుంచి కమ్యూనిస్టులు దిగుమతి అయ్యి ఇక్కడ ఉద్యమానికి నాయకత్వం చేశారు. రైతాంగ పోరాటాలప్పుడు కూడా వాళ్ల ప్రేరణతోటి ఇక్కడి వాళ్లు బయటికి వచ్చారు. ఎందుకలా?

రైతు కుటుంబం నుంచి వచ్చిన వాళ్ల మనస్తత్వం వేరుగా ఉంటుంది. వ్యాపార కుటుంబాలనుంచి వచ్చిన వాళ్ల మనస్తత్వం వేరుగా ఉంటుంది. రైతు కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లు ప్రకృతికి చాలా దగ్గరగా ఉంటారు. అందుకని వాళ్లకి స్పందన కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. మనం మొక్కజొన్న చేను పక్క నుంచి వెళ్లేటప్పుడు ఒక కండె ఇస్తావా అని అడిగితే, నాలుగు ఇస్తాడు రైతు. అది రైతు మనస్తత్వం. అదే బిజినెస్ పీపుల్‌కి ఉండదు. అప్పుడొచ్చిన నాయకులందరూ రైతు కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే. అందుకనే ఆ స్పందన వచ్చింది అనుకుంటా.

మీకు తాతగారితో బాగా రిలేషన్ ఉండేదా?

ఆయన 1943లో చనిపోయారు. నేను అప్పటికి పుట్టలేదు. నాన్నగారు పోయేటప్పటికే నాకు ఆరేళ్ల వయసు. అందుకనే నన్ను గోరా గారు పెంచారు.

భిన్న వాతావరణంలో పెరిగిన మీరు సినిమాల్లోకి ఎలా వచ్చారు?

అదొక విచిత్రం. భిన్నమైన మనుషులు, భిన్నమైన సంస్కృతులు. చిన్నప్పుడు బాలానందంలో ఉండడం, గోరా గారి దగ్గర పెరగడం. ఆర్ట్ సర్కిల్స్ వైకుంఠం, చంద్ర వాళ్లతో ఉండడం. రాజకీయంగా చూసుకుంటే విరసం వాళ్లతో జతకట్టడం. వీటి పక్కనే మా షిర్డీసాయిబాబా ఉండడం.

మీ జీవితం చూస్తే చాలా వైవిధ్యంగా ఉంటుంది!

చిన్నప్పుడు నేను హెర్మిన్‌హ్యాసన్ 'సిద్ధార్థ' నవల చదివాను. అందులో సిద్ధార్థుడు సత్యాన్వేషణకు వెళ్తాడు. ఈ సిద్ధార్థుడు బుద్ధుడు కాదు. నవలలో ఒక పాత్ర. ఆ సత్యాన్వేషణలో అతను 'ఐ కెన్ థింక్. ఐ కెన్ స్టార్వ్, ఐ కెన్ వెయిట్' అంటాడు. దాన్నే నా జీవితంలో అడాప్ట్ చేసుకున్నాను. అందుకే జీవితంలో దేనికీ తొందర పడనక్కర్లేదు. ఆలోచిద్దాం. జీవితంలో నాకిది ఇష్టమని సృష్టికి చెప్దాం. ఎదురు చూద్దాం. ఏదో ఒకరోజు అది మన దగ్గరకొస్తుంది. రేషనలిస్ట్ కుటుంబం నుంచి వచ్చిన నన్ను మిస్టిక్ ఎక్స్‌పీరియెన్స్‌లు అటువైపుకు లాగుతున్నాయి. ప్రత్యక్షంగా చూస్తున్న దాన్ని ఎలా కాదనగలగాలి? కాదనలేకపోతున్నాను. షిర్డీ సాయిబాబా నడిపిస్తున్నారా, నాన్నగారు, తాతగారు ఇద్దరూ చెరో చెయ్యి పట్టుకుని నన్ను నడిపిస్తున్నారా? ఏంటో తెలియదు. జీవితం అలా జరుగుతోంది. ఈ రోజున ఈ సినిమా అవకాశం కూడా కరెక్ట్ టైంలో వచ్చింది. వాట్ ఐ మిస్డ్ ఇన్ లైఫ్...

ఏం మిస్ అయ్యారు?

అదే తండ్రితనం.

ఇప్పుడు పెళ్లి చేసుకోవాలన్న ఆలోచన వచ్చిందా?

(నవ్వులు) మా మేనల్లుళ్లు, మేనకోడళ్లు అంటారు 'స్టిల్ యు ఆర్ ఎలిజిబుల్ బ్యాచిలర్ సాయి మామా' అని.

ఇప్పుడు మీ వయసు చెప్తే తప్ప, మీరు ఏజ్డ్ అని ఎవరూ అనుకోరు.

నాకిప్పుడు 61 ఏళ్లు. పెళ్లి మీద ఎలాంటి ఆసక్తి లేదు. కానీ సాయిపల్లవితో జీవితాంతం తండ్రీకూతుళ్ల అనుబంధం ఉంటే చాలు.

కానీ వేరే క్యారెక్టర్‌లో ఇన్‌వాల్వ్ అయితే ఈ భావన పోతుందేమో?

అంటే బెంగ ఏమన్నా డైల్యూట్ అవుతుందేమో. కానీ ఆ పిల్ల మీద ఉన్న తండ్రితనం పోయే అవకాశం లేదు.

షూటింగ్ సమయంలోనే తెలియకుండానే సాయిపల్లవితో అటాచ్‌మెంట్ బాగా పెరిగింది. ఒక రకంగా బెంగ మొదలయింది. దాంతో డబ్బింగ్ తరువాత సినిమా చూడకూడదని నిర్ణయించుకున్నాను. చూళ్లేదు కూడా. దీన్నుంచి బయటపడటానికే వెంటనే నాన్న క్యారెక్టర్ కాకుండా వేరే క్యారెక్టర్ ఇవ్వమని దిల్‌రాజును అడిగాను. ముందుగా దీన్నుంచి బయటపడాలంటే అది అవసరం. పిల్లలతో ఇంత ఆనందం ఉంటుందా ఇప్పుడు అనిపిస్తూ ఉంటుంది. నాకు పెళ్లయి పిల్లలు పుట్టినా సాయిపల్లవి లాంటి కూతురు పుట్టేదా అనిపిస్తుంది. అంత ఎఫెక్షన్ ఏర్పడింది.

కమర్షియల్ హీరో అవ్వాలనుకోలేదా?

'యువతరం కదిలింది', 'ఎర్ర మల్లెలు' వంటి సినిమాలు చాలానే చేశాను. కమర్షియల్ అవ్వాలనుకోలేదు. రాఘవేంద్రరావు తండ్రి కె ఎస్ ప్రకాశరావు గారు, నాన్నగారు మంచి మిత్రులు. కె ఎస్ ప్రకాష్ గారికి నన్ను కమర్షియల్ సినిమాల్లోకి తేవాలని చాలా ఉండేది. ఆయనెప్పుడూ ఫోన్ చేసి పిలిపిస్తుండేవారు. నేనేమో తప్పించుకుంటుడే వాడ్ని. అలాగెందుకంటే మనం సోషల్ వర్క్ ఎలాగూ చేయలేం. కనీసం చేసే పనిలో అయినా అది ఉండాలి అనుకునేవాడ్ని. చేసిన సినిమాల్లో 'మా భూమి' నుంచి 'అంకురం' వరకు కూడా సోషల్లీ రిలవెంట్ సినిమాలే చేశాను. ఇప్పుడు డాక్యుమెంటరీలు చేస్తున్నాను. నాన్నగారి వర్క్స్ చేద్దామనే ఇలా షిఫ్ట్ అయ్యాను. 'మాభూమి'లో ఒక మంచి డైలాగ్ ఉంది. 'ప్రజలకోసం పాటుపడేదానికంటే మంచి బతుకు ఏముంటదయ్యా' అని కాకరాల మా నాన్నతో అంటారు. ఎందుకో గాని ఆ మాట నన్ను వెంటాడుతుంది. అందుకే ఏ పని చేసినా అందులో పది శాతం అయినా ప్రజల కోసం ఉంటే బాగుండనిపిస్తుంది.

మరి మీరు చేస్తున్నదానిలో అది ఉందనే తృప్తి ఉందా?

101 శాతం నేను చేస్తున్న పని చాలా తృప్తిగా ఉంటుంది. అందుకే నాకు దేని మీదా హడావిడి ఉండదు. సినిమా చేశాను చాలా తృప్తి పడ్డాను. డబ్బు మీద ఆరాటం లేదు. అందుకు తాతగారే ఎగ్జాంపుల్ నాకు. వాళ్లకి 200 ఎకరాల భూమి ఉండేది. ఐదుగురు అన్నదమ్ములు. వాళ్లంతా ఏనాడూ పట్టించుకోలేదు. బారిస్టరు చదివి వచ్చి కూడా తాతగారు ప్రాక్టీసు చేయలేదు. నాన్నగారూ అంతే. వాస్తవానికి డబ్బుకే అంత విలువ ఉంటే తాతగారు ఎందుకలా చేసి ఉండేవారు? ఆయనకే లేదు కదా మనకెందుకు? 'మా భూమి'లో చేసినందుకు ఎంత పేరు వచ్చిందో ఐదు సీన్ల వేషం చేసిన 'అంకురం'కి అంతే పేరు వచ్చింది. ఇప్పుడు 'ఫిదా' సినిమాకి అయితే ప్రపంచం నలుమూలల నుంచి 'నాన్నా నాన్నా' అని పిలుస్తున్నారు. యూనివర్శల్ ఫాదర్ అయిపోయాను. తమ్మారెడ్డి భరద్వాజ కూడా 'యూనివర్శల్ ఫాదర్' అయ్యావు అన్నారు. పెద్దవాళ్లు కూడా ఫోన్ చేసి 'మా నాన్న గుర్తొస్తున్నాడు. మాకు ఆ విలేజ్ లైఫ్ గుర్తొస్తోంది' అంటున్నారు. ఒక తండ్రికి ఇద్దరు పిల్లలు ఉండొచ్చు. ధృతరాష్ట్రుడికి వందమంది పిల్లలు ఉండొచ్చు. నాకు మటుకు ఒక్క సినిమాతో ఇన్ని కోట్ల మంది పిల్లలు అయిపోయారు.

గతంలో నటించిన సినిమాల్లో ఎక్స్‌పీరియెన్స్‌లు ఎలా ఉండేవి?

నేపథ్యం వేరుగా ఉండేవి. 'మంచుపల్లకి', రాంగోపాలవర్మ 'శివ' కమర్షియల్ సినిమాల్లో చేశాను. నేనప్పటికే మానేద్దామనుకుంటుంటే.. 'ఈ సినిమా చేయండి' అన్నాడు వర్మ. 'మాభూమి' సినిమాలో డైలాగులన్నీ వచ్చు ఆయనకు. నేను ఏ పాత్ర చేసినా ఎక్కడిక్కడ డిటాచ్ అయిపోగలిగేవాడ్ని. కానీ 'ఫిదా' క్యారెక్టర్ మటుకు నన్ను వెంటాడుతోంది.

మరి ఈ సందర్భంలో రాంగోపాల్‌వర్మను కలవకపోయారా?

నాకు పరిచయం ఉన్న రాంగోపాల్‌వర్మ, ఇప్పుడు రాంగోపాల్‌వర్మకి ఎంతో తేడా ఉంది. పబ్లిసిటీ అంటే అస్సలే ఇష్టపడని వ్యక్తి. నా సినిమాయే మాట్లాడాలి అనేవాడు. ఫోటోల్లో ఉండడానికి ఇష్టపడేవాడు కాదు. అందుకే 'శివ' ఓపెనింగ్ ఫోటోల్లో రాంగోపాల్‌వర్మ కనిపించడు. అలాంటి రాంగోపాల్‌వర్మ ఇప్పుడు టోటల్‌గా డిఫరెంట్‌గా ఉన్నాడు.

కమర్షియల్ హీరోలతో ఎవరితో సంబంధాలు లేవా మీకు?

చిరంజీవితో 'మంచుపల్లకి' చేశాను. నేను సినిమాలు మానేయడం చిరంజీవికి అస్సలు ఇష్టం ఉండేది కాదు. 'పొటెన్షియల్ యాక్టర్‌వి నువ్వు మానేయడం ఎందుకు' అన్నారు. 'జీవితంలో వైవిధ్యం ఉండాలి. భిన్న కోణాలు ఉంటాయి. అటువైపు కూడా చూస్తే బాగుంటుంది కదా' అన్నాను నేను. డాక్యుమెంటరీలు తీస్తున్నాను అని తెలిసి నన్ను పర్సనల్‌గా పిలిపించి అల్లురామలింగయ్య గారి మీద ఐదు గంటల డాక్యుమెంటరీ తీయించారు. రాజేంద్రప్రసాద్, అమలతో మాట్లాడుతుంటాను.

మీ తాతగారి బయోగ్రఫీ తీస్తున్నారట.

స్క్రిప్ట్ అయితే చేశాను. కానీ నాకొస్తున్న సమస్య ఏంటంటే ఆయన ఐర్లాండ్‌లో చదివాడు. ఆ షూటింగ్ పార్ట్ ఎలా అనేది ఇబ్బంది పడుతున్నా. మిగిలినదంతా బానే ఉంది. 'వీరగంధం' పాట, ఆంధ్ర రాష్ట్రం ఉద్యమప్పుడు రాసిన పాటల్లో 'తెలుగు రాష్ట్రం తెరతేరగ ఊడిపడునా...' అనే దానిలో ప్రకాశం పంతులు సరిగా పార్టిసిపేట్ చేయడం లేదని 'ఆంధ్రకేసరి రేయింబవళ్లు గుహన నిద్దర పోయినప్పుడు' అని ఉంటుంది. అలాగే పెళ్లిళ్లు సంస్కృతంలో జరుగుతున్నాయి. తెలుగులో పెళ్లి జరగాలని చెప్పారు. తాతగారి విషయానికి వస్తే ఒక కర్మయోగిని చూసినంత భావన కలుగుతుంది నాకు.

మరి ఆయన పాత్ర మీరే వేస్తారా?

అదే నా కోరిక. ప్రొడ్యూసర్, డైరెక్టర్, హీరో - ఇలా మూడు బాధ్యతలు తీసుకోవాలి. అన్నీ కలిపి చేస్తే దానికి న్యాయం చేయలేను. అందుకనే మొదటి రెండూ ఎవరైనా తీసుకుంటే హీరోగా నేను చేస్తాను. లేదంటే వేరెవరితో అయినా ఆ పాత్ర వేయించాలి.

మీ లైఫ్ యాంబిషన్ ఏమిటి?

ఇప్పటికి మాత్రం బయోపిక్ తీయడం. యాంబిషన్స్ అనేవి ఎప్పుడూ పెట్టుకోలేదు. ఇందాక చెప్పినట్టు 'ఐ కెన్ వెయిట్'.

అసాధారణ క్యారెక్టర్ ఏదైనా చేయాలని ఉందా?

అదే తాతగారి క్యారెక్టర్. ఆయన రాసినవన్నీ నేను పాడగలను. ఆయన పేరుతోనే సినిమా పేరు పెట్టి 'ది లాస్ట్ లెజెండ్' అనే క్యాప్షన్ పెడదామనుకుంటున్నాను. చాలామంది ఫీలవుతారు. కానీ సినిమా కాబట్టి అలా పెడితే బాగుంటుంది కదా.

కవిరాజు రామస్వామి గారి బయోపిక్ సాధ్యమైనంత తొందరగా తీసుకు రావాలి. అది పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటూ థ్యాంక్యూ వెరీమచ్.

సాయిచంద్: రాధాకృష్ణ గారు మిమ్మల్ని ఎప్పటినుంచో ఒకటి అడగాలనుకున్నా. మీలో చాలా డైనమిజమ్ ఉంటుంది. సామాజికాంశాల పట్ల స్పందిస్తుంటారు. మీపై మా తాతగారి ప్రభావం ఏమైనా ఉందా?

ఆర్కే: మాది తెలంగాణ. ఆ సాహిత్యం గురించి తెలియదు. ఇంకొక ప్రాబ్లమ్ ఏంటంటే మా గ్రామాల్లో లైబ్రరీలు తక్కువ. ఆంధ్రాలో లైబ్రరీ మూవ్‌మెంట్ ఉండేది. పఠనాసక్తి చిన్నప్పట్నించీ వచ్చేది. మాకిక్కడ అసలు ఉండేది కాదు. ఆ తరువాత హైదరాబాద్ వచ్చాక నేర్చుకున్నవే ఇవన్నీ. ఊళ్లో ఉన్నప్పుడు మాకేమీ తెలియదు.

సాయిచంద్: మీ గట్స్ చూస్తుంటే ... అందులో నాకు 10 శాతం ఉన్నా కొండల్ని పిండి చేయగలను అనిపిస్తుంది. మీ గట్స్‌లో ఎక్కడో మా తాతగారు తగులుతుంటారు.

ఆర్కే: గ్రామాల్లో జరిగే అన్యాయాలు, దోపిడీలు చూసినోడ్ని నేను. అందుకని అది కొంత పనిచేస్తుంటుంది.

సాయిచంద్: ప్రొటెస్ట్ చేయడం వేరు. ఒక్కోసారి ప్రాణాన్ని కూడా లెక్కచేయకుండా వెళ్తుంటారు...

ఆర్కే: నేను నమ్మేది ఒక్కటే - ఏం జరగాలని ఉంటే అది జరుగుతుంది. డెస్టినీని నమ్ముతా.

సాయిచంద్: ప్రాబ్లమ్ ఉందని చెప్తే అక్కడికి వెళ్లిపోతారు మీరు. ఈయన అలా ఎలా వెళ్తున్నాడు అనిపిస్తుంది. మేము అలాంటి ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చీ వెళ్లడంలేదు. మీరు ప్రాణాన్ని కూడా లెక్కచేయకుండా వెళ్తుంటారు. అందుకే మా తాత ప్రభావం ఏమైనా ఉందా అని అడుగుతున్నా!

ఆర్కే: ఇదంతా తర్వాత వచ్చిందే తప్ప. బాల్యంలో, విద్యార్థి దశలో ఏమీ తెలియదు. మాది మహారాష్ట్ర బోర్డరు. అందుకే మాకేమీ తెలియదు.

ఆర్కే: మీ నాన్నగారికి ఎన్టీఆర్‌తో అంత అటాచ్‌మెంట్ లేదు. కానీ మీ తాతగారి ఇన్‌ఫ్లుయెన్స్ ఎన్టీఆర్ మీద ఉంది కదా..

సాయిచంద్: తాతగారు 1943లో చనిపోయారు. తాతగారు ఉన్న రోజుల్లోనే.. ఆయన ఎసి కాలేజీలో చదువుకుంటున్నప్పుడు 'శంభుకవధ', 'ఖూనీ' నాటకాలు జగ్గయ్య గారు, ఆయన వేసేవారట. రామారావు గారు తాతగారిని కలవలేదు కానీ ఇన్‌ఫ్లుయెన్స్ చాలా ఉందని చెప్పారు. భారతదేశంలో దుర్యోధనుడ్ని, రావణాసురుడ్ని హీరోగా చేసింది ఎన్టీరామారావు గారే. దానికి నేపథ్యం తాతగారే. పురందేశ్వరి గారు కూడా ఒక మీటింగ్‌లో మాట్లాడుతూ 'మా నాన్నగారు కవిరాజు గార్ని ఆ జన్మాంతం గురువుగానే భావించార'ని చెప్పారు. తాతగారికి 101 శాతం రామారావుగారే వారసులు. తెలుగుదేశం పార్టీ ఫౌండేషన్‌లో తాతగారి సిద్ధాంతం చాలా ఉందని చాలామంది అంటుంటారు కూడా. ట్యాంక్‌బండ్ మీద తాతగారి విగ్రహం ప్రత్యేకంగా పెట్టించారు. తెలుగు యూనివర్సిటీ ద్వారా ఆయన సాహిత్యాన్ని పబ్లిష్ చేయించారు. అలాగే ఆ రోజుల్లో రాష్ట్రంలో ఏ సమస్య వచ్చినా తాతగారు రాసిన 'వీరగంధం' పాట మారు మోగిపోయేది.

గుడ్ మార్నింగ్



వినడానికి కటువుగా అనిపించినా, నీ గురించి వాస్తవాలు చెప్పేవారి సలహానే తీసుకో

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య

కౌన్సెలింగ్

మూత్ర విసర్జనపై అదుపు తప్పితే...

మన ప్రమేయం లేకుండానే తరుచూ బొట్లు-బొట్లుగా మూత్రం పడటాన్ని మూత్రవిసర్జన అదుపు తప్పడం (యూరినరీ ఇన్‌కాంటినెన్స్) అంటారు. ఈ స్థితిలో తుమ్మినా, దగ్గినా, బరువులు ఎత్తినా దుస్తుల్లో చుక్కలుగా మూత్రం పడుతుంది. ఈ సమస్య ఎక్కువగా స్త్రీలల్లోనే కనిపిస్తుంది. కొంత మంది వృద్ధులు కూడా ఈ సమస్యకు గురవుతుంటారు. నిజానికి మూత్రం మీద అదుపు లేకపోవడం అనేది ఒక వ్యాధి కాదు. శరీరంలోని ఒక వ్యాధి లక్షణం మాత్రమే.



ఈ సమస్యకు అసలు కారణంగా....

▲ మూత్రాశయంలో రాళ్లు, లేదా కణుతులు ఏర్పడటం

▲ మూత్రనాళం ఇన్‌ఫెక్షన్లకు గురికావడం

▲ స్త్రీలల్లో గర్భసంచి జారడం (దీన్నే పేగు జారడం అంటారు)

▲ జననేంద్రియం జారిపోవడం

▲ దీర్ఘకాలిక మలబద్ధకం వంటివి ప్రధానంగా ఉంటాయి.

పాటించవలసిన జాగ్రత్తలు

▲ కాఫీ, టీలు అతిగా తాగే అలవాటు ఉంటే మానెయ్యాలి. లేదా చాలావరకు తగ్గించాలి.

▲ ఒకేసారి ఎక్కువ మోతాదులో భోజనం చేయడం గానీ, నీళ్లు తాగడం గానీ కాకుండా, తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.

▲ అధిక బరువుతో ఉంటే తగ్గించుకోవాలి.

▲ మూత్ర విసర్జనకు వెళ్లినప్పుడు, మూత్రం పూర్తిగా ఖాళీ అయ్యే వరకూ ఉండాలి. ఆ తర్వాత కూడా మూత్రం వచ్చేలా ఉంటే మరోసారి ప్రయత్నించాలి.

▲ మలబద్ధకం ఉంటే పీచుపదార్థం ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి.

నయాహవా

ఫేస్ డ్యాన్స్ ఛాలెంజ్!

ఇంటర్నెట్‌లో ఎప్పటికప్పుడు సరికొత్తగా ఛాలెంజ్‌లు వస్తూంటాయి. కొత్తగా, డిఫరెంట్‌గా ఉంటే మాత్రం జనాలు అక్కున చేర్చుకుంటారు. తాజాగా ఫేస్ డ్యాన్స్ ఛాలెంజ్ యూత్‌ని కిక్కెక్కిస్తోంది. ఈ ఛాలెంజ్ వీడియోలు యూట్యూబ్‌లో, సోషల్ వెబ్‌సైట్స్‌లో హల్చల్ చేస్తున్నాయి. అసలు ఈ ట్రెండ్ ఏంటంటే.. మొదట స్మార్ట్‌ఫోన్‌లో ఉండే ప్లే స్టోర్‌కు వెళ్లి ఫేస్ డ్యాన్స్ ఛాలెంజ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేస్తూనే.. ఆ యాప్ మన ఫేస్‌ను డిటెక్ట్ చేసుకుంటుంది. కౌంట్‌డౌన్ స్టార్ట్ అవుతూనే వెంటనే గేమ్ ఆరంభమవుతుంది. స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ కింది వైపు నుంచి రకరకాల ముఖకవళికల్లో (మూతివంకర, కళ్లు పైకి, కిందికి తిప్పడం) ఉండే ఎమోజీల బొమ్మలు తెరకింది నుంచి పైకి వస్తుంటాయి. అచ్చు ఆ ఎమోజీల ఫీలింగ్స్ మాదిరే మన ఫేస్‌ను పెట్టాలి. ఖచ్చితంగా ఆ ఎమోజీల్లాగా ముఖాన్ని పెడుతుంటే చాలు.. పెర్ఫెక్ట్ అంటూ పాయింట్స్ కూడా యాడ్ అవుతుంటాయి. విషయమేంటంటే ఈ ఎమోజీలు వేగంగా మారుతుండటం ట్విస్ట్ ఇక్కడ. అందుకే ముఖకవళికల్ని అంతే శరవేగంగా మార్చాల్సి ఉంటుంది. అంటే ముఖం డ్యాన్స్ వేసినట్లుంటుందన్నమాట! అందుకే.. దీన్ని ఫేస్ డ్యాన్స్ ఛాలెంజ్ అన్నారు. అన్నట్లు ఈ గేమ్‌లో ఫేస్ డ్యాన్స్ అంతా రికార్డ్ అవుతుంది. ఆ రికార్డ్ ఫైల్‌ను మనం చూసుకోవచ్చు. చాలా బావుంటే స్నేహితులతో షేర్ చేసుకోవచ్చు. బాగలేకుంటే మళ్లీ ప్రయత్నించవచ్చు. ప్రస్తుతం విదేశాల్లో ఉండే ఈ ఫేస్ డ్యాన్స్ ఛాలెంజ్ వీడియోలు ట్విటర్, ఇన్‌స్టాగ్రమ్‌లో ఎక్కువగా షేర్ అవుతున్నాయి.



డైలీ సుడోకు - 159

		7	5				3	1
					2			6
		1		3		5	2	
					9			5
	1	3				6	7	
6			1					
	7	5		9		4		
3			2					
1	8				6	2		

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

నిన్నటి సుడోకు- 158 సమాధానం

సైనికులకు, వారి కుటుంబాలకు స్వేచ్ఛ అంటే ఏమిటో తెలుసా... త్యాగాలతో కూడిన జీవితం. దేశ భద్రత, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం ప్రాణాలు అర్పించడం తెలిసిన ఈ వీరులు మంచుతుపాన్ల మధ్య, ప్రమాదభరితమైన వాతావరణంలో, మంచుకొండల్లో, దేశ సరిహద్దుల్లో, యుద్ధభూముల్లో కనురెప్ప సైతం వాల్చకుండా కాపుకాస్తుంటారు. పోరాటం చేస్తుంటారు. తిండి కూడా సరిగా దొరకని ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తుంటారు. వీళ్లకి దేశం తర్వాతే భార్యాబిడ్డలు, కుటుంబం. దేశభక్తి అన్న మాటే వీరిలో వీరత్వాన్ని పొంగిస్తుంది. అలాంటి సైనికుల భార్యలు తమ భర్తలు చేస్తున్న దేశ సేవకు ఎంతో ఉప్పొంగిపోతారు...గర్వపడతారు. కానీ... సైనిక కుటుంబాల్లోని మహిళలు, పిల్లలు చేస్తున్న త్యాగాలు, పడుతున్న కష్టాలు ఎన్నో ఉన్నాయి. భర్త యుద్ధంలో చనిపోయినా, రిటైరయ్యి చనిపోయినా ఆ వీర సైనికుల భార్యల కష్టాలు చెప్పలేనివి. అలాంటి కొందరు వీరమాతలు తమ మనసులోని మాటను 'నవ్య'తో పంచుకున్నారు.

సైనిక కుటుంబాలు

వీర మాతలకు దిక్కెవరు?

దేశభక్తి ఊపిరిగా పనిచేసినా..

'నా భర్త పేరు భూపాల్. ఆయన గన్నర్... అంటే యుద్ధవీరుడు. ఎనిమిదేళ్ల పాటు సైన్యంలో పనిచేశారు. తర్వాత యాక్సిడెంటులో మరణించారు. దేశానికి ఆయన అందించిన సేవలు తలచుకుంటే నా మనసు ఉప్పొంగిపోతుంది. చైనా, పాకిస్తాన్‌లతో జరిగిన యుద్ధాలలో పాల్గొన్నారాయన. ఆయనలో దేశభక్తి ఎంత ఉండేదో, నిజాయితీ, నిబద్ధతలు కూడా అంతే ఎక్కువ ఉండేవి. ఆయన ఇంట్లోంచి పారిపోయి సైన్యంలో చేరారు. ఆయన తమ్ముడు కూడా సైన్యంలో చేరాడు. కానీ... ఆయన ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో ఎవ్వరికీ తెలియదు. యుద్ధ ఖైదీ అయ్యాడో, అసలు బతికున్నాడో లేదో కూడా తెలియదు. చైనాతో మా ఆయన యుద్ధం చేసిన ప్రదేశాలను చూసినపుడు ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. అక్కడి మంచుకొండల్లో యుద్ధం చేయడమంటే మాటలు కాదని ఆ ప్రాంతాన్ని చూశాక నాకు అర్థమైంది. క్షణం నిలవడం కష్టంగా ఉండే చోట ఆయన, మరెందరో భారత సైనికులు ఎన్ని కష్టాలు ఎదుర్కొని ఉంటారో తలచుకుంటేనే గుండె బరువెక్కింది. సైనికులకు తినడానికి తిండి కూడా అక్కడ సరిగా దొరికేది కాదు. చైనా గోడ, వాఘా సరిహద్దులను చూసినపుడు ఎంతటి కఠిన పరిస్థితుల్లో సైనికులు దేశం కోసం పనిచేస్తున్నారో అర్థమైంది.

సైనికుడిగా దేశానికి మా ఆయన అందించిన సేవలు ఎంతో గొప్పవైనవే కానీ సైనికుల విజయం వెనుక వారి కుటుంబాలు ముఖ్యంగా భార్యా, పిల్లలు చేస్తున్న త్యాగాలు, కష్టాలు ఎవరికి అర్థమవుతాయి? మా ఆయన ఎనిమిది సంవత్సరాలు కుటుంబానికి దూరంగా ఉన్నారు. మా పెళ్లయిన మూడవ రోజునే ఆయన దేశ రక్షణ విధులు నిర్వహించడానికి వెళ్లిపోయారు. సైనికుల నుంచి వారి భార్యలకు ఉత్తరాలు రావడం కూడా అపురూపమే. అది కూడా అన్ని రకాల చెకప్స్ అయి వస్తాయి. మా ఆయన నుంచి ఏటికొకసారి వచ్చే ఉత్తరంలో 'నేను బాగున్నాను. నాగురించి బాధపడకండి. మీరందరూ బాగున్నారు కదా...'అని మాత్రం రాసి ఉండేది. ఎప్పుడో వచ్చే ఉత్తరం తప్ప మా మధ్య ఎలాంటి కమ్యూనికేషన్ ఉండేది కాదు. సైనిక వార్తలు తెలుసుకోవడానికి ఎప్పుడూ ట్రాన్సిస్టర్ మా దగ్గర పెట్టుకునేవాళ్లం. ఆయన యుద్ధం చేసినదానికి గుర్తుగా పతకాలు ప్రదానం చేశారు. దురదృష్టమేమిటంటే ఆయన చనిపోయినా ఇప్పటి వరకూ నాకు పింఛను రావడం లేదు. ఎందుకు అని అడిగితే నిబంధనలు కారణమంటున్నారు. సైన్యంలో 15 సంవత్సరాలు పనిచేస్తేనే పింఛను వస్తుందని కొందరు అధికారులు చెప్పారు. కానీ ఐదు సంవత్సరాలు పనిచేస్తే పింఛనుకు అర్హులని మరికొందరు చెప్పారు. నేను ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరేదొక్కటే సైన్యంలో ఎంత కాలం పనిచేశారు అన్న ప్రాతిపదికన కాకుండా సైన్యంలో పనిచేసిన 'వీరజవాను'గా వారి సేవలు గుర్తించి వారికి పింఛను ఇవ్వాలి. మరణించిన సైనిక కుటుంబాల బాగోగులు, సంక్షేమం కోసం ప్రభుత్వాలు, సైనిక ఉన్నతాధికారులు నిజాయితీగా కృషిచేయాలి. ఇక దేశ భక్తి పట్ల ఇప్పటి తరానికి సీరియస్‌నెస్ లేదు. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలన్నీ ఆర్భాటాలుగా మిగిలిపోతున్నాయి. పైగా నిత్యం సైనికులు చనిపోతున్న వార్తలు వినడంతో సైనికుల పోరాటం వీరికి సర్వసాధారణ విషయమైపోయింది. నేనయితే ఇప్పటికీ యువతకు చెపుతుంటా ఆర్మీలో చేరమని. దేశ సేవ చేయమని.. జీవితాన్ని అర్థవంతంగా మలుచుకోమని... అలాగే సైనిక కుటుంబాలకు ఉండేందుకు స్థలాలు ఇచ్చి, వారి సమస్యలు పరిష్కరించి వారందించిన సేవలకు తగిన గౌరవం, గుర్తింపు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాను'

- మణి బాయ్, 72 ఏళ్ల

పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలు ఉన్నారు!

'మా ఆయన పేరు అశోక్ కుమార్. నాయక్‌గా పనిచేశారు. 18 సంవత్సరాలు సైన్యంలో ఆర్డినెన్స్ విభాగంలో విధులు నిర్వహించారు. దేశ సేవ చేయాలనే తలంపుతో ఆయన సైన్యంలో చేరారు. మాకు ముగ్గురు ఆడపిల్లలు. ఇప్పుడు ఆయన లేరు. వచ్చిన పింఛను కుటుంబానికి సరిపోదు. ముగ్గురు ఆడపిల్లలకూ ఇంకా పెళ్లిళ్లు కావాలి. ఆడపిల్లల బాధ్యత ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు. కేంద్రం ఇచ్చే పింఛనే మాకు దిక్కు. హైదరాబాదు, సికింద్రాబాద్‌లో 50,000 సైనిక కుటుంబాలు ఉన్నాయి. మొత్తం ఐదారు లక్షల ఓట్లు ఉన్నాయి. మేం కూడా ఇక్కడి ప్రభుత్వాలకు ఓట్లు వేస్తున్నాం. కాబట్టి ప్రభుత్వం మాకు స్పందించాలి. మా డిమాండ్లను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలి. రిటైర్ అయిన వారికి స్థలాలు, వృద్ధులకు పునరావాసం.. వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టాలి. శాసనసభలో మా ప్రతినిధి ఒక్కరూ లేరు. రాజకీయ ప్రాతినిధ్య అవకాశం మా సైనిక కుటుంబాలకు కల్పించాలి. సైన్యంలో చేరిన వారందరూ 20 ఏళ్ల లోపువారే. ఇంటిని, సొంత గ్రామాన్ని, రక్తసంబంధీకులను వీడి సైన్యంలో చేరతారు. దేశమే తమ ప్రాణం అనుకుంటారు. ఆ కుటుంబాలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై, ప్రభుత్వాలపై ఎంతో ఉంది'

- చంద్రకళ, 52 ఏళ్ల

పిల్లలు సరిగా చూడడం లేదు!

'మా ఆయన పేరు పాల్. ఎయిర్‌ఫోర్సులో 38 ఏళ్ల పాటు సేవలందించి రిటైరయ్యారు. ఎయిర్‌ఫోర్సు బ్యాండ్స్ చూసే మ్యూజిషియన్. అంతేకాదు సైనిక క్యాంపులకు గార్డుగా వ్యవహరించారు. రక్షణ బాధ్యతలు నిర్వహించారు. ఆయన దేశానికి సేవ చేయడం ఆనందంగానే ఉన్నా, ఎదుగుతున్న వయసులో పిల్లల దగ్గర తండ్రి లేరన్న బాధ ఉండేది కొత్త చోట భాష రాక మేం పడే బాధలు సైతం ఎన్నో. అన్ని పనులూ మేమే చూసుకోవాలి. ఎయిర్‌ఫోర్సులో పనిచేస్తున్న మా ఆయన తన తండ్రి చనిపోయినప్పుడు కూడా వచ్చి చూడలేకపోయారు. మా మామగారు కూడా ఎయిర్‌ఫోర్సులోనే పనిచేశారు. దేశసేవలో ఇలాంటి త్యాగాలు తప్పవు కానీ తండ్రిని చూసుకోలేకపోయాననే బాధ మాత్రం ఆయనకుంటుంది కదా! దేశ రక్షణ విధుల్లో భాగంగా అయిన వారికి దూరమవుతాం. అంతేకాదు నాన్న తమతో లేరన్న అసంతృప్తి పిల్లల్లో గూడు కట్టుకుంటుంది. పండుగలు, పబ్బాలప్పుడు నాన్న లేకుండానే చేసుకోవాలా అని మా పిల్లలు మారాం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మా అమ్మావాళ్లది కూడా సైనిక కుటుంబమే. మా నాన్నగారు రంగూన్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆయనకు మేం మొత్తం ఏడుగురు పిల్లలం (ఇద్దరు ఆడపిల్లలు, ఐదుగురు మగపిల్లలు). ఆయన యుద్ధంలో ఉన్నప్పుడు మా అమ్మ ఐదుగురు మగపిల్లల్ని కోల్పోయింది. అది మా నాన్నను ఎంతగానో కలిచివేసింది. మా అమ్మ దుఃఖం అయితే చెప్పలేను. కానీ దేశం కోసం పనిచేసే వారికి దేశ రక్షణే ముఖ్యం. అందుకే మా నాన్న అలాంటి బాధాకర క్షణాల్లో కూడా తన విధులను ఎంతో నిబద్ధతతో నిర్వహించారు. పదేళ్ల సైన్యంలో పనిచేశారు. చివరికి అందరి పిల్లల్లో నేనొక్కదాన్ని మిగిలాను. మా చిన్న కొడుకును కూడా మేం ఎయిర్‌ఫోర్సులో చేర్చాం. మా కుటుంబం మొత్తం దేశానికి సేవ చేయడం ఎంతో గర్వంగా ఉంది. ఇవన్నీ ఒక ఎత్తు. కానీ సైన్యంలో పనిచేసి మరణించిన సైనికుల భార్యల జీవితాలను ఆదుకోవడానికి ప్రభుత్వాలు, సైనిక అధికారులు చేయాల్సిన సంక్షేమ పనులు ఎన్నో ఉన్నాయి. సైనిక కుటుంబాలకు ఇస్తున్న పింఛన్లు చాలక ఆ కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయి. అంతేకాదు బయట సమాజంలోలాగే సైనిక కుటుంబాల్లో కూడా తల్లిదండ్రులను పిల్లలు సరిగా చూసుకోని పరిస్థితి ఉంది. ముఖ్యంగా సైన్యంలో పనిచేసి ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ల భార్యల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. పిల్లలు చూడకపోవడంతో వారి జీవితం నడిరోడ్డు పాలవుతున్నాయి. అందుకే భర్తను కోల్పోయిన మహిళలకు ప్రభుత్వాలు స్థలం ఇవ్వడం, పింఛను పెంచడం వంటి సంక్షేమ చర్యలను పూర్తిస్థాయిలో చేపట్టాలి. పేదలకు సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్నట్టే సైనిక కుటుంబాల వారి సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు అమలయ్యేలా చూడాలి. ఆనాడే సైనికులు దేశానికి అందించిన సేవలను ప్రభుత్వాలు గుర్తించాయని మేం భావిస్తాం.

-హెలెన్, 56 ఏళ్ల

వచ్చే పింఛను సరిపోదు!

'మా ఆయన పేరు పృథ్వీసింగ్. ఢిల్లీ, భటిండాల్లో దేశ భద్రతా కార్యక్రమాల్లో సిపాయిగా పనిచేశారు. పదిహేనేళ్లపాటు సైన్యంలో ఉండి సేవలు అందించారు. 'సైనికులుగా మా కష్టాలు మీకు ఎంత చెప్పినా అర్థం కావు' అని మా ఆయన నాతో తరచూ అంటుండేవారు. ఆయన దేశం కోసం ఎంతో నిబద్ధతతో పనిచేశారు. కుటుంబాన్ని పట్టించుకునే సమయం, తీరిక ఆయనకు ఉండేవి కావు. చివరకు ఆయన అనారోగ్యంతో చనిపోయారు. కేంద్రం ఇచ్చే పింఛను నాకు వస్తుంది కానీ అది కూడా అంతంతమాత్రమే. నేను చదువుకున్న దానిని కాదు. ఏ సంపాదనా లేదు. మా కుటుంబాన్ని ఆదుకునేవారు కూడా ఎవ్వరూ లేరు. మేం ఏం చేయాలి? ఎలా బతకాలి? **-రాజ్‌కుమారి,** 65 ఏళ్ల

● **నవ్యడెస్క్, ఫోటోలు : జంపాల రాజేష్**

నవ జీవనగీతం

స్నేహాన్ని మించిన ఐశ్వర్యం ఏముంది!

ఏ స్నేహమైనా అది అంకురించిన తొలి క్షణాన, బీజం లాగే ఉంటుంది. అది మొలకెత్తుతుందా లేదా, ఒక మహావృక్షంగా ఎదుగుతుందా లేదా అన్నది మన మీదే ఆధారపడి ఉంటుంది. ఆకాశాన కనిపించిన ప్రతి మేఘమూ వర్షించనట్లే, లోకాన తారసపడిన ప్రతి స్నేహమూ ఆత్మీయతను కురిపించదు. అయితే, చాలా అరుదుగానే అయినా అక్కడో ఇక్కడో ఎదురయ్యే ఆ అపురూప మైత్రీబంధాన్ని మన జీవితమంతా నిలబెట్టుకోగలగాలి. సంపద అంటే- వాహనాలూ, భవంతులూ, వజ్ర, వైఢూర్యాలని కాదు. ప్రాణానికి ప్రాణమైన కనీసం ఓ నలుగురు స్నేహితుల్ని కలిగి ఉండడమే అసలు సిసలైన ఐశ్వర్యం. అలాంటి స్నేహంతోనే జీవన సాఫల్యం, జీవితానందం సిద్ధిస్తాయి. 1973 లో విడుదలైన 'నమక్ హరామ్' సినిమా కోసం స్నేహమే ప్రధానాంశంగా ఆనంద్ బక్షీ రాసిన ఈ గీతాన్ని ఆర్. డి. బర్మన్ స్వరపరిస్తే కిశోర్ కుమార్ ఎంతో మృదుమధురంగా గానం చేశారు

దియే జల్‌తే హైఁ - ఫూల్ ఖిల్‌తే హైఁ
బడీ ముష్కిల్ సే మగర్ - దునియా మే దోస్త్ మిల్‌తే హైఁ
(దీపాలు వెలుగుతాయి - పూలు వికసిస్తాయి కానీ,
ఎంతో కష్టంగా మాత్రమే లోకాన మిత్రులు దొరుకుతారు)

మంచి స్నేహితుడి కోసం, పనికట్టుకుని మనం ఎక్కడెక్కడో వెతుక్కుంటూ వెళ్లం కదా! అనుకోకుండా ఎప్పుడో ఎక్కడో అలాంటి ఒక స్నేహితుడు ఎదురుపడతాడు. కాకపోతే అలా ఎదురుపడిన వారిలో కొందరు తొలుత మిత్రులుగానే కనిపించి ఆ తర్వాత శత్రువులుగా బయటపడవచ్చు. తొలుత శత్రువుల్లానే అనిపించిన వాళ్లల్లో కొందరు ఆ తర్వాత ప్రాణమిత్రులుగా నిలిచిపోవచ్చు. నిజానికి, మన వ్యాపకాలు, మన వ్యవహారాలు- వీటితోనే మనకు సరిపోతుంది. ఈ ఉద్యోగ, వ్యాపారాల వ్యవహారాల్లో పడి అలా వెళుతుంటాం. మనం వెళ్లే ఆ దారి పొడవునా వేల దీపాలు వెలుగుతున్నా, వేలాది పూల తోరణాలు పరిమళాలు వెదజల్లుతున్నా చాలాసార్లు మనకు అవేమీ పట్టవు. కానీ, ఒక నిండుస్నేహానికి ప్రతిరూపంగా, హృదయంలో హృదయంగా ఒక్కరంటే ఒక్కరు ఎదురైనా మనసు పులకించిపోతుంది. ఆ స్నేహాన్ని జీవితపు భరిణెలో భద్రంగా దాచుకుంటుంది. కానీ, అలాంటి మిత్రుడు ఎదురుపడటం నిజంగా ఎంత అరుదైన విషయం!

***

పర్ జిస్ వక్త్ కిసీకా యార్ జుదా హోతా హై
కుచ్ నా పూఛో యారో దిల్ కా హాల్ బురా హోతా హై
దిల్ పే యాదోఁ కే జైసే తీర్ చల్‌తే హైఁ / దియే జల్‌తే హైఁ/
(ఎప్పుడైనా ఒకరి మిత్రుడు ఎడబాసిపోతే
ఇంకేమీ అడగొద్దు మిత్రులారా - ఆ హృదయ స్థితి దారుణంగా ఉంటుంది
హృదయం మీద జ్ఞాపకాల బాణాలు దిగినట్లే ఉంటుంది)

"బాల్య కౌమారమంతా క్షణం విడనాడకుండా జీవించాం. ఎక్కడి నుంచి వచ్చిందో ఈ యౌవనం, బాధ్యతా పర్వతాల్ని నెత్తినేసుకుని, ఒకళ్ల కన్నీళ్లు ఒకళ్లు తుడుచుకోకుండా చెల్లాచెదరైపోయాం" అంటాడో కవి. నిజమే కదా!

అత్యంత ఆప్తమిత్రులే కావచ్చు. జీవన పోరాటంలో పడి ఒక్కోసారి కొందరు జిల్లాలు, రాష్ట్రాలనే కాదు ఒక్కోసారి దేశాన్నే వదిలేసి వెళ్లిపోతారు. ఇదో రకం ఎడబాటైతే, అప్పుడప్పుడే విరబూస్తున్న స్నేహ వల్లరి మీద అపార్థాల కత్తులు పడి, అది తునాతునకలైపోతుంది. అయితే, ఒక్కోసారి అది అపార్థమే తప్ప అందులో వాస్తవం లేదని చెప్పే అవకాశం కూడా రాదు. ఫలితంగా, ఒకరి నుంచి ఒకరు విడిపోయి, జీవితంలో ఇంకెప్పుడూ కలుసుకోరేమో అన్నంత దూరంగా వెళ్లిపోతారు. అప్పుడింక ఆ పాత జ్ఞాపకాలన్నీ ఇరువురి హృదయాల మీద ఈటెల్లా దిగిపోతాయి. ఆ బాధను భరించడం నిజంగా ఎంత కష్టం!

***

ఇస్ రంగ్ రూప్ పే దేఖో - హర్‌గిజ్ నాజ్ నా కర్‌నా
జాన్ భీ మాంగే యార్ తో దేనా - నారాజ్ న కర్‌నా
రంగ్ ఉడ్‌జాతే హైఁ - రూప్ ఢల్‌తే హైఁ /దియే జల్‌తే హైఁ/
(చూడండి... ఈ రంగు రూపుల మీద - ఏమాత్రం మోహాన్ని పెంచుకోకండి. మిత్రుడు ప్రాణమే అడిగినా ఇచ్చేయండి అతని మనసును చిన్నబుచ్చకండి.
ఈ రంగులన్నీ ఎగిరిపోయేవే... ఈ రూపాలన్నీ వాడిపోయేవే)

నువ్వు నిర్మించుకున్న నీ స్వప్న సౌధం... ఎంత అపురూపం, ఎంత మనోహరమైనదైతే ఏమిటి? ఎంతగొప్ప రంగుల రాజ్యమైతేనేమిటి? వాటిని చూసుకుని ఎవరైనా పొంగిపోతే అర్థం లేదు. ఎందుకంటే, ఇవన్నీ భౌతికమైనవి... వీటి ఆయుష్షు ఎంత? ఈ సౌధాలు ఎప్పటికైనా కూలిపోయేవే. వీటి వర్ణాలు వెలిసిపోయేవే. అందువల్ల హృదయబంధమైన స్నేహం కోసం ఏదైనా చేయగలిగితే దాంతో చెదరని ఆనందం సిద్ధిస్తుంది. అవసరమైతే స్నేహం కోసం ప్రాణాలే ఇచ్చినా అందులో జీవితం ధన్యమవుతుంది.

ఆర్. డి. బర్మన్

***

దౌలత్ ఔర్ జవానీ - ఏక్ దిన్ ఖోజాతే హైఁ
సచ్ కహతా హూఁ సారీ దునియా - దుష్మన్ హో జాతీ హై
ఉమ్ర్ భర్ దోస్త్ లేకిన్ సాథ్ చల్‌తే హైఁ / దియే జల్‌తే హైఁ/
(ఈ ఐశ్వర్యం.. యౌవనం.. ఒకరోజున మాయమైపోతాయి
నిజమే చెబుతున్నా... లోకమంతా శత్రువైపోతుంది
మిత్రులు మాత్రమే... జీవితాంతం తోడై నడుస్తారు)

ఆత్రేయ అన్నట్లు చాలా మంది "అందమైన లోకమనీ... రంగు రంగులుంటాయనీ" అనుకుంటారు గానీ, లోకం అంత అందమైనదేమీ కాదనీ, ఈ రంగులూ, హంగులూ పైపైవేనని అనిపిస్తుంది. ఒక్కోసారి విషం చిమ్ముతూ, నిప్పులు కక్కుతూ లోకం ఎంత క్రూరంగా ప్రవర్తిస్తుందో చూసి మనసు దిగ్భ్రాంతికి గురవుతుంది. అప్పటి దాకా ఎంతో ఆప్యాయంగా కనిపించిన లోకమే హఠాత్తుగా నీ శత్రువైపోవడం చూసి హతాశుడివైపోతావు. ఇతరులే కాదు ఒక్కోసారి అయినవాళ్లు, సమీప బంధువులు, చివరికి రక్తసంబంధీకులు కూడా నీపై కత్తికడతారు. ఆ సమయంలో నువ్వు ఏ వైపు వెళ్లాలో, నిన్ను నువ్వు ఎలా కాపాడుకోవాలో తెలియక ఉక్కిరిబిక్కిరి అయిపోతుంటావు. నీ వ్యూహాలేవీ అప్పుడు పనిచేయవు. నీశక్తి ఎందుకూ కొరగాదు. సరిగ్గా ఆ స్థితిలో నీ అండగా నిలబడి, నిన్ను అక్కున చేర్చుకుని నిన్నూ, నీ జీవితాన్నీ నిలబెట్టేది. మైత్రీబంధమే. జీవితాంతపు ఆసరాగా, నీకో భరోసానిచ్చేది స్నేహహస్తమే!

• **బమ్మెర**

గరికతో ప్రసన్నం

నివేదన

ఒకసారి యమలోకంలో పెద్ద ఉత్సవం జరుగుతోంది. ఆ ఉత్సవంలో నాట్యకత్తెలు నృత్యం చేస్తున్నారు. అందులో తిలోత్తమ నాట్యం చేస్తుండగా చూసి యముడు ఆమెను మోహించాడు. అందుకు పర్యవసానంగా అనిలాసురుడు అనే భయంకరమైన రాక్షసుడు జన్మించాడు. అనిలాసురుడు ఎక్కడికెళ్లినా అగ్ని ఉద్భవించి అంతా భస్మీపటలం అయ్యేది. అటువంటి భయంకరమైన రాక్షసుడు దేవతలపై దండెత్తుతాడు. అప్పుడు దేవతలు భయకంపితులై గణపతిని ప్రార్థిస్తారు. దేవతల ప్రార్థనలు విన్న వినాయకుడు బాలగణేశుని రూపంలో ప్రత్యక్షమై అనిలాసురుణ్ణి సంహరిస్తానని మాటిస్తాడు. ఆ మాటలు విన్న దేవతలు సంతోషిస్తారు. అదే సమయంలో నలుదిశలు భస్మం చేస్తూ అనిలాసురుడు అక్కడికి వచ్చాడు. ఆ రాక్షసుణ్ణి చూసి దేవగణమంతా తలోదిక్కూ పారిపోయారు. బాలగణేశుడు మాత్రం అక్కడే నిలుచుని ఉన్నాడు. అదిచూసి అనిలాసురుడు బాలగణేషున్ని మింగేయాలని ముందుకు వచ్చాడు. కానీ బాలగజాననుడే పర్వతమంత ఎత్తు ఎదిగి అనిలాసురుణ్ణి మింగేశాడు. సాక్షాత్తు అగ్నిస్వరూపుడైన అనిలాసురుణ్ణి మింగిన కారణంగా గణేశునికి ఒళ్లంతా మంట పుట్టింది. ఆ మంటను భరించలేక గణేశుడు నేల మీద పడి దొర్లసాగాడు. గణేశుని బాధ చూసి దేవతలంతా అక్కడకు వచ్చారు. గణేశుని బాధను తగ్గించడానికి రకరకాల ఉపాయాలు ఆలోచించారు. ఇంద్రుడు గణేశుని తలమీద అమృతమయమైన చంద్రుణ్ణి ఉంచాడు. బ్రహ్మదేవుడు సిద్ధి, బుద్ధి అనే ఇద్దరు కన్యలను రప్పించాడు. విష్ణుమూర్తి తన చేతిలోని చల్లటి కమలం ఇచ్చాడు. వరుణుడు చల్లటి వర్షం కురిపించాడు. శివుడు తన సర్పాన్ని గణేశుడి ఉదరానికి చుట్టాడు. ఇవన్నీ చేసినా మంటలు చల్లారలేదు. అప్పుడు 88వేల మంది మునులు ప్రతి ఒక్కరు 21 పచ్చటి గరికలు గజాననుడి శిరస్సుపై ఉంచారు. అప్పుడు గణేశుని దేహం చల్లారి శాంతి పొందింది. గణేశుడు ప్రసన్నుడై ఇలా సెలవిచ్చాడు. 'ఈ రోజు నుంచి నాకు గరికలు సమర్పించే వారికి కొన్ని వేల యజ్ఞాలు, వ్రతాలు, దానాలు, తీర్థయాత్రలు చేసిన పుణ్యఫలం లభిస్తుంది' అన్నాడు.



మీకు మీరే డాక్టర్

భలే కరక్కాయ

◗ కరక్కాయ చూర్ణానికి సమానంగా, పాతబెల్లం కలిపి ముద్దగా దంచి ప్రతి దినము ఒక స్పూను సేవిస్తూ ఉంటే, రక్తమొలలు, అజీర్తితో పాటు, గౌట్ సమస్యలూ తగ్గుతాయి.

◗ రాత్రి భోజనం తర్వాత అరస్పూను కరక్కాయ చూర్ణం వేసుకుంటే, మలబద్ధకం సమస్య తొలగిపోతుంది.

◗ కరక్కాయ చూర్ణానికి సమానంగా ఎండు ద్రాక్షను కలిపి దంచి ముద్దగా చేసి, రోజూ ఉదయాన్నే ఉసిరికాయ పరిమాణంలో తింటూ ఉంటే, కడుపులో మంట, పులితేన్పులు, కడుపు ఉబ్బరం తగ్గుతాయి.

◗ కరక్కాయ చూర్ణానికి సమానంగా ఆముదం కలిపి లేహ్యంగా చేసి దాన్ని ప్రతి ఉదయం, రాత్రి పడుకునే ముందు ఒక స్పూను మోతాదులో తీసుకుంటే వాపుతో వచ్చే కీళ్లనొప్పులు సయాటికా సమస్యలతో పాటు, హెర్నియా కూడా తగ్గుతుంది.

◗ కర క్కాయ చూర్ణానికి సమానంగా పిప్పళి చూర్ణం లేదా శొంఠి చూర్ణం కలిపి, అందులో తేనెలో కూడా కలిపి లేహ్యంగా చేసుకోవాలి. ఈ లేహ్యాన్ని ముద్దగా దంచి ప్రతి దినము అర స్పూను చొప్పున చప్పరిస్తూ ఉంటే, బొంగురు గొంతుతో పాటు నస కూడా తగ్గుతాయి.

◗ కరక్కాయ చూర్ణానికి పచ్చిగడ్డి కలిపి, మెత్తగా నూరి పైపూతగా వాడితే కాలిన గాయాలు, చీము పట్టిన పుండ్లు మానిపోతాయి.

◗ కరక్కాయ చూర్ణాన్ని గోమూత్రంలో వేసి మరగించి, అందులో కొంచెం ఆముదం కలిపి, ప్రతి ఉదయం, పరగడుపున తీసుకుంటే వరిబీజం తగ్గుతుంది.

◗ కరక్కాయ గింజలు నూరి నుదుటిపై పట్టిస్తే, మైగ్రేన్ తగ్గుతుంది.

పేరెంటచ్

ఆ ముభావం వెనుక ఏ కారణమో..!

స్కూల్ మేట్స్‌లోనూ కాలేజ్‌మేట్స్‌లోనూ కొందరు ఎప్పుడూ ముభావంగా ఉండడాన్ని వాళ్ల తోటి మిత్రులుగా పిల్లలు గమనిస్తూనే ఉంటారు. అయితే కొందరు అలాంటి వాళ్లకు పొగరెక్కువనీ, ఎవరితోనూ మాట్లాడరనీ అనుకుంటారు. ఒకవేళ వాళ్లు సంపన్నుల పిల్లలైతే, వాళ్లకి ధనవంతులమని గర్వం. అందుకే అందరికీ దూరదూరంగా ఉంటారని కూడా అనుకుంటారు. అయితే, ఒక్కోసారి వాస్తవాలు అందుకు భిన్నంగా ఉంటాయి. స్వభావరీత్యా ముభావంగా ఉండేవాళ్లూ ఉండవచ్చు. కానీ, కొందరి జీవితాల్లోని చేదు కూడా కొందరిని అలా మార్చివేస్తుంది. ముఖ్యంగా పసితనంలోనే తల్లినో, తండ్రినో లేదా ఇద్దరినీ కోల్పోవడం వంటి నేపథ్యం ఉన్న వాళ్లల్లో ఇలాంటి మనస్తత్వం కనిపిస్తుంది. ఇలాంటి మరేవైనా సంఘటనలైనా వాళ్ల జీవితాల్లో ఉండవచ్చు. ఇవన్నీ, పేదవాళ్లా, సంపన్నులా అనే విషయంతో సంబంధం లేకుండా వాళ్లు ముభావంగా మారడానికి కారణమవుతాయి. ఆ నేపథ్యమేమీ తెలుసుకోకుండా, వాళ్లను అహంభావులో, గర్విష్ఠులో అనుకుంటే అది ఎంత పెద్ద తప్పిదం? అందుకే అలాంటి పిల్లల పట్ల ముందే ఒక నెగెటివ్ అభిప్రాయం ఏర్పరుచుకోకుండా ఉండేలా పిల్లల్ని తయారు చేయాలి. అయితే, అలాంటి ఒక చేదు సంఘటన ఉందని తెలుసుకున్నంత మాత్రాన్నే అంతా అయిపోదు. అప్పుడో, ఇప్పుడో, ఇంటికి ఆహ్వానించి, తలిదండ్రులకు పరిచయం చేయడం, ఆ పరిచయం ఒక గాఢానుబంధంగా మారేలా పదేపదే ఇంటికి తీసుకువచ్చేలా వాళ్లను మలచాలి. మిగతా సందర్భాల్లోనే కాకుండా, పండగల సందర్భాల్లోనూ తప్పకుండా ఇంటికి తీసుకు రావడం ఒక ఆనవాయితీగా పెట్టుకోవాలి. ఇవన్నీ తమ మిత్రుల, తల్లిలేని లేదా తండ్రి ఆ ఆత్మీయతా కొరతను ఎంతో కొంత తీర్చగలుగుతాయి. తలిదండ్రులు లేని ఆ లోటు విషయమే కాదు. ఆ తరువాయి జీవితంలో మనస్తాపాన్ని కలిగించే మరేదైనా సంఘటన జరిగినప్పుడు కూడా ఎంతో ఓదార్పునిస్తాయి. అలా బాధాతప్త హృదయుల్ని ఇంటికి తీసుకువచ్చే సంస్కారాన్ని తలిదండ్రులు పిల్లలకు నేర్పాలి. అది కేవలం క్లాస్ మేట్‌ల విషయంలోనే కాదు మునుముందు జీవితంలోని తన సహచరులు, సాటి మనుషులందరి విషయంలోనూ ఇలాగే స్పందించే గుణం వాళ్లలో పెంపొందుతుంది.

స్మార్ట్‌హోమ్

వుడ్‌వర్క్‌తో కొత్తలుక్!

◗ ఇంటీరియర్ డెకరేషన్ ఆకర్షణీయంగా ఉండాలని కోరుకునే వారు వుడ్‌వర్క్‌ని ఎంచుకోవచ్చు. అయితే ఏ డిజైన్‌ను ఎంపిక చేసుకోవాలనేది మీ అభిరుచిపై ఆధారపడి ఉంటుంది.



◗ ప్లైవుడ్ లామినేటెడ్, వెన్నేర్‌లో అనేక రకాల డిజైన్లు, కలర్ కాంబినేషన్‌లు ఉన్నాయి. ఇంకా ఆకర్షణీయంగా కనిపించాలని కోరుకునే వారు డ్యుకో పెయింట్స్ వేసుకోవచ్చు. నీళ్లు పడితే దెబ్బతినకుండా ఉండాలని కోరుకునే వారు వాటర్ ప్రూఫ్ మెటీరియల్‌ను ఎంచుకోవచ్చు.

◗ లివింగ్‌రూమ్‌లో ఈ డెకరేషన్ వల్ల ఇంటి అందమే మారిపోతుంది. షెల్ఫ్‌ల చుట్టూ ఫ్రేమ్స్ కట్టించుకుని, గ్లాస్ విండోస్ ఏర్పాటు చేసుకుని షీల్డ్‌లు, అలంకరణ బొమ్మలు, ఫొటోలు అమర్చుకోవచ్చు. టీవీ, డివిడి ప్లేయర్ వంటి వాటిని అమర్చుకోవడానికి కూడా ప్రత్యేకంగా వుడ్‌వర్క్ చేయించుకోవచ్చు.

◗ పడకగదిలో ప్రధానంగా వార్డ్‌రోబ్‌లు బట్టలు సర్దుకోవడానికి ఉపయోగపడతాయి. కిచెన్‌లో వుడ్‌వర్క్ చేయించుకుంటే వంటసామగ్రిని నీట్‌గా అమర్చుకోవచ్చు.

సింగర్స్ స్పెషల్

అమ్మ కోరిక.. అక్క స్ఫూర్తి.. నా ప్యాషన్

సాహితీ చాగంటి

'సరిలేరు నీకెవ్వరూ...' 'కంచుకోట'లోని ఈ పాట ఎంత పెద్ద హిట్ అయిందో.. 'సరిగమప లిటిల్ చాంప్స్'లో పాడిన సాహితీ అంతే హిట్ అయింది. సభికులు తన్మయత్వం పొందుతూ ఒక్కసారిగా లేచి నిలుచుని కరతాళధ్వనులు వినిపించారు. ఎనిమిదేళ్ల ప్రాయంలో ఆమె పాడిన పాటకు సభా ప్రాంగణం చప్పట్లతో మారుమోగింది. ఆ అభినందనల హోరు అంతటితో ఆగిపోలేదు. పాడిన ప్రతిపాట వెనుకా ప్రశంసల రూపంలో పరిగెత్తుతూనే ఉంది. నిన్నటి 'నేతచీర..' (కాటమరాయుడు), తాజాగా 'ఇట్స్ మై లగ్గం టైమ్' (లై) పాటలూ అందుకు మినహాయింపు కాదు.. టీవీ షోల నుంచి సినిమా ప్లేబ్యాక్ వరకు సాహితీ చాగంటి స్వరసాన్నిహిత్యం.. ఈవారం ప్రత్యేకం.

నేను పుట్టింది కాకినాడ. నాన్న చాగంటి రవి ప్రసాద్, ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. అమ్మ సీత గృహిణి. విల్లామేరీ కాలేజ్‌లో బి.ఏ మాస్ కమ్యూనికేషన్స్ చదువుతున్నా. అమ్మకు సంగీతం అంటే ప్రాణం. అప్పట్లో అమ్మాయిల పట్ల ఉండే ఆంక్షల దృష్ట్యా అమ్మ సంగీతం నేర్చుకోలేకపోయింది. ఆ కోరికతోనే, అమ్మకు వచ్చిన పాటలు నాకు నేర్పుతుండేది. స్వతహాగా నేను కూడా ఆసక్తి చూపడంతో అమ్మ ఆనందానికి అవధుల్లేవు.

అక్క కూడా కారణం...

మా కజిన్ సిస్టర్ హరిణి కూడా సింగరే. తను నాకన్నా రెండేళ్ల ముందే సంగీతం నేర్చుకుంది. మా స్కూల్లో ఏ కార్యక్రమం జరిగినా అక్క పాడటం, అందరూ అభినందించడం, బోలెడన్ని బహుమతులు రావడం... నాలో ఆసక్తిని రెట్టింపు చేశాయి. గెలిచిన ప్రతి సారీ అందరూ అక్కని ముద్దు చేస్తుంటే జెలసీతో (నవ్వుతూ) 'నేను కూడా పాడాలి.. బహుమతులు తెచ్చుకోవాలి' అన్న తపన నాలో మొదలైంది. అందుకే నాకు అక్కే స్ఫూర్తి అంటాను.

నాంది.. 'బద్రినాథ్'తో!

అలకనంద్, ఎన్.సి.మూర్తిగారి దగ్గర సంగీతంలో ప్రాథమిక మెలకువలు తెలుసుకున్నా. ఆ తర్వాత రామాచారిగారి దగ్గర లలిత సంగీతం, శ్రీనిధిగారి దగ్గర కర్ణాటిక్ సంగీతం నేర్చుకున్నా. 'పాడుతాతీయగా', 'పాడాలనివుంది', 'సరిగమప లిటిల్ చాంప్స్', 'బోల్ బేబీ బోల్', 'జోడీ నం.1' వంటి షోలలో పాల్గొనడం వల్ల నా ప్రతిభకు మెరుగులు దిద్దినట్టయింది. 'సరిగమప'లో మెంటర్‌గా కూడా కూర్చొన్నా. ఆ షోతోనే నేను పాపులర్ అయ్యా. ఆ క్రమంలోనే 'బద్రినాథ్'లో ఓ శ్లోకం పాడా. అది సంగీతవర్గాల్లో బాగా రిజిస్టర్ అయింది.

గ్రేట్ సపోర్ట్!

ఓ వైపు టీవీ షోలు చేస్తూనే, మరోవైపు సినిమా ట్రయల్స్ మొదలుపెట్టా. ఓ సారి నా డెమోస్ చూసి రవివర్మగారు 'రెడ్ ఎలర్ట్'లో, జీవన్‌బాబుగారు 'రైట్ రైట్'లో అవకాశమిచ్చారు. ఓ వైపు నేరుగా పాడుతూనే, మరోవైపు కోరస్ కూడా పాడసాగా. అలా అనుకోకుండా అనూప్‌గారి దగ్గరకు వెళ్తే ఆయనకు వాయిస్ నచ్చి 'ఆటాడుకుందాం రా'లో టైటిల్ సాంగ్ పాడమన్నారు. అప్పటి నుంచీ ఆయన స్టూడియోలో నేను రెగ్యులర్ సింగర్‌ని. మణిశర్మగారు కూడా నా డెమో విని 'ఫ్యాషన్ డిజైనర్'లో పాడించారు. అందులోని 'మేఘాలే తేలిన' పాట శ్రోతలకు బాగా చేరువైంది. ఆయన సంగీతంలో ఇప్పటిదాకా ఏడు పాటలు పాడా. ఐదారు సినిమాలు రిలీజ్‌కి రెడీగా ఉన్నాయి. 'మణిగారు స్ట్రిక్ట్ కదా.. ఎలా తట్టుకుంటున్నావ్' అని చాలా మంది ఆరాతీస్తున్నారు. నేనూ మొదట భయంతోనే ఆయన స్టూడియోకి వెళ్లా. కానీ గాయనీగాయకులు స్వేచ్ఛగా పాడాలని ఆయన కోరుకుంటారని అర్థమైంది. అప్పటినుంచీ ఆయన దగ్గర సంగీతంలో చాలా విషయాలు నేర్చుకున్నా. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ స్టూడియోలో గాత్రం సవరించినవారు ఎక్కడైనా పాడేయగలరు. ఈ మాట ఎందుకు చెప్పానంటే సింగర్‌ను కూర్చోపెట్టి తన పాటకు ఎలాంటి ఎక్స్‌ప్రెషన్స్ కావాలో నేర్పించడంలో ఆయన సిద్ధహస్తుడు. నేను మరిన్ని టేకులు తీసుకున్నప్పుడు మాత్రం 'నీకేదో దెయ్యం పట్టింది పొట్టెక్కా..' అని అంటారు. అంతకు మించి కోప్పడటం ఆయనకు తెలీదు.

పవన్‌కల్యాణ్ అభిమానిని

మ్యూజిక్ డైరక్టర్లు చాలా వరకు ముందు ట్రాక్‌లే పాడిస్తారు. ఆ పాటలు సినిమాలో తప్పక ఉంటాయని సింగర్లు అనుకోనవసరం లేదు. కాకపోతే అలా పాడించిన ట్రాక్‌లనే ఫైనల్ చేయించడానికి కొంతమంది పాటుపడతారు. అలాంటివారిలో మణిగారు, అనూప్‌గారూ ముందువరసలో ఉంటారు. స్థానిక గాయనీగాయకులకు వీళ్లిచ్చే విలువ చాలా గొప్పది. 'కాటమరాయుడు'లో 'నేతచీర' పాటకు ముందు ట్రాక్ పాడా. చివరికి అనూప్‌గారు నా వాయిస్ ఫైనల్ చేశారు. పవన్‌కల్యాణ్‌గారికి పెద్ద అభిమానిని కాబట్టి ఆ పాటను ట్రాక్‌లెవల్‌లోనే చాలా బాగా పాడా. ఆల్బమ్‌లో ఉండాలని గట్టిగా కోరుకున్నా. సంకల్పబలం సిద్ధించింది. ఆడియో రిలీజ్‌కి రెండు రోజుల ముందు అనూప్‌గారు ఫోన్ చేసి 'నీ పాట ఓకే అయింది' అన్నారు. ఆ క్షణం మాటల్ని, పాటల్ని దాటిన అనిర్వచనీయమైన అనుభూతినిచ్చింది.

గుర్తింపు తెచ్చిన పాటలు

ఇట్స్ మై లగ్గమ్ టైమ్(లై)
నేత చీర (కాటమరాయుడు)
బేబీ డాల్(హైపర్)
మేఘాలే తేలిన (ఫ్యాషన్ డిజైనర్)
అయ్య బాబోయ్(అమీతుమీ)
ఆటాడుకుందాం రా(టైటిల్ సాంగ్).

కాంపిటిషన్ ఎక్కువే...

ఒకప్పుడు అవకాశాలు, సింగర్లు కూడా తక్కువ. కానీ ఆ రెండిటితో పాటు ఇప్పుడు స్వరాలు నేర్పే గురువులు, అభ్యసించే అభ్యర్థులు, తదనంతరం మధ్య పోటీ కూడా ఎక్కువే. సంగీతంలో శిక్షణ పొందాలనుకునేవారికి రెహమాన్, శంకర్ మహదేవన్‌గారి ఇన్‌స్టిట్యూట్‌ల ద్వారా ఆన్‌లైన్ క్లాసులు అందుబాటులో ఉన్నాయి. ప్రతిభను నిరూపించుకోవడానికి టాలెంట్ షోలు మంచి వేదికలు అవుతున్నాయి. సింగింగ్ ఒకటే కెరీర్ అనుకుంటే ఈ ఈ పోటీ ప్రపంచంలో కొంచెం కష్టమే. టీవీ షోలు, కన్సర్ట్స్ ఉన్నాయి కాబట్టి కాస్త తేలిగ్గా అక్కడా అవకాశాలను అందుకోవచ్చు. నేనుకూడా విదేశాల్లో కాన్సెర్ట్స్‌కు బాలుగారు, అనూప్‌గారితో వెళ్లా.

• **ఆలపాటి మధు,** ఫొటో: గోపి

1. అవకాశాలు ఎప్పుడూ ఉండాలనేం లేదు. అందుకే బి.ఏ మాస్ కమ్యూనికేషన్స్ చేస్తున్నా. ఏదోలా మీడియా రిలేటెడ్ వర్క్‌లోనే ఉండాలనుకుంటున్నా. యాంకరింగ్, డబ్బింగ్ అలవాటుంది. ప్రస్తుతం చదువునీ, వృత్తిని బ్యాలెన్స్ చేస్తున్నా. పని మీద ఏకాగ్రత, అంకితభావం ఉండటం నాలో పాజిటివ్ పాయింట్స్. ప్రతిభ, స్టూడియో నుంచీ కాల్ వస్తే అందుబాటులో ఉండటంతోపాటు అదృష్టం కూడా కలిసొచ్చిందని నా నమ్మకం.

2. పోటీలు నిర్వహించే ప్రతి చోటుకి తీసుకెళ్లి అమ్మ ఏదొక పాట పాడించేది. అప్పటి నుంచీ ఇప్పటి వరకూ అమ్మనాన్నల సపోర్ట్ ఒకేలా ఉంది. నేను అనుకున్న గోల్స్‌తోపాటు అమ్మ ఆశ కూడా నెరవేర్చే ప్రయత్నంలో ఉన్నా. సింగర్‌గా అమ్మ కోరిక కొంతవరకూ తీర్చినట్లే. కానీ సాధించాల్సింది చాలా ఉంది.

3. రెహమాన్, ఇమాన్, హ్యారీస్‌జైరాజ్ నాకు బాగా నచ్చిన సంగీత దర్శకులు. 'నేను కలవాలి, వర్క్ చెయ్యాలి' అనుకునే వాళ్లలో ముందు వరసలో ఉండేది వీళ్లే.

4. 'సరిగమప లిటిల్ చాంప్స్' ఫైనల్స్‌లో నేను పాడిన ఓ పాటకు 'నీ పెర్‌ఫెక్షన్ చూస్తుంటే ఫ్యూచర్ సింగర్ కనిపిస్తుంది' అని జయనా రాణీగారు, వాణీ జయరాంగారు అన్నారు. ఇంకో ఎపిసోడ్‌లో 'సరిలేరు నీకెవ్వరూ'(కంచుకోట) పాట పాడితే కోటిగారు, ఆయనతో ఉన్న జడ్జ్‌లు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు.

5. రికార్డింగ్ స్టూడియోలో బిట్ బిట్‌లుగా పాడే అవకాశం ఉంటుంది. లైవ్ షోల్లో అలాంటి అవకాశం ఉండదు. షోలు చెయ్యడం వల్ల లైవ్ సింగింగ్ అలవాటు అవుతుంది. అది సింగర్‌కి చాలా ఉపయోగపడుతుంది.

6. ఆల్‌ఇండియా మ్యూజిక్ పోటీల్లో భాగంగా 'నవ్యనాటక సమితి' వారు ఏర్పాటు చేసే పోటీల్లో మొదటి బహుమతి తెచ్చుకోవాలన్నది అమ్మ కోరిక. సంగీతంలో పండినవాళ్లే అక్కడ విజయం సాధించగలరు. నేను ఆ పోటీల్లో పాల్గొని సెకెండ్, థర్డ్ ప్రైజ్‌లు తెచ్చుకున్నా. ఫస్ట్ ప్రైజ్ కోసం సాధన చేస్తున్నా.

7. కీరవాణిగారి దగ్గర కోరస్ పాడాను కానీ 'బాహుబలి' లాంటి సినిమాలో పాడలేకపోయాననే అన్న బాధ కాస్త ఉంది. నాకే కాదు.. నాలాంటి చాలా మంది సింగర్‌లకు ఉంది. అంతేగానీ.. ఫలాన సింగర్ పాడిందనే జెలసీ మాత్రం ఉండదు. ఈ జనరేషన్ సింగర్స్ ఆ ఆలోచనకే దూరంగా ఉంటారు. మా మధ్య హెల్దీ కాంపిటిషన్ మాత్రమే ఉంది. పాటలు ఎంత హిట్ అయినా సింగర్స్‌కి సరైన గుర్తింపు దక్కడం లేదని నా అభిప్రాయం. బయటి షోల వల్లే మేం ఎవరనేది జనాలకు తెలుస్తోందన్నది వాస్తవం.

న్యాయ సలహా

కౌలుకు తీసుకుంటే సొంతమైపోతుందా?

మేము మా ఏడెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు ఇచ్చాం. అతడు కౌలు చేస్తూనే మేము మా భూమిని అతనికి విక్రయించినట్టు నకిలీ పత్రాలు సృష్టించాడు. సంతకం ఫోర్జరీ చేశాడు. ఆ పత్రాల మీద తన మేనల్లుడితో సాక్షి సంతకం చేయించాడు. ఆ కాగితమే ఆధారంగా మండల రెవెన్యూ అధికారికి పట్టా, పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వమని దరఖాస్తు చేసుకున్నాడు. అవినీతికి పాల్పడిన ఎంఆర్‌ఓ ఇతని పేర పట్టా, పట్టాదారు పాస్‌బుక్, టైటిల్ డీడ్ ఇచ్చేశాడు. ఇప్పుడు ఆ పట్టాను, పాసు పుస్తకాలను రద్దుపరచాలంటే, చట్టపరంగా ఏం చేయొచ్చు? మా భూమిని స్వాధీనం చేసుకోవాలంటే ఏం చేయాలి?

- ఎన్. సత్యనారాయణ, నిజామాబాద్

మీకున్న ఏడెకరాల వ్యవసాయి భూమిని కౌలుకు ఇచ్చే సమయంలో లిఖిత పూర్వక అగ్రిమెంటు రాసుకున్నారా? లేక మాట్లాడుకుని ఇచ్చారా అన్న వివరాలేవీ మీ ఉత్తరంలో పేర్కొనలేదు. ఏమైనా మీకున్న ఏడెకరాల భూమికి మీరే యజమానులు. కౌలుకు తీసుకున్న వ్యక్తి తెల్లకాగితం మీద అగ్రిమెంటును సృష్టించినంత మాత్రాన, ఆ భూమి మీద మీకున్న చట్టపరమైన యాజమాన్యపు హక్కులు అతనికి సంక్రమించవు. ఏదైనా స్థిరాస్తి 100 రూపాయలకు మించి విలువ ఉంటే అట్టి స్థిరాస్తిని స్టాంపు పేపరు పై రాసుకుని రిజిస్టర్ చేయించుకుంటే తప్ప అవతలి వ్యక్తికి యాజమాన్యపు హక్కులు సంక్రమించవు. మీ విషయంలో అతడు విక్రయ అగ్రిమెంట్ సృష్టించి, తన మేనల్లుడి సంతకం సాక్ష్యంగా తీసుకున్నాడన్నారు. అలా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై, తన పేరును రెవెన్యూ రికార్డుల్లో పట్టాదారుగా, కబ్జాదారుగా రాయించుకుని, పట్టా పాస్‌బుక్కులు, టైటిల్ డీడ్‌లు పొందినంత మాత్రాన, ఆ భూమిపై మీకున్న చట్టపరమైన హక్కులు హరించుకుపోవు. ఒకవేళ ఎంఆర్‌ఓ చేసిన ఆ ఎంట్రీని మీరు తప్పుగా భావిస్తే, ఆ ఎంట్రీ జరిగి ఇప్పటికి ఒక సంవత్సరం అయితే వెంటనే ఆ అధికారిని సంప్రదించి జరిగిన విషయం చెప్పండి. కౌలుకు తీసుకున్నతడ్ని ఖాళీ చేసి, భూమిని అప్పగించమని కోరుతూ నోటీసు పంపండి. నోటీసు ఇచ్చిన తరువాత కూడా ఆ భూమిని ఖాళీ చేయకపోతే, మీ భూమి ఏ సివిల్ కోర్టు న్యాయస్థానం పరిధిలో ఉందో ఆ న్యాయస్థానంలో డిక్లరేషన్, పొజిషన్ కోసం కేసు వేయండి. లేదా రెవెన్యూ డివిజనల్ అధికారికి అప్పీల్ చేసుకోండి. నిజానికి ఒక వ్యక్తి పేరును రెవెన్యూ రికార్డుల్లోంచి తొలగిస్తున్నప్పుడు, సదరు వ్యక్తికి ఆ విషయాన్ని ముందుగా తెలియపరచాలనే చట్టం ఉంది. మీ పేరు తొలగిస్తూ, కౌలుదారు పేరును, రెవెన్యూ రికార్డుల్లో చేరుస్తున్నప్పుడు రెవెన్యూ అధికారులు మీకు విధిగా నోటీసు ఇవ్వాలి. అలా మీకు నోటీసు ఇవ్వకుండా పేర్లను నమోదు చేస్తే రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే న్యాయం జరుగుతుంది.

- టి ఎల్. నయన్‌కుమార్, న్యాయవాది

అజయ్ ఆంద్రూస్, మనోజ్, లక్ష్మీ మంచు

స్వేచ్ఛ కోసం యుద్ధం!

మంచు మనోజ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఒక్కడు మిగిలాడు'. అనీషా అంబ్రోస్ నాయిక. అజయ్ ఆంద్రూస్ నూతక్కి దర్శకుడు. ఎస్.ఎన్. రెడ్డి, లక్ష్మీకాంత్ నిర్మాతలు. ఇటీవల ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో మంచు లక్ష్మీప్రసన్న ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "స్వేచ్ఛ కోసం ఓ యువకుడు చేసే పోరాటమే ఈ సినిమా. విద్యార్థి నాయకుడిగా, ఉద్యమనేతగా మనోజ్ కనిపిస్తాడు" అని తెలిపారు. మనోజ్ మాట్లాడుతూ "నాపై నమ్మకంతో రెండు పాత్రలు చేయించారు దర్శకుడు. 1980 నాటి వాతావరణాన్ని, ఇప్పటి పరిస్థితుల్ని ప్రతిబింబించేలా సన్నివేశాల్ని తీర్చిదిద్దిన విధానం నచ్చింది" అని అన్నారు "మనోజ్ వాస్తవానికి దగ్గరగా ఉండే కథల్నే ఎంచుకుంటాడు. ట్రైలర్ నాకు బాగా నచ్చింది" అని మంచు లక్ష్మి అన్నారు. వచ్చే నెల 8న సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

ప్రగ్యా జైస్వాల్

ఊహించనే లేదు..!

"కొన్నిసార్లు మన గురించి మనం ఆలోచించుకుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. నా మటుకు నా కెరీర్ విషయం గుర్తొచ్చినప్పుడల్లా ఆనందంతో పాటు ఆశ్చర్యం కూడా కలుగుతుంది" అని అంటున్నారు ప్రగ్యా జైస్వాల్. 'కంచె' చిత్రంలో రాచకొండ సీతాదేవిగా ముసిముసిగా నవ్వుతూ, నిండైన ఆత్మవిశ్వాసంతో కనువిందు చేసినా.. ఇటీవల 'నక్షత్రం'లో కురచ దుస్తులతో కనిపిస్తూనే యాక్షన్ చేసినా ఆమెకే చెల్లింది. సినిమా కెరీర్ గురించి ప్రగ్యా జైస్వాల్ మాట్లాడుతూ " మా దూరపు చుట్టాలు సినిమా పరిశ్రమలో ఉన్నప్పటికీ ఈ రంగంలోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ తీరా వచ్చాక మాత్రం ఎక్కడా తడబడలేదు. అందుకు నాకు మరింతగా దోహదపడింది చదువుకునే సమయంలో నేను పాల్గొన్న ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీసే. స్కూల్లోనూ, కాలేజీలోనూ చాలా స్టేజ్ షోలు చేశాను. ఆ అనుభవంతో కెమెరా ముందు రాణించగలుగుతున్నాను" అని చెప్పారు.

చక్రపాణి పాత్రలో...

ప్రకాశ్‌రాజ్

సావిత్రి జీవితం ఆధారంగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'మహానటి'. టైటిల్ రోల్‌ను కీర్తి సురేశ్ పోషిస్తోన్న ఈ చిత్రంలో సమంత ఓ కీలక పాత్ర చేస్తుండగా, జెమినీ గణేశన్ పాత్రను మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా సెట్స్‌పై ప్రకాశ్‌రాజ్ అడుగుపెట్టారు. విజయా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పలు చిత్రాలు నిర్మించిన నాగిరెడ్డి-చక్రపాణి ద్వయంలో ఒకరైన చక్రపాణి పాత్రను ఆయన చేస్తున్నారు! రచయితగా లబ్ధప్రతిష్ఠుడైన చక్రపాణికి ముక్కుసూటి మనిషిగా పేరుంది. అశ్వినీదత్ సమర్పిస్తోన్న 'మహానటి'ని స్వప్న సినిమా పతాకంపై స్వప్నాదత్ నిర్మిస్తున్నారు.

'సాహో'లో జాకీ

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తోన్న చిత్రం 'సాహో'. సుజిత్ దర్శకత్వం వహిస్తుండగా, నాయికగా బాలీవుడ్ తార శ్రద్ధా కపూర్ నటిస్తోంది. తాజాగా మరో బాలీవుడ్ నటుడు ఈ చిత్రంలో భాగం కానున్నారు. ఆయన జాకీ‌ష్రాఫ్. ఆయనతో కలిపి 'సాహో'లో ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న బాలీవుడ్ నటుల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే నీల్‌నితిన్ ముఖేశ్, చుంకీ పాండే ఇందులో నటిస్తోన్న విషయం తెలిసిందే. "ప్రభాస్‌తో కలిసి 'సాహో' సినిమా చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ప్రస్తుతం దేశంలోని అగ్ర నటుల్లో ఆయన ఒకరు. నాకు ఆఫర్ చేసిన పాత్రకు నేను సరిగ్గా న్యాయం చేయగలుగుతానని ఆయన నమ్మినందుకు హ్యాపీ. రెండు 'బాహుబలి' చిత్రాల్నీ చూశాను. బాగా నచ్చాయి" అని జాకీ చెప్పారు.

అందమైన ప్రేమకథ!

శింబు, నయనతార

"మా లవ్ బ్రేకప్ అయ్యాక నేను, నయనతార కలిసి నటించిన 'ఇదు నమ్మ ఆళు' చిత్రానికి తమిళంలో మంచి ఆదరణ లభించింది. తెలుగులో 'సరసుడు' పేరుతో విడుదల చేస్తున్నాం. అందమైన, అద్భుతమైన ప్రేమకథా చిత్రమిది" అని శింబు తెలిపారు. ఆయన హీరోగా నటించిన 'సరసుడు' సెప్టెంబర్ 8న విడుదల కానుంది. టి.రాజేందర్ సమర్పణలో శింబు సినీ ఆర్ట్స్, జేసన్ రాజ్ ఫిలిమ్స్ పతాకంపై పాండిరాజ్ దర్శకత్వంలో తెలుగు, తమిళంలో ఈ చిత్రం తెరకెక్కింది. శింబు సోదరుడు కురళరసన్ సంగీతాన్ని అందించారు.

Scholarship Alert

Tata Trust Fellowships 2017

Category: National
Description: Tata Trusts is inviting applications from individuals for research grants offered in the study related to Autism, Dyslexia and Public Healthof all age groups for the duration of six months to two years. **Eligibility:** Candidates going for study in Autism and Dyslexia must be Master's in Psychology, Education or Counselling, and for Public Health, applicant must be Master's or Ph.D. degree holder in Public Health or community- based medicine- MMBS, MS or MD.Junior fellowship holder must be Master's or Ph.D. with 4- 10 years of relevant experience. Senior fellowship holders must be Master's or Ph.D. with 10- 15 years of relevant experience, able to present ability to hold an independent research programme.
Application: Applications can made online via email at igpedu@tatatrusts.org. **Prizes & Rewards:** Scholar will be awarded with a monthly stipend, a book, journal or research database allowance, a communication and domestic travel allowance. **Last Date to Apply:** August 24, 2017.
Short Source URL: http://www.b4s.in/ aj/TTF0

National Overseas Scholarship 2017-18

Category: National
Description: 100 scholarships and 5 passage grants are offered to scheduled castes, nomads, tribes, labo urs and artisans, earmarking 30% for women candidates by Ministry of Social Justice and Empowerment, Government of India to assist students with Ph.D. or Master's programme in any country overseas.
Eligibility: Candidate mu st secure 55% or equivalent in relevant Master's and Bachelor's degree for Ph.D. and Master's degree, respectively with age limit not more than 35 years and family income must not exceed INR 6L p.a. **Application:** Applications are accepted offline via post only.
Prizes & Rewards: Tuition fee, annual maintenance allowance of USD 15,400 for USA and other countries and GBP 9900 for UK, annual contingency allowance of USD 1500 for USA and other countries and GBP 1100 for UK aspiring students, incidental journey allowance of USD 20 and prescribed equipment allowance of USD 20, research or teaching assistantship, medical insurance premium, air fare and local travel will be provided to the scholar. **Last Date to Apply:** August 31, 2017
Short Source URL: http://www.b4s.in/aj/NOS4

Pre-Matric Scholarships Scheme for Minorities 2017-18

Category: National
Description: Ministry of Electro nics and Information Technology under National e-Governance Plan, Government of India is providing financial aid to students belonging to the community of Zoroastrians, Christians, Buddhists, Jains, Sikhs and Muslims to motivate students to attend school for a better livelihood, earmarking 30% scholarships for girl students.
Eligibility: Students studying in class 1- 10 from any private or government school affiliated from a recognized board with family income not more than INR 1L and 50% marks in previous final examination are eligible to apply for the opportunity.
Application: Applications can be made online only.
Prizes & Rewards: The awardees will receive varying admission, tuition and maintenance fee depending on the class they are studying, for both day scholars and hostellers. **Last Date to Apply:** August 31, 2017. **Short Source URL:** http://www.b4s.in/aj/PMS20

courtesy
www.buddy4study.com

వివరాలు ఇవిగో

వెబ్ డిజైనింగ్, మల్టీ మీడియా

- **నాకు వెబ్ డిజైనింగ్, మల్టీ మీడియా పట్ల ఆసక్తి ఉంది. ఇందులోకి వెళ్లాలనుకుంటున్నాను. ఈ రంగం ఎలా ఉంటుందో వివరించగలరు?**

ప్రదీప్, విజయనగరం

○ ఐటి బూమ్‌తో వెబ్ డిజైనింగ్, మల్టీ మీడియా వెనకబడి ఉన్నట్లు కనిపించినా ఈ రంగంలో కూడా ఉద్యోగ అవకాశాలు బాగానే ఉన్నాయి. ఇందులోకి వెళ్లాలనుకునే వారి సంఖ్య, ఉద్యోగాలు వచ్చేవారి సంఖ్యను తీసుకుంటే దాదాపుగా ఐటితో సమానమైన శాతమే ఉంటుంది. అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు, పబ్లిషింగ్, ఆడియో-విజువల్ మీడియా, డిజైన్ స్టూడియోలు, ప్రింటర్స్, మాన్యుఫ్యాక్చరర్స్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్, మార్కెటింగ్ సంస్థలు, ఎడ్యుకేషన్ సంస్థలు, లైబ్రరీలు తదితరాలు వెబ్‌డిజైనర్లను రిక్రూట్ చేసుకుంటాయి. గ్రాఫిక్, లే అవుట్ డిజైనింగ్‌లో కూడా వీరు పనిచేయవచ్చు. విజువల్‌గా ఆర్టిస్టిక్‌గా ఉండేలా చూడాలి. ఇక మల్టీ మీడియా ఆర్టిస్టులు సినిమాలు, టీవీ ప్రోగ్రామ్స్, కంప్యూటర్ గేమ్స్‌కు స్పెషల్ ఎఫెక్ట్స్ తీసుకురావడం చేస్తుంటారు. సాధారణంగా వీరు యానిమేషన్ సినిమాకు అవసరమైన సిరీస్ ఆఫ్ కంప్యూటర్ ఇమేజెస్‌ను రూపొందిస్తుంటారు. సినిమాల్లో విజువల్ ఎఫెక్ట్స్ అవసరం పెరిగిన తరవాత వీరికి మార్కెట్లో డిమాండ్ పెరిగింది. మొబైల్, కంప్యూటర్ గేమ్స్‌తో వీరి జీతాలు కూడా ఐటితో సమానంగా చేరుకున్నాయని చెప్పొచ్చు. ఆర్కిటెక్చర్ అనేది కంప్యూటర్ స్కిల్స్ బాగా అవసరమైన మరోరంగం. వీరికి కూడా క్రియేటివ్‌గా, అనలిటికల్ ఆలోచించే లక్షణాలు ఉండాలి. ప్రోగ్రామింగ్, కోడింగ్ పట్ల ఆసక్తిఉంటే ఐటివైపు కూడా వెళ్లవచ్చు. ఇంజనీరింగ్ చేయాలని ఆలోచన లేకుంటే బిఎస్సీ ఐటి, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ లేదా బిసిఏ తదితరాలు చేసి డిజిటల్ మార్కెటింగ్, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, నెట్‌వర్కింగ్ తదితరాల వైపు కూడా వెళ్లవచ్చు.

● **గోవర్ధనం కిరణ్‌కుమార్**

చిరునామా: వివరాలు ఇవిగో, కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్వినీ ఎన్‌క్లేవ్, హుడా హైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033

TSPSC

2345 ఉద్యోగాలు

దేశ 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 15న గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ ఉద్యోగాలన్నింటినీ ఈ ఏడాదే భర్తీ చేస్తామన్నారు. తదనుగుణంగా అటవీ, వైద్య శాఖల్లో 2345 పోస్టులకు టిఎస్‌పిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో అటవీశాఖ, వైద్య విధాన పరిషత్, వైద్య విద్య డైరెక్టరేట్, వైద్య సేవ రంగానికి సంబంధించిన ఉద్యోగాలకు సంబంధించి తొమ్మిది ప్రకటనల్లో విడుదలయ్యాయి. అయితే ఇవన్నీ ప్రత్యేక విభాగాల్లో పనిచేయడానికి అవసరమైన క్వాలిఫైడ్ అభ్యర్థులకు చెందినవి. ఈ పోస్టుల్లో బీట్ ఆఫీసర్స్ ఖాళీలు 1857 మాత్రమే సాధారణ విద్యార్హతకు సంబంధించినవి.

సిలబస్ & ప్రిపరేషన్ సమాచారం

తాజా నోటిఫికేషన్ల ప్రకారం సిలబస్ కింద జనరల్ స్టడీస్, విద్యార్హత అంశాలు చెరిసగంగా ఉన్నాయి.

జనరల్ స్టడీస్ అంశాలు

1. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ సమకాలీన సంఘటనలు
2. సమాజం - సంస్కృతి - వారసత్వం - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి పథకాలు
3. భారతదేశ - తెలంగాణ సహజ వనరులు-వాటి వినియోగం
4. పర్యావరణం - పరిరక్షణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్
5. జనాభా - ఆరోగ్యం - పర్యావరణం - సమాజంపై ప్రభావం
6. భారతదేశ, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం, ట్రేడ్, ఇండస్ట్రీస్, రవాణా సర్వీసులు. 7. ఆహారం - పబ్లిక్ హెల్త్ 8. సైన్స్ & టెక్నాలజీ - సమకాలీన కారణాలు. 9. తెలంగాణ ఉద్యమం - రాష్ట్ర ఏర్పాటు.
10. నీతి- వృత్తి పరమైన విలువలు
11. లాజికల్ రీజనింగ్ - అనలిటికల్ ఎబిలిటీ - డేటా వర్తింపు

జనరల్ స్టడీస్ ప్రిపరేషన్ కోసం అభ్యర్థులు దిన పత్రికల్ని ప్రతి రోజూ చదవాలి. గత టిఎస్‌పిఎస్సీ ప్రశ్న పత్రాల సరళిని పరిశీలించాలి. తెలుగు అకాడమీ ప్రచురించిన పాఠ్య పుస్తకాలు కూడా ప్రిపరేషన్‌కు ఉపయుక్తంగా ఉంటాయి.



సబ్జెక్టుకు సంబంధించిన అంశాలను వారి వారి అకడమిక్ ప్రామాణిక పుస్తకాల ఆధారంగా ప్రిపేరవ్వాలి. అలాగే వివిధ రాష్ట్రాల పరీక్ష పేపర్లు, జాతీయ స్థాయి ఎగ్జామ్ పేపర్స్‌ను పరిశీలించాలి. సబ్జెక్టులో వస్తున్న నూతన మార్పులపై అవగాహన పెంచుకోవాలి.

వ్యక్తిగత సృజనాత్మకత, స్వేచ్ఛ, సేవ తదితరాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం ఉంటుంది. ఉద్యోగార్థులు సిలబస్‌పై నిర్దిష్ఠ అవగాహన పెంపొందించుకోవడం ద్వారా విజయం సాధించవచ్చు. వాస్తవంగా ఇటువంటి అవకాశాలు అరుదుగా వస్తుంటాయి.

పోస్టుల వివరాలు

నోటిఫికేషన్ నంబరు	కేటగిరి	ఖాళీలు
40/2017	సివిల్ అసిస్టెంట్ సర్జన్స్(స్పెషలిస్ట్)- తెలంగాణ వైద్య విద్య విధాన పరిషత్	205
41/2017	డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్(స్పెషలిస్ట్)- తెలంగాణ వైద్య విద్య విధాన పరిషత్	10
42/2017	ట్యూటర్స్ ఇన్-డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్	65
43/2017	లెక్చరర్స్ ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిసిస్ట్స్ ఇన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్	06
44/2017	సివిల్ అసిస్టెంట్ సర్జన్స్(స్పెషలిస్ట్)- ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్	43
45/2017	అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్ - ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్	02
46/2017	ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ - ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్	67
47/2017	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ - ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్	90
48/2017	ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ - ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్	1857
	మొత్తం ఖాళీలు	**2345**

1. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్

Post Code	No.of the vacancies	Age as on 01/07/2017	Scale of pay
1	1857	18 - 31Years (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు మినహాయింపు)	Rs.16,400- 49,870

- **విద్యార్హత:** ఇంటర్ పాస్ లేదా తత్సమానం. ఫిజికల్ ఫిట్‌నెస్ అవసరం. ఫిట్‌నెస్ నిబంధనలు స్త్రీ, పురుషులకు వేర్వేరు. ఎన్‌సిసి సర్టిఫికెట్ ఉన్నవారికి అదనపు మార్కులు.
- **పరీక్ష విధానం:** ఆబ్జెక్టివ్ టైప్‌లో ప్రశ్నలు ఉంటాయి.

	No.of. Que	Duration	Marks
Paper I- General studies	100	90 Mins	100
Paper II- General Maths	100	90 Mins	100
Total	200	180 Mins	200

- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 2017 ఆగస్టు 21
- దరఖాస్తుకు చివరి తేదీ: 2017 సెప్టెంబరు 12
- పరీక్ష తేదీ: 2017 అక్టోబరు 29
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.tspsc.gov.in

2. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్

అటవీ శాఖకు చెందిన సెక్షన్ ఆఫీసర్స్ నియామకాల నోటిఫికేషన్ ఈ నేపథ్యంలోనే విడుదలైంది.

Post Code	No.of the vacancies	Age	Scale of pay
1	90	18 - 31 Years (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు మినహాయింపు)	Rs. 21,230- 63,010

- **విద్యార్హత:** బొటని, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, జియాలజి, అగ్రికల్చర్, కెమికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ మొదలైన డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు దేహదారుఢ్య పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఎన్‌సిసి సర్టిఫికెట్ ఉన్నవారికి బోనస్ మార్కులుంటాయి.
- **పరీక్ష విధానం:**
  Paper I- General studies - 100 Marks
  Paper II- General Maths - 100 Marks
- జనరల్ స్టడీస్‌లోని ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో 11 అంశాల నుంచి అడుగుతారు.
- జనరల్ మేథ్స్‌లోని ప్రశ్నలు పదోతరగతి స్థాయిలో అర్థమెటిక్స్, ఆల్‌జీబ్రా, ట్రిగనామెట్రి మొదలైన అంశాల నుంచి అడుగుతారు.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 2017 ఆగస్టు 21
- దరఖాస్తుకు చివరి తేదీ: 2017 సెప్టెంబరు 12
- పరీక్ష తేదీ: 2017 అక్టోబరు 22
  అయితే పరీక్షను కంప్యూటర్ బేస్డ్ రిటన్ టెస్ట్ లేదా ఒఎంఆర్ పద్ధతుల్లో నిర్వహించే అధికారాన్ని కమిషన్ కలిగి ఉంటుంది.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.tspsc.gov.in

3. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్

Post Code	No.of the vacancies	Age	Scale of pay
1	67	18 - 28 Years (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మినహాయింపు)	Rs.31,460- 84,970

- ఈ పోస్టులు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో అత్యున్నతమైనవి.
- ఎంపిక విధానం: రెండు దశల్లో నిర్వహిస్తారు.

మొదటి దశ: క్వాలిఫైయింగ్ ఎగ్జామ్
Paper I- General English - 100 Que 100 Marks
Paper II- Maths - 100 Que 100 Marks
రెండో దశ: సెలెక్షన్ ఎగ్జామ్
Paper I- General Studies - 150 Que 150 Marks
Paper II- Optional paper - 150 Que 300 Marks
Interview 50 Marks
Total 500 Marks

- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ (అగ్రికల్చర్/బోటనీ/ కెమిస్ట్రీ/ కంప్యూటర్ సైన్స్/ అప్లికేషన్స్/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫారెస్ట్రీ/ జియాలజీ/ హార్టికల్చర్/ మేథమెటిక్స్/ ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/ వెటర్నరీసైన్స్/ జువాలజీ/ ఇంజనీరింగ్- అగ్రికల్చర్/కెమికల్/సివిల్/ కంప్యూటర్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/మెకానికల్).
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 2017 ఆగస్టు 21
- దరఖాస్తుకు చివరి తేదీ: 2017 సెప్టెంబరు 12
- పరీక్ష తేదీ: 2017 అక్టోబరు 14
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.tspsc.gov.in

4. అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

Post Code	No. of the vacancies	Age	Scale of pay
1	02	18 - 44 Years (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మినహాయింపు)	Rs.17,890- 53,950

- **విద్యార్హత:** ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల నుంచి ఫిజియోథెరపీలో డిప్లమా ఉండాలి. అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్ పోస్టులు వైద్య రంగంలోని మెడికల్ ఇన్సూరెన్స్ సర్వీస్ రంగానికి చెందినవి.
- **పరీక్ష విధానం:**

పేపర్-1 - జనరల్ స్టడీస్ & జనరల్ ఎబిలిటీస్ 150 ప్రశ్నలు 150 మార్కులు
పేపర్-2 - ఫిజియోథెరపీ(డిప్లమో స్థాయి) 150 ప్రశ్నలు 150 మార్కులు
మొత్తం: 300 మార్కులు

- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 2017 ఆగస్టు 22
- దరఖాస్తుకు చివరి తేదీ: 2017 సెప్టెంబరు 15
- పరీక్ష తేదీ: 2017 అక్టోబరు 08

5. సివిల్ అసిస్టెంట్ సర్జన్స్

S.No.	No.of the vacancies	Age	Scale of pay
1	43	18-44 years (ఎస్సీ, ఎస్టీ, బిసిలకు మినహాయింపు ఉంది)	Rs.40,270- 93,780

- **విద్యార్హత:** ఎంబిబిఎస్ ప్రాథమిక అర్హత. ఈ డిగ్రీ మెడికల్ కౌన్సెల్ యాక్ట్ 1956కు లోబడి, అలాగే మెడికల్ సర్వీస్ కోసం శాశ్వత గుర్తింపు స్థాయి ఉండాలి.
- **పరీక్ష విధానం:**
  పార్ట్ ఎ : రాత పరీక్ష
  పేపర్ 1 - జనరల్ స్టడీస్ - 150 ప్రశ్నలు - 150 మార్కులు
  పేపర్ 2 - మెడికల్ సైన్స్& జనరల్ మెడిసిన్ - 150 ప్రశ్నలు - 300 మార్కులు
  పార్ట్ బి : ఇంటర్వ్యూ - 50 మార్కులు
  మొత్తం మార్కులు - 500
- ఆన్‌లైన్ అప్లికేషన్స్ ప్రారంభం : ఆగస్టు 22
- అప్లికేషన్‌కు చివరి తేదీ: సెప్టెంబరు 15
- పరీక్ష తేదీ: అక్టోబరు 8

6.లెక్చరర్స్ ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ & ఫిజిసిస్ట్స్

S.No.	No.of the vacancies	Age	Scale of pay
1	6	18-44	Rs.37,100- 91,450

- **విద్యార్హత:** ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఎస్సీ (ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్)తోపాటు బార్క్ నుంచి హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో ఏడాది పిజి ట్రైనింగ్ కోర్సు పూర్తి చేయాలి.
- **ఎంపిక విధానం:**
  పార్ట్ ఎ : రాత పరీక్ష
  పేపర్ 1 - జనరల్ స్టడీస్ - 150 ప్రశ్నలు - 150 మార్కులు
  పేపర్ 2 - రేడియాలజీ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్(డిప్లొమా లెవల్) - 150 ప్రశ్నలు - 300 మార్కులు
  పార్ట్ బి : ఇంటర్వ్యూ - 50 మార్కులు
  మొత్తం మార్కులు: 500
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 22
- దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15
- పరీక్ష తేదీ: అక్టోబరు 8

7.ట్యూటర్స్ ఇన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్

S.No.	No.of the vacancies	Age	Scale of pay
1	65	18-44 (ఎస్సీ, ఎస్టీ, బిసిలకు మినహాయింపు)	Rs.15,600- 39,100

- ట్యూటర్ క్లినికల్ ఖాళీలు: 33
- ట్యూటర్ నాన్ క్లినికల్ ఖాళీలు: 32
- **పార్ట్ ఎ - రాత పరీక్ష**
  పేపర్ 1 - జనరల్ స్టడీస్ - 150 ప్రశ్నలు - 150 మార్కులు
  పేపర్ 2 - మెడికల్ సైన్స్ & జనరల్ మెడిసిన్(డిగ్రీ లెవల్) - 150 ప్రశ్నలు - 150 మార్కులు
- ఆన్‌లైన్ అప్లికేషన్స్ ప్రారంభం: ఆగస్టు 22
- చివరి తేదీ: సెప్టెంబరు 15
- పరీక్ష తేదీ: అక్టోబరు 14

8.డెంటల్ అసిస్టెంట్ సర్జన్

S.No.	No.of the vacancies	Age	Scale of pay
1	10	18-44 (ఎస్సీ, ఎస్టీ, బిసిలకు మినహాయింపు)	Rs.40,270- 93,270

- **విద్యార్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బిడిఎస్ + తెలంగాణ రాష్ట్ర డెంటిస్ట్ రిజిస్ట్రేషన్ ట్రిబ్యునల్ (టిఎస్‌డిఆర్‌టి) నుంచి గుర్తింపు ఉండాలి
- **ఎంపిక విధానం:**
- పార్ట్ ఎ: రాత పరీక్ష
  పేపర్ 1 - జనరల్ స్టడీస్ - 150 ప్రశ్నలు - 150 మార్కులు
  పేపర్ 2 - డెంటల్ సర్జరీ(డిగ్రీ లెవల్) - 150 ప్రశ్నలు - 300 మార్కులు
  పార్ట్ బి : ఇంటర్వ్యూ - 50 మార్కులు
  మొత్తం మార్కులు - 500
- **అప్లికేషన్ ప్రక్రియ**
  ఆన్‌లైన్ అప్లికేషన్స్ ప్రారంభం: ఆగస్టు 22
  చివరి తేదీ: సెప్టెంబరు 15
  పరీక్ష తేదీ: అక్టోబరు 8

9.సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్స్

వైద్య రంగంలో ఉన్నత స్థాయికి చెందిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ ఇన్ తెలంగాణ వైద్య విధాన పరిషత్ పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి.

విభాగం	ఖాళీలు
అబ్‌స్టెట్రిక్స్& గైనకాలజీ	41
పీడియాట్రిక్స్	27
అనెస్థీషియా	39
ఆర్థోపీడిక్స్	5
ఇఎన్‌టి	20
డెర్మటాలజీ	1

- **వయసు:** జూలై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్లు.
- **స్కేల్:** రూ.40,270 - రూ.93,270
- **పరీక్ష విధానం**
  పార్ట్ ఎ - రాత పరీక్ష (ఆబ్జెక్టివ్ టైప్)
  పేపర్ 1 - జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ - 150 ప్రశ్నలు - 150 నిమిషాలు - 150 మార్కులు
  పేపర్ 2 - సంబంధిత సబ్జెక్టు - సెక్షన్ ఎ - బేసిక్ యుజి సిలబస్(అందరికీ కామన్) (75 ప్రశ్నలు) + సెక్షన్ బి - సంబంధిత పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ సిలబస్(75 ప్రశ్నలు)(జనరల్ మెడిసిన్/ జనరల్ సర్జరీ సిఎఎస్ పోస్టులకు) - 150 ప్రశ్నలు - 150 నిమిషాలు - 300 మార్కులు
  పార్ట్ బి - ఇంటర్వ్యూ - 50 మార్కులు
  మొత్తం మార్కులు : 500
- **అప్లికేషన్ ప్రక్రియ**
  ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రారంభం : ఆగస్టు 22
  చివరి తేదీ: సెప్టెంబరు 15.
  పరీక్ష తేదీ: అక్టోబరు 22

డాక్టర్ మహ్మద్ రియాజ్
సీనియర్ ఫ్యాకల్టీ

సాహసికులకు సవాలు
సిడిఎస్ఇ

రొటీన్ కెరీర్‌కు భిన్నంగా దేశం గర్వించే రీతిలో ఉద్యోగ బాధ్యతలు, ధైర్య సాహసాలతో కోట్లా మంది ప్రజల మన్ననలు అందుకునే అపూర్వ అవకాశం..ఇటువంటి బహుముఖ ప్రత్యేకతలకు వేదిక రక్షణ రంగం. ఇంతటి ఉన్నతమైన రక్షణ రంగంలోని త్రివిధ దళాల్లో కెరీర్ ప్రారంభించడానికి చక్కని మార్గంగా నిలుస్తోంది కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్ (సిడిఎస్ఇ). యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఏటా రెండు సార్లు సిడిఎస్ఇని నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-(2), 2017 నోటిఫికేషన్ వెలువడింది. దీనికి సంబంధించిన వివరాలు..

కాసింత విషయ పరిజ్ఞానం ఉంటే చాలు ధైర్య సాహసాలతో కూడిన అద్భుతమైన కెరీర్‌లోకి అడుగు పెట్టే అవకాశం కల్పిస్తోంది సిడిఎస్ఇ. ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా త్రివిధ దళాల్లో మొత్తం 414 పోస్టులను భర్తీ చేయనున్నారు. విభాగాల వారీగా ఖాళీలు..

ఇండియన్ మిలటరీ అకాడమీ	100
ఇండియన్ నేవల్ అకాడమీ	45
ఎయిర్‌ఫోర్స్ అకాడమీ	32
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ	225
ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్‌సి ఉమెన్ నాన్ టెక్నికల్)	12

- **అర్హతలు-వయసు:** ఎంచుకున్న విభాగాన్ని బట్టి అర్హత ప్రమాణాలు మారుతూంటాయి.
- **ఇండియన్ మిలటరీ అకాడమీ:** అవివాహిత పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ/తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులై జూలై 2, 1994- జూలై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.
- **ఇండియన్ నేవల్ అకాడమీ:** అవివాహిత పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇంజనీరింగ్‌లో డిగ్రీ, జూలై 2, 1994- జూలై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ:** ఇంజనీరింగ్ డిగ్రీ లేదా డిగ్రీ/తత్సమాన (10+2 స్థాయిలో మేథమెటిక్స్, ఫిజిక్స్ చదివి ఉండాలి) కోర్సుల్లో ఉత్తీర్ణులై, జూలై 2, 1994- జూలై 1, 1998 మధ్య జన్మించి ఉండాలి. డీజీసీఏ కమర్షియల్ పైలెట్ లైసెన్స్ ఉన్న వారికి వయోపరిమితిలో రెండేళ్ల సడలింపు ఉంటుంది.
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్‌సి-పురుషులు):** డిగ్రీ/తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులై, జూలై 2, 1993- జూలై 1,1999 మధ్య జన్మించి ఉండాలి.
- **ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఎస్ఎస్‌సి ఉమెన్ నాన్ టెక్నికల్):** అవివాహితులు/విడాకులు/వైధవ్యం పొంది తిరిగి పెళ్లి చేసుకోని మహిళలు, డిగ్రీ/తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులై జూలై 2, 1993- జూలై 1, 1999 మధ్య జన్మించి ఉండాలి.

ఎంపిక విధానం

ఎంపిక విధానంలో రెండు దశలు ఉంటాయి. అవి రాత పరీక్ష, ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్. రాత పరీక్షలో నిర్దేశిత అర్హత సాధించిన వారు ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ రెండు దశల్లో సాధించిన మెరిట్ ఆధారంగా నియామకాన్ని ఖరారు చేస్తారు.

రాత పరీక్ష

ఎంచుకున్న విభాగాన్ని బట్టి రాత పరీక్షను వేర్వేరుగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం హిందీ/ఇంగ్లీష్ భాషల్లో ఉంటుంది. ఇండియన్ మిలటరీ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలకు నిర్వహించే రాత పరీక్షకు కేటాయించిన మార్కులు 300. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. అవి..ఇంగ్లీష్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు), జనరల్ నాలెడ్జ్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు), ఎలిమెంటరీ మేథమెటిక్స్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు). ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి నిర్వహించే రాత పరీక్షకు కేటాయించిన మార్కులు 200. ఇందులో రెండు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అవి..ఇంగ్లీష్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు), జనరల్ నాలెడ్జ్ (100 మార్కులు, సమయం 120 నిమిషాలు). నెగిటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తప్పునకు 0.33 మార్కు కోత విధిస్తారు.

సిలబస్-విశ్లేషణ

- **ఇంగ్లీష్:** ఇందులో ఇంగ్లీష్‌పై అభ్యర్థుల ప్రాథమిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా నిత్య జీవితంలో ఇంగ్లీష్ భాష వినియోగం, సంబంధిత అంశాలాధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఈ క్రమంలో గ్రామర్, వొకాబులరీ, కాంప్రెహెన్షన్, యూజ్ ఆఫ్ వర్డ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **జనరల్ నాలెడ్జ్:** కరెంట్ ఈవెంట్స్‌పై అభ్యర్థుల అవగాహనను పరీక్షించేలా ఇందులో ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా శాస్త్రసాంకేతిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, నిత్యం జీవితంలో సైన్స్ అనువర్తనాల ఉపయోగం వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. అంతేకాకుండా హిస్టరీ, జాగ్రఫీ విభాగాల నుంచి కూడా ప్రశ్నలు వస్తాయి.
- **ఎలిమెంటరీ మేథమెటిక్స్:** ఇందులో అడిగే ప్రశ్నలు మెట్రిక్యులేషన్ స్థాయిలో ఉంటాయి. అర్థమెటిక్, ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, జ్యామెట్రీ, మెన్సురేషన్, స్టాటిస్టిక్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ప్రిపరేషన్

మేథమెటిక్స్ కోసం 6-10వ తరగతుల మేథ్స్ పుస్తకాల్లోని అన్ని అంశాలపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకోవాలి. అందులోని సూత్రాలను, ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యమివ్వాలి. వీలైనంత ఎక్కువగా మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఇదే క్రమంలో షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవాలి. తద్వారా సమాధానాన్ని వేగంగా, కచ్చితత్వంతో గుర్తించవచ్చు. జనరల్ నాలెడ్జ్ కోసం ప్రతి రోజూ ఆంగ్ల దినపత్రికలను చదవాలి. అందులో ముఖ్యమైన వాటిని పాయింట్ల రూపంలో నోట్ చేసుకోవాలి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ కోసం ఆయా సబ్జెక్ట్‌ల వారీగా ఎన్‌సిఈఆర్‌టి 11, 12వ తరగతుల పుస్తకాలను చదవాలి. ఇంగ్లీష్‌లో గ్రామర్‌పై ఎక్కువగా దృష్టి సారించాలి. ముఖ్యంగా గ్రామర్‌ను వాక్య నిర్మాణంలో ఏవిధంగా అన్వయిస్తున్నారో అవగాహన పెంచుకోవాలి. ఇందుకు ప్రతి రోజూ ఆంగ్ల దినపత్రికలను చదవడం ఉపయోగకరం. మోడల్ ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. అంతేకాకుండా సబ్జెక్ట్‌ల వారీగా వచ్చే అవకాశం ఉన్న బిట్లను ముందే ఊహించుకొని ప్రాక్టీస్ చేయడం ఉత్తమం.

ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్

సర్వీస్ సెలెక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బి) ఇంటెలిజెన్స్ పర్సనాలిటీ టెస్ట్‌ను నిర్వహిస్తుంది. ఇందులో స్టేజ్-1, స్టేజ్-2 అనే రెండు దశలు ఉంటాయి. స్టేజ్-1లో అర్హత సాధిస్తేనే స్టేజ్-2కు అనుమతిస్తారు.

- **స్టేజ్-1:** ఇందులోని ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్‌లో భాగంగా వెర్బల్-నాన్ వెర్బల్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటాయి.
- **స్టేజ్-2:** ఈ దశలో నాలుగు రోజుల షెడ్యూల్ ఉంటుంది. ఇందులో సైకలాజికల్ టెస్ట్‌లు, గ్రూప్ ఆఫీసర్ టాస్క్‌లు, ఇంటర్వ్యూ, కాన్ఫరెన్స్ వంటివి ఉంటాయి. సైకలాజికల్ టెస్ట్‌లో థిమాటిక్ అప్రిసియేషన్ టెస్ట్, వర్డ్ అసోసియేషన్ టెస్ట్, సిచ్యుయేషన్ రియాక్షన్ టెస్ట్, సెల్ఫ్ డిస్క్రిప్షన్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. తరవాత ఉండే గ్రూప్ ఆఫీసర్ టాస్క్‌లో గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్ ఎక్సైజ్, హాఫ్ గ్రూప్ టాస్క్, ఇండివిడ్యువల్ అబ్‌స్టకల్, కమాండ్ టాస్క్, స్నేక్ రేస్/గ్రూప్ అబ్‌స్టకల్ రేస్, ఇండివిడ్యువల్ లెక్చర్, ఫైనల్ గ్రూప్ టాస్క్ ఉంటాయి. తరవాత ఇంటర్వ్యూ, అటుపై కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు.

కటాఫ్ మార్కులు (సిడిఎస్ఈ-1, 2016, ఫైనల్ ఎగ్జామ్): ఐఎంఎ-214, ఐఎన్ఎ-217,ఎఎఫ్ఎ-249,ఒటిఎ (పురుషులు)-150, ఒటిఎ (మహిళలు)-157.

- **రిఫరెన్స్ బుక్స్:** పాత్‌ఫైండర్ సిడిఎస్ ఎగ్జామినేషన్ (అర్హింత్), ఇంగ్లిష్ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్-పియర్సన్ ఎడ్యుకేషన్, ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ గైడెన్స్- అర్హింత్, మనోరమ ఇయర్ బుక్, ఇండియా ఇయర్ బుక్, క్వాంటమ్ క్యాట్‌బై-అర్హింత్.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబర్ 8, 2017
- **రాత పరీక్ష తేదీ:** నవంబర్ 19, 2017
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం. •**వెబ్‌సైట్:** www.upsc.gov.in



శిక్షణ ఇలా

అభ్యర్థులు ఎంచుకున్న విభాగాల మేరకు ఆయా అకాడమీల్లో శిక్షణనిస్తారు. శిక్షణ సమయంలో నెలకు రూ.21,000 స్టయిపెండ్ చెల్లిస్తారు.

- **ఇండియన్ మిలటరీ అకాడమీ (ఐఎంఎ):** ఈ విభాగాన్ని ఎంచుకున్న వారికి ఐఎంఎ -డెహ్రాడూన్‌లో 18 నెలలపాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలో వీరిని జెంటిల్‌మెన్ కేడెట్లుగా వ్యవహరిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారి కెరీర్ లెఫ్టినెంట్ హోదాతో ప్రారంభమవుతుంది. దీని తరవాత కెప్టెన్, మేజర్, లెఫ్టినెంట్ కల్నల్, కల్నల్, బ్రిగేడియర్, మేజర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్, జనరల్ వరకు ప్రమోషన్లను అందుకునే అవకాశం ఉంటుంది.
- **ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఎ):** ఈ విభాగానికి ఎంపికైన వారికి ఐఎన్ఎ-ఎజిమాలాలో నేవల్ ఓరియెంటేషన్‌లో 44 వారాల శిక్షణనిస్తారు. తరవాత ఆఫీసర్స్ సీ ట్రైనింగ్ (6 నెలలు), సబ్ లెఫ్టినెంట్ అఫ్లోట్ ట్రైనింగ్ (6 నెలలు), సబ్ లెఫ్టినెంట్ టెక్నికల్ కోర్స్ (32 వారాలు), ఫుల్ నావల్ వాచ్ కీపింగ్ సర్టిఫికెట్ (6 నెలలు) ప్రోగ్రామ్‌లు ఉంటాయి.
- **ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఎఎఫ్ఎ):** ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ తరవాత ఎయిర్‌ఫోర్స్ సెలెక్షన్ బోర్డ్ నిర్వహించే పరీక్షలో అర్హత సాధించిన వారికి ఎయిర్‌ఫోర్స్ అకాడమీ-దుండిగల్ (హైదరాబాద్)లో 74 వారాలపాటు ఫ్లయింగ్ బ్రాంచ్ (పైలట్స్)లో శిక్షణనిస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఫ్లయింగ్ ఆఫీసర్ ర్యాంక్ ఇస్తారు. తరవాత ఫ్లయిట్ లెఫ్టినెంట్, స్క్వాడ్రన్ లీడర్, వింగ్ కమాండర్, గ్రూప్ కెప్టెన్ హోదాలు ఉంటాయి. ప్రతిభ ఉంటే ఎయిర్ కమాండర్, ఎయిర్‌వైస్ మార్షల్, ఎయిర్ మార్షల్ వంటి అత్యున్నత ర్యాంక్‌లను కూడా చేరుకోవచ్చు.
- **ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీ:** చెన్నైలోని ఆఫీసర్ ట్రైనింగ్ అకాడమీకి ఎంపికైన వారికి 49 వారాలపాటు శిక్షణనిస్తారు. శిక్షణ సమయంలో వీరిని జెంటిల్‌మన్/లేడి కేడెట్లుగా వ్యవహరిస్తారు. శిక్షణను పూర్తి చేసుకున్న వారికి లెఫ్టినెంట్ (షార్ట్ సర్వీస్ కమిషన్) ర్యాంక్ ఇస్తారు. అంతేకాకుండా ప్రీ కమిషనింగ్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారికి మద్రాస్ యూనివర్సిటీ 'పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్' డిగ్రీని ప్రదానం చేస్తుంది. లెఫ్టినెంట్ తరవాత కెప్టెన్, మేజర్, లెఫ్టినెంట్ కల్నల్ వరకు ప్రమోషన్లను అందుకునే అవకాశం ఉంటుంది.

IBPS
పీఓ ప్రిపరేషన్
మెయిన్స్‌లోనే మార్పులు

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో పీఓ/ఎంటి పోస్టులకు నోటిఫికేషన్ విడుదల, దరఖాస్తుల స్వీకరణ ఆరంభమైంది. ప్రిలిమినరీ ఎగ్జామ్‌ను యథాతథంగా ఉంచారు. మెయిన్స్‌లో మాత్రం మార్పులు చేశారు. ఎస్‌బిఐ పీఓకు ఉద్దేశించిన మోడల్‌ను స్వీకరించారు. చేసిన మార్పులను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా ప్రిపరేషన్ కొనసాగిస్తే విజయం అసాధ్యం కాదు.

- ప్రకటించిన ఖాళీలన్నీ అలహాబాద్ బ్యాంక్, ఆంధ్రా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉన్నాయి. మొత్తం 3562 పోస్టులు కాగా అత్యధికంగా కెనరా బ్యాంకులో 1350 ఖాళీలు ఉన్నాయి .
- ఐబిపిఎస్ పీఓకు నిర్వహించే ప్రిలిమ్స్ పరీక్షలో ప్రకటన ప్రకారం ఏమి మార్పు లేదు. ఇందులో మూడు టెస్ట్‌లు 100 ప్రశ్నలు. 100 మార్కులు. ఒక గంట కాల వ్యవధి. అయితే ప్రతి టెస్ట్‌లోనూ అభ్యర్థులు నిర్దేశిత అర్హత సాధించాలి. ఇది ఆన్‌లైన్ పరీక్ష. అన్ని ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహావే. మైనస్ మార్కులు ఉన్నాయి.
- మెయిన్స్ ఎగ్జామ్ పూర్తిగా మారింది. ఎస్‌బిఐ విధానం అమలు చేస్తున్నారు. ఈసారి నుంచి ఎస్‌బిఐ పీఓ మెయిన్స్ ఎగ్జామ్ మాదిరిగా, రీజనింగ్+కంప్యూటర్ ఆప్టిట్యూడ్ కలిపి ఒక టెస్ట్ అంటున్నారు.
- ఇంకా మెయిన్స్‌లో టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్, డేటా అనాలిసిస్ అండ్ ఇంట్రప్రిటేషన్ టెస్ట్ ఉన్నాయి.
- మెయిన్స్‌లో గతంలో జనరల్ అవేర్‌నెస్ టెస్ట్ (బ్యాంకింగ్ అవేర్‌నెస్‌తో కలిపి) అంటే, ప్రస్తుతం ఎస్‌బిఐలో మాదిరిగా జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ టెస్ట్ అంటున్నారు. గతంలో కన్నా ఇప్పుడు అదనంగా చేర్చింది ఎకానమీ అనే అంశం.
- ఎస్‌బిఐ పీఓ మెయిన్ ఎగ్జామ్‌లో రీజనింగ్ + కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో 45 ప్రశ్నలు ఉంటాయి(60 మార్కులు). దీనికి 60 నిమిషాలు అంటే ఒక గంట ప్రత్యేకించి కేటాయించారు. ఇందులో ఒక నిమిషానికి ఒక ప్రశ్న చొప్పున చేయాలి(స్పీడ్, ఆక్యురసీ చాలా అవసరం).
- ఎస్‌బిఐ పీఓ మెయిన్ ఎగ్జామ్ మాదిరిగానే డేటా అనాలిసిస్ అండ్ ఇంట్రప్రిటేషన్ టెస్ట్‌లో 35 ప్రశ్నలు ఉంటాయి(60 మార్కులు). సమయం 45 నిమిషాలు. సరైన సమాధానం గుర్తిస్తే ఒక ప్రశ్నకి సుమారు రెండు మార్కులు వస్తాయి.
- టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్‌లో 35 ప్రశ్నలు(40 మార్కులు), సమయం 40 నిమిషాలు.
- జనరల్/ఎకానమీ / బ్యాంకింగ్ అవేర్‌నెస్ టెస్ట్‌కి 40 ప్రశ్నలు (మార్కులు 40) సమయం 35 నిమిషాలు కేటాయించారు(ఈ టెస్ట్ కోసం, ఒక విధంగా చెప్పాలంటే న్యూస్ పేపర్ మొత్తం చదువుతూ ఉండాలి).
- మెయిన్స్ ఎగ్జామ్‌లో ఉన్న నాలుగు ఆబ్జెక్టివ్ తరహా టెస్ట్‌లకి ఉన్న మొత్తం ప్రశ్నలు 155, కేటాయించిన మార్కులు 200. ఇదే కాకుండా డిస్క్రిప్టివ్ టెస్ట్‌కి 25 మార్కులు ప్రత్యేకంగా కేటాయించారు. డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో ఆంగ్లంలో ఒక వ్యాసం రాయాలి, ఒక లెటర్ రైటింగ్ (ఉత్తరం రాయటం) ఉంటాయి. డిస్క్రిప్టివ్ టెస్ట్ కూడా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. డిస్క్రిప్టివ్ టెస్ట్‌కి కేటాయించిన సమయం 30 నిమిషాలు. అంటే మెయిన్స్‌లో ఉన్న మొత్తం 5 టెస్ట్‌లకు మొత్తం మార్కులు 225 అనుకోవచ్చు. అభ్యర్థులు గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే, మెయిన్స్ ఎగ్జామ్‌లో ఏ టెస్ట్‌కి ఆ టెస్ట్ ప్రకారం సమయం కేటాయించారు. ఆ సమయంలోనే ఆ టెస్ట్‌ని ఆన్సర్ చేయాలని.
- రాంగ్ ఆన్సర్‌లకు పెనాల్టీ : (ఇది ప్రిలిమినరీ ఎగ్జామ్‌లోనూ, మెయిన్స్ ఎగ్జామ్‌లోనూ ఉంటుంది, అన్ని ఆబ్జెక్టివ్ టెస్ట్‌లలో). ప్రతి రాంగ్ ఆన్సర్‌కి 1/4 లేక 0.25 మార్కులు (ఆ ప్రశ్నకి కేటాయించిన మార్కులలో) మైనస్ చేస్తారు.
- జనవరి/ఫిబ్రవరి 2018లో మెయిన్స్ పరీక్ష పాసయిన వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. దీనిలో కూడా ఉత్తీర్ణులు కావాలి(80:20 నిష్పత్తిలో మెయిన్స్‌లో వచ్చిన మార్కులకి, ఇంటర్వ్యూ మార్కులకి వెయిటేజ్ ఇస్తారు)
- ప్రకటించిన ఖాళీలు 2018-19లో భర్తీ చేస్తారు

బ్యాంకు పరీక్షల్లో రీజనింగ్ ఎబిలిటీ అనేది చాలా క్లిష్టమైన టెస్ట్‌గా మారుతోంది. రోజు రోజుకి ప్రశ్నలను అడిగే తీరు తెన్నులు మారుతున్నాయి. పజిల్స్ రూపంలో ఎక్కువ ప్రశ్నలు ఇస్తున్నారు. పజిల్స్‌ను సాల్వ్ చేయడం సులభమే. అయితే దానిలో అంతర్గతంగా చేరుస్తున్న వివిధ కోణాల వల్ల చాలా సమయం వృథా అవుతోంది. ఇప్పుడు రీజనింగ్ టెస్ట్‌లోనే కంప్యూటర్ ఆప్టిట్యూడ్ చేర్చారు. గతంలో కంప్యూటర్ నాలెడ్జ్ అనే పేరుతో ఒక టెస్ట్ విడిగా ఉండేది. ఇప్పుడు కంప్యూటర్ ఆప్టిట్యూడ్ అంటూ, రీజనింగ్ టెస్ట్‌లో భాగం చేశారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలి. కంప్యూటర్ ఆప్టిట్యూడ్‌లో బ్యాంకు పరీక్షల్లో కనిపిస్తున్న ప్రశ్నలలో ఎక్కువ భాగం బైనరీ సంఖ్యలను డెసిమల్ సంఖ్యలుగా మార్చటం వంటివి ఉంటున్నాయి. కంప్యూటర్ ఆప్టిట్యూడ్ అంశం కింద ఎస్‌బిఐ పీఓ మెయిన్స్ ఎగ్జామ్‌లో టెస్ట్ ఆఫ్ రీజనింగ్‌లో భాగంగా 5 ప్రశ్నల వరకు ఇస్తున్నారు.ఇలాంటి లెక్కలు 10వ తరగతి గణితశాస్త్రం టెక్స్ట్ బుక్‌లో ఉంటాయి.

2016లో ఐబిపిఎస్ నిర్వహించిన ప్రొబేషనరీ ఆఫీసర్ ప్రిలిమ్స్ ఎగ్జామ్‌లో తీసుకున్న కట్ ఆఫ్ మార్కులు-

IBPS PO 2016	English language	Reasoning Ability	Quantitative Aptitude
Maximum Score	30	35	35
Cutoff Score required for provisional shortlisting for main Examination (జనరల్ కేటగిరి)	07.00	08.50	08.25

2016లో ఐబిపిఎస్ నిర్వహించిన ప్రొబేషనరీ ఆఫీసర్స్ మెయిన్ ఎగ్జామ్‌లో తీసుకున్న కట్ ఆఫ్ మార్కులు-

S.No.	IBPS	OBC	UR
1	IBPS CWE PO VI-2016 (provisional)	52.50 (out of 200)	52.50 (out of 200)

నోటిఫికేషన్

మొత్తం ఖాళీలు: 3562
జనరల్ వర్గానికి 1738 పోస్టులు కేటాయించారు. ఎస్సీలకు 578, ఎస్టీలకు 285, ఒబిసిలకు 961 పోస్టులు ఉన్నాయి.
పార్టిసిపేట్ చేస్తున్న బ్యాంకులు - ఖాళీలు: అలహాబాద్ బ్యాంక్ 235, ఆంధ్రా బ్యాంక్ 625, బ్యాంక్ ఆఫ్ ఇండియా 200, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 100, కెనరా బ్యాంక్ 1350, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 100, కార్పొరేషన్ బ్యాంక్ 100, యూకో బ్యాంక్ 530, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 322
అర్హత: సెప్టెంబరు 5 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఆగస్టు 1 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి
ప్రిలిమినరీ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష సమయం గంట. మొత్తం మార్కులు 100. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 30, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 35, రీజనింగ్ ఎబిలిటీ నుంచి 35 ప్రశ్నలు ఇస్తారు. ప్రిలిమినరీలో అర్హత పొందినవారిని మెయిన్ ఎగ్జామ్ కోసం షార్ట్ లిస్ట్ చేస్తారు
మెయిన్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష సమయం మూడున్నర గంటలు. మొత్తం మార్కులు 225. మొదటి మూడు గంటల సమయంలో రీజనింగ్ & కంప్యూటర్ ఆప్టిట్యూడ్ నుంచి 45ప్రశ్నలు(60 మార్కులు), జనరల్ / ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ నుంచి 40(40 మార్కులు), ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 35(40 మార్కులు), డేటా అనాలిసిస్ & ఇంట్రప్రిటేషన్ నుంచి 35 (60 మార్కులు) ప్రశ్నలు ఇస్తారు. దీని తరవాత ఇంగ్లీష్ లాంగ్వేజ్ (లెటర్ రైటింగ్ & ఎస్సే) పేపర్ ఉంటుంది. ఈ పేపర్‌కు అర్ధగంట సమయం ఇస్తారు. ఈ పేపర్ కు 25 మార్కులు కేటాయించారు.
ఇంటర్వ్యూ వివరాలు: మార్కులు 100. అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు తెచ్చుకోవాలి. మెయిన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ వెయిటేజీని 80:20గా నిర్ణయించారు.
ఆన్‌లైన్ ప్రిలిమినరీ ఎగ్జామ్ : అక్టోబరు 7, 8, 14, 15
ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామ్ తేదీ: నవంబరు 26
ఇంటర్వ్యూలు: జనవరి & ఫిబ్రవరిలో
ప్రొవిజనల్ అలాట్‌మెంట్: ఏప్రిల్‌లో
దరఖాస్తు ఫీజు: రూ.600(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు రూ.100)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 5
వెబ్‌సైట్: www.ibps.in

- ప్రాతూరి పోతయ్యశర్మ

ఐఐటి ఖరగ్‌పూర్‌లో ఎంప్రెసారియో

మన దేశంలో మంచి పేరున్న ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో ఐఐటి ఖరగ్‌పూర్ ఒకటి. కొన్నేళ్ళుగా ఏటా అంతర్జాతీయ స్థాయిలో పోటీలను నిర్వహించడం ఈ సంస్థకు ఆనవాయితీగా మారింది. అందులో భాగంగానే గ్లోబల్ బిజినెస్ మోడల్ కాంపిటేషన్ 'ఎంప్రెసారియో'ను ఈ సారి నిర్వహించనుంది. 2018 అంటే వచ్చే ఏడాది జరగనున్న ఈ పోటీని ఐఐటికి చెందిన ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెల్ చేపట్టింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ పోటీలో సహ నిర్వాహకులుగా స్టాన్‌ఫోర్డ్, హార్వర్డ్, బ్రిగ్‌హాం యూనివర్సిటీలు ఉన్నాయి. అలాగే ఐబిఎంసి అధికారిక క్వాలిఫయిర్‌గా ఎంప్రెసారియో ఉంది. ఇందులో అన్ని కేటగిరుల్లో బెస్ట్‌గా ఎంపికైన ఎంట్రీలకు చెందిన వారికి స్పాన్సర్డ్ ట్రిప్ ఉంటుంది. అలాగే విదేశాల్లో జరిగే ఐబిఎంసి - 2018 క్వార్టర్ ఫైనల్స్‌లో పాల్గొనే అవకాశం కూడా కల్పిస్తారు. వివరాలకు వెబ్‌సైట్ www.ecell-iitkgp.org/empresariofor చూడవచ్చు.

ఈ పోటీకి ఎంపికైన వారికి మెంటార్‌షిప్ సౌకర్యం లభిస్తుంది. అలాగే పెద్ద వర్సిటీల వైస్ ఛాన్సలర్లు, ఇన్వెస్టర్ల ఎదుట తమ ఆలోచనలను పంచుకొనే అవకాశం కలుగుతుంది. నేషనల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ నెట్‌వర్క్ సహా న్యాయ సలహా, టాక్సేషన్, ఆర్థిక వెసులుబాటు, సాంకేతిక అంశాలు, మానవ వనరుల అవసరాలు తదితరాలపై పార్టిసిపెంట్‌లకు మెంటార్‌షిప్ అవకాశం కలుగుజేస్తారు. ప్రొడక్ట్ అండ్ సర్వీస్, ప్రొడక్ట్ డిజైన్, సామాజిక కేటగిరుల్లో వ్యాపార ఆలోచనలను స్వీకరిస్తారు. అన్ని కేటగిరుల్లో అందే అన్ని ఎంట్రీలను సమానంగానే పరిగణించి పాతిక లక్షల రూపాయల మేర ప్రైజ్‌లుగా అందిస్తారు. ఇంక్యుబేషన్ మనీగా రూ.రెండున్నర కోట్లు కేటాయించారు.

ఐఐటి ఖరగ్‌పూర్‌కు చెందిన ఎంట్రప్రెన్యూర్‌షిప్ సెల్ పూర్తిగా విద్యార్థులు నిర్వహిస్తున్న సంస్థ. విద్యార్థుల్లో ఎంట్రప్రెన్యూర్‌షిప్‌ను మోటివేట్ చేసేందుకు దీన్ని ఉద్దేశించారు. ఈ పదేళ్ళలో సుమారు 60 వరకు స్టార్టప్‌ల ఏర్పాటుకు ఈ సెల్ తోడ్పాటు అందించింది.

ఈ పోటీలో మొదట ఇచ్చిన ప్రశ్నావళిని పార్టిసిపెంట్స్ నింపాల్సి ఉంటుంది. అందులో భాగంగానే తమ వ్యాపారపరమైన ఆలోచనలనూ సమర్పించాలి. ప్రశ్నావళి ఈ వెబ్‌సైట్ www.ecell-iitkgp.org/empresarioలో ఉంటుంది. ఇప్పటికిప్పుడు ఈ పోటీకి నమోదు చేసుకున్న వారికి ఎర్లీబర్డ్ సౌకర్యాలను అందిస్తారు. ఆఫ్‌లైన్ మెంటారింగ్ వంటివి అందులో భాగం. గతంలో ఎంపికైన స్టార్టప్స్‌లో స్వాజీన్ (హెల్త్‌కేర్- పర్సనలైజ్డ్ మెడిసిన్స్), జెఎఎన్‌సిహెచ్ హెల్త్ కేర్ (రోగ నిర్ధారణ తదితరాలు), గేమ్‌జాప్ (ఒక యాప్‌తో వంద గేమ్స్) కొన్ని. ఐఐటి ఖరగ్‌పూర్ చేపట్టే ఈవెంట్లలో ఇది చాలా కీలకమైనది.

ప్రాజెక్టుల భారం మరో రూ.1.71 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: 'ఆలస్యం అమృతం విషం' అనే విషయం మౌలిక ప్రాజెక్టుల విషయంలోనూ నిజమవుతోంది. అనుమతులు పొందడంలో ఆలస్యంతో సహా వివిధ కారణాలతో ఈ ఏడాది మార్చినాటికి 322 ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం రూ.1.7 లక్షల కోట్లు పెరిగిపోయింది. కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంఒఎస్‌పిఐ) ఒక నివేదికలో ఈ విషయం పేర్కొంది. రూ.150 కోట్లు అంతకంటే ఎక్కువ అంచనాతో చేపట్టిన 1,231 ప్రాజెక్టులను పరిశీలించి ఈ నివేదిక రూపొందించారు. నిజానికి ఈ ప్రాజెక్టులను రూ.15,59,571 కోట్ల అంచనాతో రూపొందించారు. అయితే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యే సరికి మొత్తం ఖర్చు 11 శాతం వరకు పెరిగి రూ.17,31,162 కోట్లకు చేరుతుందని అంచనా. ఈ 1,231 ప్రాజెక్టుల్లో ఇప్పటికే 322 ప్రాజెక్టుల వ్యయ అంచనాలను మించిపోయాయి.



గుదిబండగా మారిన ఎగవేతలు

ఎస్‌బిఐ నెత్తిన రూ.25,104 కోట్ల భారం

న్యూఢిల్లీ: ఉద్దేశపూర్వక ఎగవేతలతో (విల్‌ఫుల్ డిఫాల్ట్స్) ప్రభుత్వ రంగ బ్యాంకులు(పిఎస్‌బి) కుంగిపోతున్నాయి. ఈ సంవత్సరం మార్చి నాటికి 8,915 మంది ఎగవేతదారులు పిఎస్‌బిలకు రూ.92,376 కోట్ల రుణాలు ఎగవేశారు. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఎగవేతదారుల సంఖ్య పది శాతం మాత్రమే పెరిగినా, ఎగవేసిన మొత్తం మాత్రం 20.4 శాతం పెరిగింది. ఇందులో ఎస్‌బిఐ దాని ఐదు అనుబంధ బ్యాంకులపైనే రూ.25,104 కోట్ల భారం పడింది. మొత్తం ఉద్దేశపూర్వక ఎగవేతల్లో ఇది 27 శాతానికి సమానం. మరో పిఎస్‌బి పిఎన్‌బిపైనా రూ.12,278 కోట్ల ఎగవేతల భారం పడింది. ఇలాంటి మొత్తం ఎగవేతల్లో 40 శాతం (రూ.37,382 కోట్లు) భారం ఈ రెండు బ్యాంకులపై పడిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ ఒక నివేదికలో పేర్కొంది.

ఈ సంవత్సరం మార్చినాటికి 1,762 మంది ఎస్‌బిఐ, దాని అనుబంధ బ్యాంకులకు టోపి పెడితే, పిఎన్‌బికి 1,120 మంది టోపీ పెట్టారు. దీంతో గత ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి 1,914 కేసుల్లో రూ.312,484 కోట్ల బకాయిల వసూలు కోసం పిఎస్‌బిలు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశాయి.

బకాయిల రద్దులో పెరుగుదల

బకాయిల వసూలు కోసం కఠిన చర్యలు తీసుకోవాల్సిన బ్యాంకులు, కొంత మంది విషయంలో చేతులెత్తేస్తున్నాయి.తమ ఖాతాల్లోంచి ఏకంగా ఈ బకాయిలు రద్దు చేస్తున్నాయి. 2016-17లో ఎస్‌బిఐ, దాని ఐదు అనుబంధ బ్యాంకులతో సహా 27 పిఎస్‌బిలు ఇలా రూ.81,683 కోట్ల బకాయిలు రద్దు చేశాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 41 శాతం ఎక్కువ. గత ఐదేళ్లలో పిఎస్‌బిలు ఎన్నడూ ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు రద్దు చేయలేదు. దీంతో పిఎస్‌బిల స్థూల మొండి బకాయి(ఎన్‌పిఎ)ల భారం చాంతాడులా పెరిగిపోతోంది. ఈ సంవత్సరం మార్చినాటికి వీటి స్థూల ఎన్‌పిఎల భారం రూ.5.02 లక్షల కోట్ల నుంచి రూ.6.41 లక్షల కోట్లకు పెరిగింది.

నిబంధనలు కఠినతరం

ఉద్దేశ పూర్వక ఎగవేతలు పెరిగిపోవడంతో ఆర్‌బిఐ నిబంధనలు కఠినం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఈ తరహా ఎగవేతదారుల పేర్లు ఫొటోలతో సహా ప్రచురించి అవమానించేందుకు (నేమ్ అండ్ షేమ్) బ్యాంకులను అనుమతించింది. ఎవరైనా ఒక కంపెనీ ప్రమోటర్ బ్యాంకుల నుంచి రుణం తీసుకుని చెల్లించకుండా ఎగవేస్తే, ఆ కంపెనీలో అతడు హోల్ టైమ్ డైరెక్టర్ కాకపోయినా అతడిని ఉద్దేశపూర్వక ఎగవేతదారుడిగా ప్రకటించేందుకు వీలుగా నిబంధనలు సవరించింది. రుణాలు చెల్లించగల స్థోమత ఉండి కూడా చెల్లించక పోవడం, లేదా బ్యాంకులకు తెలియకుండా ఉన్న ఆస్తులను అమ్ముకుని వాటిని స్వాహ చేయడాన్ని ఉద్దేశపూర్వక ఎగవేతలుగా పరిగణిస్తారు.

మరింత దూకుడుగా అమెరికా మార్కెట్లోకి..

యూరప్‌లోని కొత్త మార్కెట్లలోకి ప్రవేశం

అరబిందో ఫార్మా వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా మార్కెట్లో ఉత్పత్తుల పోర్టుఫోలియోను మరింతగా విస్తరించేందుకు అరబిందో ఫార్మా రెడీ అవుతోంది. వచ్చే మూడు నాలుగేళ్ల కాలంలో కంపెనీని మరింత వృద్ధిపథంలోకి తీసుకువెళ్లేందుకుగాను యూరప్‌లోకి కొత్త మార్కెట్లలోకి ప్రవేశించటంతో పాటు ప్రొడక్ట్ పోర్టుఫోలియోను విస్తృతం చేయాలని చూస్తున్నట్లు ఇన్వెస్టర్ ప్రెజెంటేషన్‌లో అరబిందో ఫార్మా వెల్లడించింది. అమెరికా మార్కెట్లో ఇంజెక్టబుల్, ఒటిసి సహా హయ్యర్ కాంప్లెక్సిటీ ఉత్పత్తుల్లో వృద్ధికి గణనీయమైన అవకాశాలుండటంతో ఈ విభాగంలో ఉత్పత్తులను పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపింది. ఇదే సమయంలో యూరప్‌లోని ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, స్పెయిన్, యుకెల్లోని స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవటంతో పాటు పోలండ్, చెక్ రిపబ్లిక్ వంటి కొత్త మార్కెట్లలోకి అడుగుపెట్టాలని చూస్తున్నట్లు పేర్కొంది. అమ్మకాల పరంగా అమెరికాలో ఇప్పటికే అరబిందో ఫార్మా ఆరో అతిపెద్ద సంస్థగా ఉందని, ఈ స్థానాన్ని మరింతగా పెంచుకునేందుకు ఇంజెక్టబుల్, ఒటిసి ఔషధాలు దోహదకారిగా ఉండనున్నాయని తెలిపింది. మరోవైపు అంతర్జాతీయంగా కన్స్యూమర్ బేస్ పెంచుకునేందుకు మరిన్ని భాగస్వామ్యాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఎపిఐ), ఫార్ములేషన్ మాన్యుఫ్యాక్చరింగ్, సప్లయ్ చెయిన్, డిస్ట్రిబ్యూషన్ విభాగాల్లో వచ్చే నాలుగేళ్లలో కీలకంగా ఉండనున్నాయని తెలిపింది.

సరికొత్త వ్యూహంతో..

అమెరికా మార్కెట్లో ఇంజెక్టబుల్స్, ఆప్తాల్మిక్స్, స్పెషాలిటీ ఉత్పత్తుల కోసం వ్యూహాత్మకమైన విధానాన్ని అమలు చేయాలని చూస్తున్నట్లు ఇన్వెస్టర్ ప్రెజెంటేషన్‌లో అరబిందో వెల్లడించింది. మరోవైపు అనుబంధ సంస్థ నాట్రోల్ ద్వారా డైటరీ సప్లిమెంట్స్ వ్యాపారాన్ని మరింత విస్తరించాలని యోచిస్తున్నట్లు తెలిపింది. ఎంపిక చేసిన ఈశాన్య యూరోపియన్ మార్కెట్లలో కొత్త ఔషధాల విడుదలతో మార్కెట్ వాటాను పెంచుకోవాలని చూస్తున్నట్లు పేర్కొంది. జెనరిక్ ఔషధాలకు అంతగా డిమాండ్ లేని ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్ వంటి తదితర దేశాల్లో వచ్చే మూడు నాలుగేళ్లలో ఈ పోర్టుఫోలియోను విస్తరించటం ద్వారా మరింత వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. మరోవైపు బ్రాండెడ్ జెనరిక్స్‌కు ఉక్రెయిన్, మెక్సికో, టాంజానియా, కొలంబియా, దక్షిణాఫ్రికా, కెనడా, బ్రెజిల్, గల్ఫ్ దేశాలు రానున్న సంవత్సరాల్లో కీలక చోదక శక్తులుగా ఉండనున్నాయని అరబిందో తెలిపింది.

సరఫరా విలువ ఎలా నిర్ధారించాలి?

జీఎస్‌టిలో ఒక సరఫరా విలువ ఎలా నిర్ధారించాలి? అన్న విషయాన్ని పరిశీలిద్దాం. అంటే ఏదేనీ వ్యాపారస్తుడు తన సరుకును వేరొక వ్యక్తికి విక్రయించినప్పుడు లేదా ఏదేనీ సర్వీస్ అందించినప్పుడు, ఆయా వస్తువులకు లేదా సేవలకు సంబంధించిన విలువను ఎలా నిర్ధారించాలి. అందులో కలపాల్సిన అంశాలేమిటి, తీసివేయగలిగిన అంశాలేమిటి? డిస్కౌంట్లు ఇచ్చినపుడు విలువ ఎంత చూపాలి, పాత వస్తువును ఎక్స్ఛేంజీ కింద తీసుకుని కొత్త వస్తువు ఇచ్చినపుడు విలువ ఎంత చూపాలి. ఇవన్నీ జీఎస్‌టిలో ఉన్న వ్యాపారస్తులు కచ్చితంగా తెలుసుకోవాలి. ఎందుకంటే ఈ విలువ మీద ఆధారపడి పన్ను వసూలు చేయటం, కట్టడం ఉంటుంది కాబట్టి. మరి ఈ విలువను ఎలా నిర్ణయించాలో చూద్దాం.

ఇదీ జీఎస్‌టీ

జీఎస్‌టిలో సరఫరా విలువని ట్రాన్సాక్షన్ వాల్యూ అంటారు. మరి ట్రాన్సాక్షన్ వాల్యూ అంటే ఏమిటి? ఏదేనీ సరఫరా జరిగినపుడు సరఫరాదారుడు, కొనుగోలుదారుడు మధ్య ఎలాంటి సంబంధం లేదా బంధుత్వం గానీ లేకుండా నిజమైన సరఫరా జరిగినప్పుడు చెల్లించే విలువనే ట్రాన్సాక్షన్ వాల్యూగా వ్యవహరిస్తారు. అంటే ఆ విలువ మీద సరఫరాదారుడు ఇన్వాయిస్ ఇవ్వాల్సి ఉంటుంది. పన్ను కట్టాల్సి ఉంటుంది. ట్రాన్సాక్షన్ వాల్యూలో కచ్చితంగా కలపాల్సిన అంశాలు.. జీఎస్‌టి కింద విధించిన పన్నులు మినహాయించి వేరే ఏమైనా పన్ను, డ్యూటీ, సెస్, ఫీజు మొదలైనవి సరఫరాదారుడు కొనుగోలుదారుని నుంచి విడిగా తీసుకుంటే వీటిని కూడా ట్రాన్సాక్షన్ వాల్యూల కలపాలి. అలాగే సరఫరాదారుడు చెల్లించాల్సిన మొత్తంలో అతని తరపున కొనుగోలుదారుడు చెల్లించినప్పటికీ ఆ విలువ కూడా ట్రాన్సాక్షన్ వాల్యూలో చూపాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి తన ఇంటికి రంగులు వేయించటానికి 25,000 రూపాయలకు ఒక పెయింటింగ్ దుకాణంతో బేరం కుదుర్చుకున్నాడు. ఆ దుకాణదారుడు 20 వేల రూపాయలు తాను తీసుకుని 5,000 రూపాయలు తన తరపున పెయింట్ వేయటానికి వచ్చిన వ్యక్తులకు ఇవ్వాల్సిందిగా ఆ వ్యక్తిని కోరాడనుకుందాం. అంటే ఇప్పుడు ఆ వ్యక్తి ఇచ్చిన 5,000 రూపాయలు నిజానికి దుకాణదారుడు పెయింటర్స్‌కు ఇవ్వాల్సిన మొత్తం. కాబట్టి ట్రాన్సాక్షన్ వాల్యూలో 5,000 రూపాయలు కూడా కలిపి మొత్తం 25,000 రూపాయలుగా చూపించాలి. అంతేకాని తాను కేవలం 20,000 రూపాయలు మాత్రమే తీసుకున్నాడు కాబట్టి ఇన్వాయిస్ 20 వేల రూపాయలకు ఇవ్వరాదు. అలాగే సరఫరాకు సంబంధించి ఇతరత్రా ఖర్చులు ఏమైనా అంటే ప్యాకింగ్ లాంటివి ఏమైనా కొనుగోలుదారుని నుంచి వసూలు చేస్తే ఆ మొత్తం కూడా ట్రాన్సాక్షన్ వాల్యూలో కలపాలి. ఇంకా దుకాణదారుడు ఏమైనా డిస్కౌంట్స్ ఇస్తే అవి సరఫరా జరిగిన సమయానికి లేదా సరఫరా కంటే ముందుగాని ఇచ్చి ఆ వివరాలను సంబంధిత ఇన్వాయిస్‌లో నమోదు చేస్తే అట్టి డిస్కౌంట్ విలువను ట్రాన్సాక్షన్ వాల్యూ నుంచి తగ్గించి చూపవచ్చు. అలాకాకుండా ఒక్కొక్కసారి సరఫరా జరిగిన తర్వాత కూడా డిస్కౌంట్ ఇస్తుంటారు.

ఉదాహరణకు నెలలోపులో చెల్లించాల్సిన మొత్తం చెల్లిస్తే కొంత మొత్తం డిస్కౌంట్ రూపంలో ఇస్తామని చెబుతుంటారు. అలాంటి డిస్కౌంట్స్‌ను ట్రాన్సాక్షన్ వాల్యూలో తగ్గించాలంటే మాత్రం దానికి తగినట్లు అగ్రిమెంట్ ముందే ఎంటర్ అయి ఉండాలి. అలాగే ఆ డిస్కౌంట్ విలువకు సరిపోయే ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను కొనుగోలుదారుడు తీసుకోరాదు లేదా రివర్స్ చేసి ఉండాలి. అలాగే పాత వస్తువులను తీసుకుని కొత్త వస్తువులను కొంత ధర తగ్గించి ఎక్స్ఛేంజీ ఆఫర్‌లో విక్రయిస్తుంటారు. అలాంటప్పుడు కూడా కొత్త వస్తువుల అసలు విలువని.. అంటే ఎక్స్ఛేంజీ ఆఫర్ లేకుంటే ఎంత విలువకు విక్రయిస్తారో ఆ విలువని ట్రాన్సాక్షన్ వాల్యూ కింద తీసుకోవాలి. జీఎస్‌టికి సంబంధించిన వీడియోల కోసం https://google/bzX8s1 చూడవచ్చు.

9800 దిగువన స్వల్పకాలిక బలహీనత

వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మైనర్ రికవరీలో ప్రారంభమై కీలక స్థాయి 9900 వద్ద రియాక్షన్ అనంతరం సైడ్‌వేస్‌లో పరిమిత పరిధిలోనే కదలాడింది. టెక్నికల్‌గా 9700 వద్ద గల మద్దతు స్థాయి నుంచి మైనర్ రికవరీ సాధించింది. వీక్లీ చార్టుల్లో కూడా గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల మధ్యలో క్లోజ్ కావడం రానున్న రోజుల్లో మరింత కన్సాలిడేషన్ లేదా మరింత కరెక్షన్ ఉంటుందనేందుకు సంకేతం. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ అప్రమత్తంగానే ఉన్నందు వల్ల మరికొద్ది రోజుల కదలికల అనంతరమే తదుపరి దిశ స్పష్టం అవుతుంది. స్వల్పకాలిక ఓవర్‌బాట్ స్థితిని సద్దుబాటు చేసుకున్నా నెలవారీగా మాత్రం ఇంకా ఓవర్‌బాట్‌లోనే ఉంది.

బుల్లిష్ స్థాయిలు...

రానున్న రోజుల్లో అప్రమత్త ట్రెండ్ కొనసాగే ఆస్కారం ఉంది. మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించాలంటే కీలక నిరోధ స్థాయి 9900 కన్నా పైన నిలదొక్కుకోవాలి. గత వారం ఇక్కడ మైనర్ హై ఏర్పడింది. తదుపరి టార్గెట్ 10000. గత కొద్ది రోజుల్లో మార్కెట్ ఇక్కడే విఫలమవుతోంది. ఆ పైన క్లోజయినపుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగుతుంది.

బేరిష్ స్థాయిలు...

మరింత కరెక్షన్ కొనసాగినా తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు నిలబెట్టుకునేందుకు ప్రధా మద్దతు స్థాయి 9800 వద్ద రికవరీ సాధించాలి. అంతకన్నా దిగువన క్లోజయితే మరింత బలహీనతకు ఆస్కారం ఉన్నట్టు సంకేతం ఇస్తుంది. తదుపరి టార్గెట్ 9700. అంతకన్నా దిగజారితే మరింత డౌన్‌ట్రెండ్ ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 9500.

- బ్యాంక్ నిఫ్టీ ప్రస్తుత మద్దతు స్థాయి 24000 వద్ద కన్సాలిడేట్ అవుతోంది. ప్రధాన నిరోధం 24500. గత వారం ఏర్పడిన మైనర్ హై, టాప్ ఇదే. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 23800. ఇంతకన్నా పైన నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక కరెక్షన్ ప్రమాదం ఉంటుంది. దిగువ టార్గెట్లు 23400, 23000.

స్వల్పకాలిక వ్యూహం: 9800 వద్ద బలమైన కన్సాలిడేషన్ అనంతరమే స్వల్పకాలిక ట్రేడర్లు స్వల్పకాలిక బై పొజిషన్లపై దృష్టి పెట్టవచ్చు. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ అప్రమత్తంగానే ఉండడం స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తోంది.

పాటర్న్: గత వారం ఇండెక్స్ 20 డిఎంఏ వద్ద పరీక్షకు గురైంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. 10000 వద్ద అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. నిఫ్టీ ప్రస్తుతం 9700 వద్ద ఏటవాలుగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ కన్నా స్వల్పంగా పైన ఉంది. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడ రికవరీ సాధించాలి. అలాగే ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న ట్రెండ్‌లైన్ కన్నా దిగువన ఉంది. అప్‌ట్రెండ్ కోసం ఆ రేఖ కన్నా పైకి రావాలి. మార్కెట్ 50 డిఎంఏ వద్ద రికవరీ సాధిస్తోంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

టైమ్: ఈ సూచిక ప్రకారం మంగళ, గురువారాల్లో స్వల్పకాలిక రివర్సల్స్ ఉన్నాయి.

సోమవారం స్థాయిలివే: నిరోధం: 9855, 9910 మద్దతు: 9800, 9750

వి.సుందర్ రాజా,
www.sundartrends.in

ఫ్యూచర్ షార్ట్ టర్మ్ ట్రేడింగ్ గైడ్

హిందుస్తాన్ యూనీలివర్ (రూ.1200) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..

రూ.1200 ఎగువన అప్‌ట్రెండ్ మొదటి నిరోధం రూ.1260 రెండో నిరోధం రూ.1320
రూ.1170 దిగువన డౌన్‌ట్రెండ్ మొదటి మద్దతు రూ.1130 రెండో మద్దతు రూ.1090

అంతర్జాతీయ సంకేతాలే కీలకం

"పరిమిత ట్రేడింగ్ దినాలు మాత్రమే ఉన్న ఈ వారంలో అంతర్జాతీయ సంకేతాలే మార్కెట్ దిశకు కీలకం కానున్నాయి. శుక్రవారం గణేశ్ చతుర్థి సందర్భంగా మార్కెట్లకు సెలవు".

మార్కెట్ నాడి

విజయ్ సింఘానియా
డైరెక్టర్, ట్రేడ్‌స్మార్ట్ ఆన్‌లైన్

కేవలం నాలుగే రోజులు ట్రేడింగ్ జరిగే ఈ వారంలో అంతర్జాతీయ సంకేతాలు, త్రైమాసిక ఫలితాలు, రుతుపవనాల పురోగతి మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయి. అలాగే డాలర్ మారకంలో రూపాయి కదలికలు, క్రూడాయిల్ ధరల కదలికలు కూడా మార్కెట్ దిశకు కీలకం అవుతాయి. ఈ ఏడాది ఇప్పటివరకు దేశంలో వర్షపాతం దీర్ఘకాలిక సగటుకన్నా 4 శాతం తక్కువగా ఉన్నట్టు వాతావరణ శాఖ ఆగస్టు 16వ తేదీన విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

క్యూ1 ఫలితాలివే: కేర్‌రేటింగ్స్, కాస్ట్రాల్ ఇండియా, ప్రోక్టర్ అండ్ గాంబుల్, జిల్లెట్ ఇండియా

- ఆగస్టు నెలకు తయారీ రంగం పిఎంఐ, సేవల రంగం పిఎంఐలను మార్కిట్ ఎకనామిక్స్ సంస్థ ఈ వారంలో ప్రకటించనుంది.

టెక్నికల్స్ ఇవే...

టెక్నికల్స్‌పరంగా చూస్తే షార్ట్ కవరింగ్ కారణంగా గత వారం మార్కెట్ మంచి రికవరీలో ప్రారంభమైనా వారాంతంలో రెండు రోజుల్లో అధోముఖ ధోరణిని పునరుద్ధరించుకుంది. 9800 పిఇ, 10000 సిఇ గరిష్ఠ ఓపెన్ ఇంటరెస్ట్ స్ట్రైక్‌లుగా యథాతథంగా నిలిచాయి. నిఫ్టీ ఎటిఎం/ఐటిఎం పుట్ ఆప్షన్ స్ట్రైక్‌లు అధికంగా ఉండడం షార్ట్ పొజిషన్లు తగ్గించుకుంటున్నారనేందుకు సంకేతం. అందుకే ఆప్షన్స్ కాంట్రాక్టుల్లో ఆటుపోట్లు అధికంగా ఉన్నాయి. 9800 పిఇ వద్ద 50.3 లక్షల షేర్లకు ఓపెన్ పొజిషన్లు ఏర్పడగా వాటిలో అధికంగా షార్ట్ పొజిషన్లే ఉన్నాయి. 9800 కన్నా దిగువన నిఫ్టీ క్లోజయితే తాజా షార్ట్ కవరింగ్ కొనసాగుతుందనేందుకు ఇది సంకేతం. అంటే మరింతగా ఇండెక్స్ దిగజారే ప్రమాదం ఉంటుంది. 9685 కన్నా దిగజారితే మాత్రం టాప్ హయ్యర్ బాటమ్ సైకిల్ పూర్తిగా ఛిద్రం అవుతుంది. ఎగువన 9940 వద్ద కీలక నిరోధ జోన్ ఉంది.

వారాంతం నిర్ణయాత్మకం

(ఆగస్టు 11-24 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 9837 (+126)

ఆస్ట్రో గైడ్

డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 9948-9752 పాయింట్ల మధ్యన విస్తృత పరిధిలో కదలాడి 126 పాయింట్ల లాభంతో (సుమారు 1.30 శాతం) వారం కనిష్ఠ స్థాయి 9837 వద్ద పాజిటివ్ దృక్పథంతో ముగిసింది.

- స్వల్పకాలిక ధోరణి బలహీనంగా మారింది. మధ్య, దీర్ఘకాలిక ధోరణులు రెండింటిలోనూ బుల్లిష్‌గానే ఉంది. 9950 కన్నా పైన ముగిసినప్పుడే తిరిగి బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 9958, 9791, 9568, 9025 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం 20, 50 డిఎంఏల కన్నా దిగువకు వచ్చింది. కాని 50 డిఎంఏ 200 డిఎంఏల కన్నా పైనే ఉంది. దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు ఇది సంకేతం.

వారానికి బ్రేకౌట్ స్థాయి: 9950

బ్రేక్‌డౌన్ స్థాయి: 9700

ఇన్వెస్టర్లకు సూచన: వారం ప్రారంభస్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

నిరోధ స్థాయిలు: 9985, 10060 (9910 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 9690, 9615 (9765 దిగువన బేరిష్)

మిడ్‌సెషన్ శక్తివంతం (సోమవారానికి)

తిథి: శ్రావణ బహుళ అమావాస్య

నక్షత్రం: ఆశ్లేష

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు: 10.10

ధోరణి: గ్రహగతులను బట్టి నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 10.20 తర్వాత మెరుగ్గా మారి 2.45 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. 2.45 నుంచి ముగింపు వరకు నిస్తేజంగా ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 2.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.40 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు: 9885, 9920

మద్దతు స్థాయిలు: 9795 9760

గ్రహగతులివే..

- కర్కాటకంలోని ఆశ్లేష పాదం 3 నుంచి కన్యలోని చిత్త పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- సింహంలోని మఖ పాదం 2,3 మధ్యలో రవి సంచారం
- సింహంలోని పుబ్బ పాదం 1 నుంచి మఖ పాదం 4 మధ్యలో వక్రగతిలో బుధ సంచారం
- మిథునంలోని పునర్వసు పాదం 1 నుంచి కర్కాటకంలోని పుష్యమి పాదం 1 మధ్యలో శుక్ర సంచారం
- కర్కాటకంలోని ఆశ్లేష పాదం 3,4 మధ్యలో నీచస్థితిలో కుజ సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4లో మీన నవాంశలో వక్రగతిలో శని సంచారం
- కన్యలోని చిత్త పాదం 1,2 మధ్యలో కన్య నవాంశలో బృహస్పతి సంచారం
- కర్కాటకంలో రాహువు, మకరంలో కేతువు మీన, కన్య నవాంశల్లో సంచారం

9, 11 తేదీల మధ్యలో చంద్రుడు కుంభం, మీన రాశుల్లో మార్కెట్ సంచరించిన సమయంలో ఏర్పడిన పరిధిలో

కనిష్ఠ స్థాయి 9686 కన్నా దిగజారితే మరింత కనిష్ఠ స్థాయిలకు రావచ్చు.

ఇ-స్కూటర్‌పై రూ.40 వేల సబ్సిడీ ఇవ్వాలి

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్‌తో నడిచే స్కూటర్ల (ఇ-స్కూటర్లు) అమ్మకాలను ప్రోత్సహించేందుకు ఒక్కో ఇ-స్కూటర్‌పై రూ.40,000 చొప్పున సబ్సిడీ ఇవ్వాలని పరిశ్రమ వర్గాలు కోరాయి. ఇందుకు అవసరమైన విధి విధానాలు రూపొందించాలని విద్యుత్ వాహనాల ఉత్పత్తిదారుల సంస్థ ఎస్ఎంఇవి నీతి ఆయోగ్‌ను కోరింది. అధిక ఇంధన సామర్థ్యం ఉండే లిథియం బ్యాటరీతో నడిచే ఇ-స్కూటర్ల ఆన్ రోడ్ ధర ప్రస్తుతం రూ.80,000 వరకు ఉంది. ఇందులో కనీసం రూ.40,000 ఉత్పత్తిదారులకు సబ్సిడీగా ఇచ్చేలా విధానాలు రూపొందించాలని ఎస్ఎంఇవి డైరెక్టర్ సోహిందర్ గిల్ నీతి ఆయోగ్ చీఫ్‌కు లేఖ రాశారు. విద్యుత్ వాహనాలపై జనానికి ఆసక్తి ఉన్నా, ధర ఎక్కువగా ఉండడంతో వాటి అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దేశంలో ఏటా 1.7 కోట్ల ద్విచక్ర మోటారు వాహనాలు అమ్ముడవుతుంటే అందులో విద్యుత్ బ్యాటరీతో నడిచే వాహనాల సంఖ్య పట్టుమని 20,000 మించడం లేదు. అందులోనూ 99 శాతం ఇ-స్కూటర్లు తక్కువ ధర ఉండే లో స్పీడ్ లెడ్ బ్యాటరీతో అమ్ముతున్నారు. ఈ పరిస్థితి నుంచి బయట పడాలంటే కనీసం ఏడాదిపాటు (2018) దేశంలో లిథియం బ్యాటరీతో అమ్మే ప్రతి ఇ-స్కూటర్‌పై రూ.40,000 సబ్సిడీ ఇవ్వాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలా వీలుకాని పక్షంలో ఆరు నెలల పాటు, అదీ వీలుగాకపోతే ఏటా అమ్మే ఇ-స్కూటర్లలో నిర్ణీత సంఖ్యకు సబ్సిడీ ఇవ్వాలని ఎస్ఎంఇవి కోరింది.

మార్చి నాటికి మరో మూడు విమానాలు

- ట్రూజెట్ వెల్లడి

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ప్రాంతీయ విమానయాన సంస్థ ట్రూజెట్.. వచ్చే ఏడాది మార్చి నాటికి విమానాల సంఖ్యను 8కి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. టర్బో మేఘా ఎయిర్‌వేస్ ప్రమోట్ చేసిన ట్రూజెట్.. ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) కింద ఇప్పటికే 18 రూట్లను చేజిక్కించుకుంది. అంతేకాకుండా ప్రస్తుతం రోజుకు నిర్వహిస్తున్న 31 విమాన సర్వీసులను సంవత్సరాంతం నాటికి యాభైకి చేర్చాలని చూస్తోంది. ప్రస్తుతం ఐదు ఎటిఆర్ విమానాలతో ట్రూజెట్ సేవలందిస్తుండగా ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి విమానాల సంఖ్యను ఏడెనిమిదికి పెంచాలని చూస్తున్నట్లు టర్బో మేఘా ఎయిర్‌వేస్ మేనేజింగ్ డైరెక్టర్ వి ఉమేష్ తెలిపారు. ఉడాన్‌లో భాగంగా రీజినల్ ఎయిర్ కనెక్టివిటీ (ఆర్‌సిఎస్) పథకం కింద వచ్చే నెలలో 18 రూట్లలో విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ పథకం కింద ఇప్పటికే హైదరాబాద్-కడప, హైదరాబాద్-నాందేడ్, నాందేడ్- ముంబై రూట్లలో విమాన సర్వీసులను ప్రారంభించినట్లు ఉమేష్ తెలిపారు.

రానున్న శీతాకాలంలో కొత్త విమాన సర్వీసులు లేదా డెస్టినేషన్లకు సర్వీసులు ప్రారంభించే యోచనేదీ లేదని ఆయన చెప్పారు. అయితే ఆర్‌సిఎస్ రూట్లలో మాత్రం సెప్టెంబరులో మాత్రం కొత్త విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకురాన్నుట్లు ఆయన పేర్కొన్నారు.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	వరంగల్	357.00
విజయవాడ	359.00	చెన్నై	397.00
గోదావరి	359.00	నమక్కల్	387.00
బెంగళూరు	382.00	చిత్తూరు	390.00
విశాఖపట్నం	362.00	ముంబై	400.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	86.00	గోదావరి	88.00
కరీంనగర్	87.00	విజయవాడ	88.00
వరంగల్	86.00	గుంటూరు	88.00
మహబూబ్‌నగర్	86.00	ఒంగోలు	90.00
కర్నూలు	86.00	చిత్తూరు	86.00
విశాఖపట్నం	79.00	నెల్లూరు	86.00

మల్లన్నసాగర్‌కు టెండర్లు ఖరారు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నిర్మాణానికిగాను రాష్ట్ర ప్రభుత్వం టెండర్లను ఖరారు చేసింది. రంగనాయకసాగర్, బస్వాపూర్, గంధమల వంటి రిజర్వాయర్ల నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు ఖరారయ్యాయి. దాదాపు 50 టీఎంసీల సామర్థ్యంతో మల్లన్నసాగర్, 15 టీఎంసీల సామర్థ్యంతో కొండపోచమ్మ రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి కాళేశ్వరం నుంచి నీటిని అందించాలనే లక్ష్యం పెట్టుకున్నారు.

మల్లన్నసాగర్ టెండర్ల వివరాలు

రీచ్	పని విలువ (కోట్లల్లో)	దక్కించుకున్న సంస్థ	పర్సంటేజ్
రీచ్-1	1822	ఆఫ్కాన్	3.9
రీచ్-2	1499	ఎల్అండ్‌టి	3.15
రీచ్-3	2046	రాఘవ	3.5
రీచ్-4	1436	హెచ్‌వివిఎస్	3.2

కొండపోచమ్మ రిజర్వాయర్ టెండర్ల వివరాలు

రీచ్	పని విలువ (కోట్లల్లో)	దక్కించుకున్న సంస్థ	పర్సంటేజ్
రీచ్-1	900	కెఎన్ఆర్	1.7 (మైనస్)
రీచ్-2	409	హెచ్‌విఎస్	1.8
రీచ్-3	566.11	సత్య ఇన్‌ఫ్రా	1,25
రీచ్-4	1825	మెగా	1 (మైనస్)

నీటిపారుదల శాఖలో హై అలర్ట్

- గండ్లు పడితే మరమ్మతులు చేపట్టాలి
- రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకోవాలి
- ఇంజనీర్లు ఫీల్డ్‌లోనే ఉండాలి: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటిపారుదల శాఖలో ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. చెరువులు, తూములు తెగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పరిస్థితిని ఆయన ఆన్‌లైన్, వాట్సాప్‌లలో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ విభాగాల సీఈలకు సూచనలు, సలహాలిస్తున్నారు. అత్యవసర పరిస్థితి దృష్ట్యా నీటిపారుదల శాఖ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. జిల్లాల్లో వర్షాలు భారీగా కురుస్తున్నందున చెరువులు తెగిపోయే ప్రమాదం ఉందని ఆ జిల్లాల సీఈలు, ఎస్ఈలను అప్రమత్తం చేశారు. ఇంజనీర్లంతా తమ హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలన్నారు. వర్షపాతాన్ని ప్రతి గంటకు నమోదు చేయాలని, సిమెంటు సంచులు, ఇసుక బస్తాలు నిల్వ ఉంచుకోవాలని సబ్ డివిజన్లను ఆదేశించారు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. చెరువులు, రిజర్వాయర్లలో నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు పంపాలన్నారు. కింది స్థాయి నుంచి సీఈ వరకు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని సమీక్షించాలన్నారు. రెవెన్యూ సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ చెరువుల రక్షణ చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా క్షమించేది లేదని మంత్రి హెచ్చరించారు. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ అత్యవసర పరిస్థితి తలెత్తగానే జిల్లా కలెక్టర్లకు, ఉన్నతస్థాయి అధికారులకు సమాచారమందించాలని ఇంజనీర్లను కోరారు. ముంపు పరిస్థితి తలెత్తితే రెవిన్యూ యంత్రాంగంతో సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

సరగసీ ఉత్తదే!

(మూడో పేజీ తరువాయి)

జన్మనిచ్చానని, తనను గుంటూరు దంపతులు మోసం చేశారంటూ ఆ తల్లి చెప్పిన మాటలు అవాస్తవాలని నిర్ధారణ అయింది. దాంతో, మహబూబ్‌నగర్ దంపతులపైనే కేసు నమోదుకు పోలీసులు సిద్ధమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఝాన్సీలక్ష్మి జూలై 18న పేట్లబురుజు ప్రసూతి ఆస్పత్రిలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కాన్పు కోసం ఆమె సుధారాణి పేరుతో ఆస్పత్రిలో చేరింది. కాన్పు తర్వాత ప్రభుత్వ పథకాలు అమలు చేయడానికి ఆధార్ కార్డు ఇవ్వాలని ఆస్పత్రి అధికారులు ఆమెను అడిగారు. వాటిని పరిశీలిస్తే ఆమె పేరు ఝాన్సీలక్ష్మి అని తేలింది. వైద్యులు ఆమెను విచారించగా, గుంటూరు దంపతులకు తాను సరగసీ ద్వారా బిడ్డకు జన్మినిచ్చినట్లు చెప్పింది. ఆస్పత్రి వైద్యులు అటు పోలీసులు, ఇటు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం అప్పట్లో కలకలం రేపింది. ఆ బిడ్డ తమది కాదని గుంటూరు దంపతులు చెప్పారు. డీఎన్ఏ పరీక్ష నిర్వహించిన తర్వాత ఆ బిడ్డ తమ బిడ్డే అని తేలితే తామే పెంచుకుంటామని స్పష్టం చేశారు. పరీక్షలేమీ అక్కర్లేదని, సరగసీ ద్వారా పుట్టినా ఆ బిడ్డను తామే పెంచుకుంటామని ఝాన్సీలక్ష్మి భర్త లక్ష్మణ్ చెప్పాడు. ఈ నేపథ్యంలోనే, ఈ దంపతులకు, శిశువుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలో వారి ముగ్గురి డీఎన్ఏలు సరిపోలాయి. దాంతో, ఆ బిడ్డ సరగసీ ద్వారా జన్మించలేదని తేలింది.

ఆడబిడ్డ పుట్టిందనే..!

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఝాన్సీలక్ష్మి, లక్ష్మణ్ దంపతులు. ఆమె భర్తతో విడిపోయి పెద్ద అంబర్‌పేటలో వేరుగా ఉంటోంది. విడిపోయే నాటికే ఆమె గర్భవతి. ఇంటి పక్కన ఉండే ఒక సరగసీ బ్రోకర్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. "గుంటూరుకు చెందిన దంపతులకు కూతురు ఉంది. ఆమెకు పిల్లల్లేరు. సరగసీ ద్వారా బిడ్డకు జన్మనివ్వాలని వారు కోరుతున్నారు. ఇందుకు మూడు లక్షలు ఇస్తారు" అని బ్రోకర్ ఆమెకు తెలిపింది. సరగసీ ద్వారా బిడ్డను కని ఇవ్వాలని కోరింది. అయితే, అప్పటికే ఆమె గర్భవతి కావడంతో, సరగసీ కాకపోయినా, ఝాన్సీలక్ష్మికి పుట్టిన బిడ్డను తీసుకునేందుకు గుంటూరు దంపతులు అంగీకరించారు. ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. అయితే, పుట్టబోయే బిడ్డ తమ కూతురుకు పుట్టిన బిడ్డగా చలామణీ కావాలని ఆ దంపతులు కోరుకున్నారు. ఇందులో భాగంగానే ఝాన్సీలక్ష్మి సరగసీ ద్వారా బిడ్డను మోస్తున్నట్లు ప్రచారం చేశారు. వాళ్ల అమ్మాయి పేరు సుధారాణి కావడంతో ఆమె పేరుతోనే ఝాన్సీలక్ష్మికి చికిత్స చేయించారు. ఏడు నెలలు వచ్చే వరకూ చికిత్స వ్యవహారాలన్నీ వాళ్లే చూసుకున్నారు. ఏడో నెల నుంచి పట్టించుకోవడం మానేశారు. అయితే, తనకు ఆడబిడ్డ పుడుతుందని గుంటూరు దంపతులు నిర్ధారించుకున్నారని, దాంతో ఏడో నెల నుంచి పట్టించుకోవడం మానేశారని ఝాన్సీలక్ష్మి తెలిపింది. చివరకు ఆమెకు పురిటి నొప్పులు రావడంతో పేట్ల బురుజు ఆస్పత్రిలో చేర్పించారు. అంతవరకూ సుధారాణి పేరుతో చికిత్సలు జరగడం, ఆధార్ కార్డులో ఝాన్సీలక్ష్మి పేరు ఉండడంతో ఆమెను విచారించారు. సరగసీ ద్వారా తాను బిడ్డను కన్నానని చెప్పిన ఝాన్సీలక్ష్మి.. రెండు ఆస్పత్రుల పేర్లు చెప్పింది. ఆ రెండు ఆస్పత్రుల్లోనూ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వాటిలో సరగసీ జరగలేదని నిర్ధారణ చేసుకున్నారు. పుట్టిన బిడ్డ, ఝాన్సీలక్ష్మిలకు జూలై 24న డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. భర్త లక్ష్మణ్ అందుబాటులో లేకపోవడంతో ఆగస్టు 1న అతనికి పరీక్షలు చేశారు. సరగసీ అంతా ఉత్తదేనని, దత్తత కోసం హైడ్రామా నడిపారని పోలీసులు నిర్ధారించుకున్నారు.

కమలం గూటికి జగన్!

(మూడో పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న 'రిపబ్లిక్ టీవీ' ఈ విషయం తెలిపింది. 'అత్యంత విశ్వసనీయ వర్గాల'ను ఉటంకిస్తూ... ఆదివారం ఈ కథనాన్ని ఇచ్చింది. "జగన్ బీజేపీతో చేతులు కలిపేందుకు అంతా సిద్ధమైంది. బీజేపీ నేతలతో ఆయన చర్చలు జరుపుతున్నారు. బీజేపీ అధిష్ఠానానికీ, జగన్‌కు మధ్య గాలి జనార్దన రెడ్డి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారు. జగన్‌ను ఆయనే బీజేపీలోని ముగ్గురు ముఖ్య నాయకుల వద్దకు తీసుకెళ్లారు. ఎన్డీయేలో భాగస్వామి అయ్యేందుకు జగన్ తన సమ్మతి తెలియచేశారు" అని రిపబ్లిక్ టీవీ తెలిపింది. కాగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించి బీజేపీ స్పష్టమైన రాజకీయ లక్ష్యాలను నిర్దేశించుకుంటోంది. "బరిలో నిలిచి పరుగు తీస్తూ ఉంటాం. పార్టీని బలోపేతం చేస్తూ వెళతాం. తెలుగుదేశంతో ఉండాలా? వైసీపీతో పొత్తు పెట్టుకోవాలా? అనేది ఎన్నికల నాటికి నిర్ణయిస్తాం" అని తాజాగా బీజేపీ జాతీయ స్థాయి నేత ఒకరు చెప్పారు. జగన్‌పై ఉన్న అవినీతి అభియోగాలను ఆయన తేలిగ్గా తీసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు ఎక్కువ సీట్లు ఇచ్చే వారే కావాలి అని ఒకింత సూటిగానే వెల్లడించారు. బీజేపీ అధిష్ఠానం నుంచి ఇలాంటి సంకేతాలు వెలువడిన మరుసటి రోజునే... 'ఎన్డీయేలోకి జగన్' అంటూ రిపబ్లిక్ టీవీ పేర్కొనడం విశేషం.

ఆటోలోనే మహిళ ప్రసవం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని కుర్నపల్లికి చెందిన ఇర్పా రమ్యకు పురిటి నొప్పులు రాగా, ఆటోలో సత్యనారాయణపురం ఆస్పత్రికి బయలుదేరారు. బోదనెల్లి గ్రామం దాటిన తర్వాత చింతగుప్ప వాగు వద్ద రమ్య ఆటోలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది ఆటో ఆగిపోవడంతో బాలింతను కష్టం మీద కుటుంబ సభ్యులు వాగు దాటించి భద్రాచలం వైద్యశాలకు తరలించారు. – చర్ల

ఏదైనా అమ్మేజాన్

(మూడో పేజీ తరువాయి)

నిబంధనలు పాటించాలి. విక్రయించే సంస్థకు లైసెన్స్ ఉండాలి. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో మందులు తెప్పించుకోవాలంటే డాక్టర్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్‌ను అప్‌లోడ్ చేయాలి. సదరు కంపెనీ ఆ ప్రిస్క్రిప్షన్ సరైందో కాదో పరిశీలించాలి. ఆ మందును సిఫారసు చేసిన ఆసుపత్రికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలి. నిజమైన డాక్టర్, నిజమైన పేషెంట్‌కు, నిజమైన వ్యాధికి ఆ మందు సిఫారసు చేశాడని నిర్ధారించుకోవాలి. ఆ తర్వాతే మందుల్ని డెలివరీ చేయాలి. కానీ అమెజాన్ సంస్థ ఈ నిబంధనలన్నింటినీ తోసి రాజని యథేచ్ఛగా సిల్డెనాఫిల్ టాబ్లెట్లను ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇళ్లకు డెలివరీ చేస్తోంది.

వయాగ్రా అనేది ఫైజర్ కంపెనీ అభివృద్ధి చేసిన టాబ్లెట్! దానిలో ప్రధానంగా ఉండేది సిల్డెనాఫిల్ సిట్రేట్ అనే రసాయనం. ఈ సిల్డెనాఫిల్‌ను ఒక్కో కంపెనీ ఒక్కో పేరుతో విక్రయిస్తోంది. సిలాగ్రా పేరుతో సిప్లా, కామాగ్రా పేరుతో అజంతా ఫార్మా, మ్యాన్‌ఫోర్స్ పేరుతో మ్యాన్‌కైండ్ కంపెనీలు సిల్డెనాఫిల్‌ను అమ్ముతున్నాయి. గుండె జబ్బు రోగులతోపాటు అనేక ఇతర వ్యాధులు ఉన్నవారు, కొన్ని రకాల టాబ్లెట్లు వాడుతున్నవారు సిల్డెనాఫిల్‌ను ఉపయోగించకూడదు. తేడా వస్తే అనేక దుష్పరిణామాలు, చివరికి మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంది. అయితే మ్యాన్‌కైండ్ కంపెనీకి చెందిన మ్యాన్‌ఫోర్స్ సిల్డెనాఫిల్ టాబ్లెట్లను అమెజాన్ యథేచ్ఛగా అమ్మకానికి పెట్టింది.

గూగుల్‌లో 'సిల్డెనాఫిల్ అమెజాన్ ఇండియా' అని టైప్ చేస్తే చాలు అమెజాన్.ఇన్ వెబ్‌సైట్‌లో మ్యాన్‌ఫోర్స్ టాబ్లెట్లకు సంబంధించిన లింక్ వచ్చేస్తోంది. ఆ లింక్ క్లిక్ చేసి టాబ్లెట్లను ఆర్డర్ చేసేయవచ్చు. కొన్ని ఔషధ కంపెనీల ద్వారా సిల్డెనాఫిల్ ఆర్డర్ చేయాలంటే ప్రిస్క్రిప్షన్‌ను అప్‌లోడ్ చేసి తీరాలి. అది నిజమైన ప్రిస్క్రిప్షనే అని ధ్రువీకరించాలి. కానీ అమెజాన్ వెబ్‌సైట్/యాప్‌లో ధ్రువీకరణ మాట దేవుడెరుగు... అసలు ప్రిస్క్రిప్షన్ కోసమే అడగడం లేదు. నేరుగా ఆర్డర్‌ను స్వీకరిస్తున్నారు. ఇంటికి డెలివరీ చేస్తున్నారు.

2014లో మహారాష్ట్రలో ఆన్‌లైన్ ద్వారా సిల్డెనాఫిల్‌ను విదేశాలకు అమ్ముతున్న అనేక కంపెనీలపై ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేసి 2 కోట్ల రూపాయల సరుకును పట్టుకున్నారు. కంపెనీలపై కేసులు నమోదు చేశారు. నకిలీ ప్రిస్క్రిప్షన్లు చూపి అమ్మకాలు సాగిస్తున్నట్టు ఈ కంపెనీలపై కేసులు నమోదయ్యాయి. అయితే అమెజాన్, మ్యాన్‌కైండ్‌లు అసలు ప్రిస్క్రిప్షనే లేకుండా విక్రయాలు జరుపుతుండడం గమనార్హం. ఆన్‌లైన్‌లో నేరుగా మందులు అమ్మడం చట్టప్రకారం నేరమని, ఆన్‌లైన్ సంస్థలు చట్టపరంగా అనుమతులు పొందడంతోపాటు ప్రిస్క్రిప్షన్ వంటి పలు నిబంధనలను పాటించి తీరాలని ఔషధ నియంత్రణ శాఖ అధికారి ఒకరు స్పష్టంచేశారు.

ఇవీ సైడ్ ఎఫెక్ట్స్

తలనొప్పి, ముఖం, ఛాతీ, చేతులు వేడెక్కడం, చూపు దెబ్బతినడం, వెలుతురును చూడలేకపోవడం, ప్రతిదీ రెండుగా కనపడటం, ఫొటో ఫోబియా (కాంతి అంటే భయపడడం), అన్నీ నీలిరంగులో కనపడటం, వినికిడి లోపం.

వీరు వాడుతున్నారు

అంగస్తంభన సమస్య ఉన్నవారు వైద్యుడి సిఫారసు మేరకు సిల్డెనాఫిల్‌ను ఉపయోగించాలి. సాధారణంగా 40-45 ఏళ్లు దాటిన వారిలో మాత్రమే అంగ స్తంభన సమస్య ఎక్కువగా ఉంటుంది. కానీ 25 ఏళ్ల యువత కేవలం సరదా కోసం వయాగ్రాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. స్వలింగ సంపర్కులు కూడా వీటిని అతిగా వాడుతున్నారు. కొందరు డ్రగ్ ఎడిక్ట్స్ సిల్డెనాఫిల్‌ను కొన్ని రకాల మాదక ద్రవ్యాలతో కలిపి తీసుకుంటున్నారు. ఇది మరింత ప్రమాదకరం.

ఇలా పనిచేస్తుంది

సిల్డెనాఫిల్ పురుషాంగంలోని రక్త నాళాలను వ్యాకోచింపజేస్తుంది. దీనివల్ల అంగంలోకి ఎక్కువగా రక్త ప్రసరణ జరిగి అంగం గట్టిపడుతుంది. టాబ్లెట్ వేసుకున్న 20-25 నిముషాల్లో దాని ప్రభావం మొదలవుతుంది. నాలుగైదు గంటల వరకూ కొనసాగుతుంది.

ఎన్నో ప్రమాదాలు

సిల్డెనాఫిల్ వాడకం వల్ల దృష్టి దోషాలు, వినికిడి లోపాలు ఏర్పడవచ్చనే విషయాన్ని 2007లోనే ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ నిర్ధారించింది. దీర్ఘకాలికంగా సిల్డెనాఫిల్ వాడే వారు పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. ఇది వేసుకున్న కొందరిలో పురుషాంగం గట్టి పడి కొన్ని వారాలపాటు అంగస్తంభన అలాగే ఉండిపోవడం, తీవ్రమైన నొప్పి వంటి దుష్పలితాలు తలెత్తవచ్చు. సిల్డెనాఫిల్ వాడకం వల్ల గుండె జబ్బున్న వారిలో బీపీ ఒక్కసారిగా తగ్గిపోయి కుప్పకూలే ప్రమాదం ఉంది. రక్తపోటుతో బాధపడేవారు బీపీ టాబ్లెట్లతోపాటు సిల్డెనాఫిల్ వాడినా ప్రమాదమే! గ్లిసరిల్ ట్రైనైట్రేట్స్, (నైట్రోగ్లిసరిన్), సోడియం నైట్రోప్రుస్సైడ్స్, అమైల్ నైట్రేట్స్ వాడుతున్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు (కార్డియోవాస్కులర్ రిస్క్ ఫ్యాక్టర్స్), స్వల్పకాలం క్రితం గుండెపోటు, పక్షవాతం వచ్చిన వారు, కాలేయ వ్యాధులు, కిడ్నీ సమస్యలు, మధుమేహం, లో బీపీ ఉన్నవారు, రక్తహీనత, లుకేమియా, హెచ్ఐవీ, ఎముక మజ్జకు సంబంధించిన కణుతులు ఉన్నవారు, రక్తస్రావ వ్యాధులున్న వారు సిల్డెనాఫిల్‌ను వాడకూడదు. కానీ అమెజాన్, మ్యాన్‌కైండ్‌లు ఎవరికైనా సరే సిల్డినాఫిల్‌ను విక్రయిస్తున్నాయి.

చట్టం ఏం చెబుతోంది?

డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్ 1945 ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలు విక్రయించడం నేరం. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో ఆర్డరిచ్చిన ఔషధాన్ని డాక్టర్ ఇచ్చే ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే సెక్షన్ 27, రూల్ 65(2) ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, జరిమానాను విధించవచ్చు. అదేవిధంగా ఫార్మసీ లైసెన్సు లేకుండా విక్రయిస్తే సెక్షన్ 80సీ ప్రకారం చట్ట పరంగా చర్యలు తీసుకోవచ్చు. తయారీ దారు లేదంటే మధ్యలో ఉండి విక్రయించే వారిపై కేసు నమోదు చేయవచ్చు.

వైద్యుల సూచనతోనే వాడాలి

సిల్డెనాఫిల్‌ను తప్పనిసరిగా వాడాలని వైద్యులు సూచిస్తేనే తీసుకోవాలి. దీని వాడకం వల్ల దుష్ప్రభావాలు ఉన్నాయి. గుండె సంబంధిత సమస్యలతో పాటు బీపీ తగ్గి చనిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల ఎవరి ఇష్టానుసారం వారు వాడడానికి వీలు లేదు. ఆన్‌లైన్‌లో ఔషధాలను విక్రయించడానికి చట్టపరంగా చాలా పరిమితులున్నాయి.

– డాక్టర్ కె.సుబ్రమణ్యం, ఆంధ్రాలజిస్టు, యూరాలజిస్టు, అపోలో ఆస్పత్రి

అలా అమ్మడం చట్టవిరుద్ధం

ఆన్‌లైన్ విధానంలో ఇప్పుడు ఔషధాలను సైతం విక్రయించేస్తున్నారు. వైద్యుల సిఫారసు పత్రం లేకుండా ఇలా విక్రయించే వారిపై చట్ట పరంగా చర్య తీసుకునే అవకాశం ఉంది. ఉత్పత్తి సంస్థ, విక్రయించిన సంస్థలపై కేసులు వేస్తారు. చట్టపరమైన నిబంధనలకే ఔషధాల విక్రయంలో ప్రాధాన్యం.**– బి.ముఖేష్ గౌడ్, న్యాయవాది**

వరికి పచ్చటి జల్లే

భారీ వర్షంతో పైరుకు మేలు

మత్తడి పడుతున్న సారంగాపూర్ మండలం మ్యాదారం చెరువు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలంగాణలో వరుణుడి హోరు కొనసాగుతోంది. రాష్ట్రంలో ఆదివారం కూడా చాలా ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. జల్లులకు వాగులు వంకలన్నీ పొంగిపొర్లుతున్నాయి. కొన్నిప్రాంతాల్లో చెరువులు అలుగు పోస్తున్నాయి. చక్కని తడితో మెట్ట పంటలు.. మడికట్లు బొర్లేంత నీటితో వరి పొలాలు కళకళలాడుతున్నాయి. భారీ వర్షంతో వరి పొలాలకు గండం దాటినట్టేనని రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎస్సారెస్పీకి వరద ఉధృతి పెరుగుతోంది. శనివారం రాత్రి నుంచే 5వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. మహారాష్ట్రలోని అందూర ప్రాజెక్టు నుంచి 30వేల క్యూసెక్కుల నీరు, బాలేగాం ప్రాజెక్టు నుంచి 2 వేల క్యూసెక్కుల నీటిని ఆదివారం మధ్యాహ్నం వదిలిపెట్టారు. ఈ వరద నీరు ఎస్సారెస్పీకి చేరితే నీటిమట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం 11.5 టీఎంసీలకు పెరిగింది. భూపాలపల్లి జిల్లాలో ప్రధాన జలాశయమైన లక్నవరం సరస్సులోకి 33 అడుగుల నీరు చేరి అలుగు పోస్తోంది. రామప్ప సరస్సు నిండు కుండను తలపిస్తోంది. నిన్నటిదాకా 13 అడుగుల వరకే నీరున్న సరస్సులో ఈ వర్షాలతో 23.5 అడుగులకు నీటి మట్టం చేరింది. భద్రాద్రి జిల్లా చర్ల మండలం తాలిపేరు ప్రాజెక్టుకు ఆదివారం ఎనిమిది గేట్లు ఎత్తివేసి, 24వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పాల్వంచలో కిన్నెరసాని రిజర్వాయర్‌లో నీటిమట్టం 406.2 అడుగులకు చేరడంతో ఒక గేట్ ఎత్తివేశారు. భద్రాచలంలో గోదావరి నీటి మట్టం 18 నుంచి 21 అడుగులకు చేరింది. జయశంకర్ జిల్లాలో వర్షం ధాటికి పలు గ్రామాలు అతలాకుతలమయ్యాయి. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. నిర్మల్ జిల్లా బాసరలో గోదారి నీటి మట్టం గణనీయంగా పెరిగింది. కడెం ప్రాజెక్టులో దాదాపు 80వేల క్యూసెక్కుల వరద నీరు చేరింది. స్వర్ణ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1183 అడుగులు కాగా.. 1173 అడుగులకు చేరింది. ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పత్తిచేలోకి భారీగా వరదనీరు చేరడంతో నష్టం వాటిల్లింది. వరంగల్ రూరల్ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపురం పెద్ద చెరువుకు మత్తడి పడింది. దీంతో ఏటూరునాగారం, రాజమండ్రివైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు సామర్థ్యం 30 అడుగులు కాగా నీటి మట్టం 21 అడుగులకు చేరింది. కామారెడ్డి జిల్లాలో భారీ వర్షం పడడంతో పోచారం ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

ఆదిలాబాద్ జిల్లా కుంటాలలో వర్షం ధాటికి కూలిన ఇళ్లు

దొరకని దేవిసింగ్ ఆచూకీ

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుజ్జుల తండావద్ద శనివారం బైక్‌తో సహా కొట్టుకుపోయిన లోకతండాకు చెందిన దేవీసింగ్ ఆచూకీ లభ్యం కాలేదు. రెస్క్యూ టీం ఆదివారం సాయంత్రం వరకు గాలించింది. బైక్ దొరికినా దేవీసింగ్ ఆచూకీ దొరకలేదు. సోమవారం మరోసారి వెతికేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

వానకు విరామం!

- నేటి నుంచి తగ్గనున్న భారీ వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చాలా రోజుల తర్వాత కురిసిన భారీ వర్షాలు మళ్లీ విరామం తీసుకోనున్నాయి! శని, ఆదివారాల్లో కుండపోత వానతో రాష్ట్రం తడిసిముద్దవ్వగా.. సోమవారం నుంచి తేలికపాటి నుంచి ఒక మోస్తరు జల్లులే పలకరించనున్నాయి. రుతు పవనాలు చురుకుగా ప్రభావం చూపడంతో చాన్నాళ్లకు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు వరంగల్ జిల్లా నల్లబెల్లి, నిజామాబాద్ జిల్లా రాంజల్ వాతావరణ కేంద్రాల్లో ఏకంగా 19 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలో 20కి పైగా వాతావరణ కేంద్రాల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టనున్నట్లు వాతావరణ శాఖ నివేదిక వెల్లడించింది. ఆ శాఖ ఆదివారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో పలు చోట్ల మాత్రమే తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. కాగా, ఉత్తర కోస్తా పరిసరాల్లో ఏర్పడిన అల్పపీడనం తెలుగు రాష్ట్రాలను దాటిపోయిందని విశాఖపట్నం వాతావరణ శాఖ తెలిపింది. శనివారం ఉదయం నుంచి, ఆదివారం ఉదయం వరకు భారీ వర్షాలు నమోదైన ప్రాంతాలు ఇవే

రాంజల్, (నిజామాబాద్-19), నల్లబెల్లి, (వరంగల్-19), నవీపేట్(నిజామాబాద్-18), ముథోల్ (ఆదిలాబాద్-18), వెంకటాపూర్ (వరంగల్-18), సారంగపూర్ (కరీంనగర్- 17), నిజాంసాగర్ (నిజామాబాద్-17), కోట్‌గిర్ (నిజామాబాద్-17), వర్ని (నిజామాబాద్-16), సాయంపేట (వరంగల్-16), యల్లారెడ్డి (నిజామాబాద్-16), ఆత్మకూర్ (వరంగల్-15), బోధన్ (నిజామాబాద్-15).

కూరల మంట

(మూడో పేజీ తరువాయి)

కూడా ఊహించని ధర వస్తుండడంతో రైతులు తమ భూములను అమ్ముకుంటున్నారు. మిగిలిన కాస్త భూముల్లోనూ సాగుకు వారు మొగ్గుచూపడం లేదు. అలాగే, గతానికి భిన్నంగా వాణిజ్య పంటల సాగుపైనే రైతులు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. దీంతో మునుపెన్నడూ లేని విధంగా కూరగాయల సాగు గణనీయంగా తగ్గిందని సాక్షాత్తు మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్వహించిన సర్వేలోనే తేలింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి శివారు జిల్లాల్లో దాదాపు 25 శాతం మేర కూరగాయల సాగు తగ్గిందని అంచనా వేస్తున్నారు. అందునా.. జిల్లాల్లో పండిన కూరగాయలు స్థానిక అవసరాలకే సరిపోతున్నాయి. నగరంలో ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లయిన బోయిన్‌పల్లి, గుడిమల్కాపూర్, మీరాలంమండి, ఎల్బీనగర్ తదితర మార్కెట్‌లతోపాటు, దాదాపు పది రైతు బజార్లకు డిమాండ్‌కు సరిపడా కూరగాయలు రావడం లేదు. నిజానికి, ఉమ్మడి రాష్ట్రంలో కూరగాయల సాగు ఏడాదికి 3.5 లక్షల నుంచి 4.5 లక్షల హెక్టార్లలో జరిగేది. ప్రత్యేకించి రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో పెద్ద ఎత్తున కూరగాయల సాగు జరిగేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇది బాగా తగ్గింది. 2014-15లో 1.78 లక్షల హెక్టార్లలో కూరగాయల సాగు జరిగితే, 31.95 లక్షల టన్నుల మేరకు ఉత్పత్తి వచ్చిందని అధికారులు వివరించారు. 2016-17లో ఈ సాగు విస్తీర్ణం 1.66 లక్షల హెక్టార్లకే

పరిమితమైంది. ఉత్పత్తి కూడా 30.79 లక్షల టన్నులకు పడిపోయింది. గతంతో పోలిస్తే దాదాపు 30 శాతం వరకూ కూరగాయల సాగు తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు.

దిగుమతులే ఆధారం

ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయల దిగుమతులను తగ్గించాల్సి ఉందని ఇటీవల ఓ సందర్భంలో మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కూరగాయల సాగును పెంచి, సాగులో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతేనా, ఇటీవల టమాటాల ధర కిలో వంద రూపాయలకు చేరడంతో రాష్ట్రంలోనే సాగు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. మూడు నెలల్లోనే తెలంగాణలో పండిన టమాటా మార్కెట్లోకి వస్తుందని, ఆ తర్వాత ధరలు తగ్గుతాయని చెప్పారు. అయితే, ఇప్పుడు సమస్య ఒక్క టమాటాకే పరిమితం కాలేదు. అన్ని కూరగాయలకూ ఇదే పరిస్థితి. దాంతో, కూరగాయల కొరతను అధిగమించేందుకు దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. నగరానికి కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, రాజస్థాన్ నుంచి పెద్దమొత్తంలో టమాటా, ఆలుగడ్డ, బీన్స్, క్యాప్సికం, క్యారెట్, బెంగళూరు నుంచి టమాటా, పచ్చిమిర్చి, బీట్‌రూట్ తదితర కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. ఇంకా చెప్పాలంటే, రాష్ట్రంలో పండే కూరగాయల కంటే దిగుమతి చేసుకునే ఉత్పత్తులే ఎక్కువ. గత ఏడాది 35.48 లక్షల టన్నుల కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయితే, ఈ సంవత్సరం జూలై వరకే 25.43 లక్షల టన్నులు దిగుమతి అయ్యాయి. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతుండడంతో రాబోయే రోజుల్లో దిగుమతుల పరిమాణం గణనీయంగా పెరగనుంది. దాంతో, ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండే పరిస్థితి లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

సైనా

సింధు

స్వర్ణంపైనే గురి!

● సింధు, శ్రీకాంత్‌పైనే ఆశలు ● రేసులో సైనా నెహ్వాల్
● 21 మందితో భారీ బృందం ● నేటి నుంచి ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్లాస్గో: ప్రతిష్ఠాత్మక వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌నకు సర్వం సిద్ధమైంది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరిగే ఈ మెగా టోర్నీ సోమవారం మొదలవనుంది. ఈసారి భారత్ 21 మంది సభ్యుల భారీ బృందంతో బరిలోకి దిగుతోంది. తెలుగు తేజాలు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్‌పైనే భారత్ పతకం ఆశలు పెట్టుకుంది. అలాగే ఈసారి స్వర్ణం కరువు కూడా తీర్చుకోవాలని భావిస్తోంది. ఈ టోర్నీలో సింధు రెండుసార్లు కాంస్య పతకాలు సాధించగా.. శ్రీకాంత్ తొలి పతకం కోసం తహతహలాడుతున్నాడు. రెండుసార్లు కాంస్య పతక విజేత సింధుతోపాటు ఈ ఏడాది వరుసగా రెండు సూపర్ సిరీస్ టైటిళ్లతో అదరగొట్టిన శ్రీకాంత్ గ్లాస్గోలో స్వర్ణంపై గురిపెట్టారు. భారత్ కూడా ఈ సారి ఒకటికన్నా ఎక్కువ పతకాలు సాధించాలని పట్టుదలగా ఉంది. కాగా.. భారత ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్ కూడా పతకం వేటలో ఉంది. 2015లో ఇక్కడ రజతం నెగ్గి ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళగా రికార్డుకెక్కిన సైనా ఈసారి స్వర్ణం కొల్లగొట్టాలని ఎదురు చూస్తోంది. అయితే గాయాల కారణంగా సరైన ప్రదర్శన చేయలేకపోతున్న సైనా ఇటీవలే ఫిట్‌నెస్ సాధించి ఈ మెగా ఈవెంట్‌కు సిద్ధమైంది.

శ్రీకాంత్

తొలి రౌండ్లో బై..: తొలిరౌండ్లో సింధు, సైనాకు బై లభించింది. కాగా.. రెండో రౌండ్లో సింధు.. కొరియాకు చెందిన కిమ్ హ్యో మిన్ లేదా హదియా హోస్నీ (ఈజిప్ట్)తో తలపడనుంది. రెండో రౌండ్‌ను అధిగమిస్తే చైనాకు చెందిన సన్ యు రూపంలో గట్టి ప్రత్యర్థిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక సైనా రెండో రౌండ్లో సబ్రీనా జాకెట్ (స్విట్జర్లాండ్) లేదా నటాల్యా (ఉక్రెయిన్)తో తలపడాల్సి ఉంటుంది. ప్రపంచ నెంబర్ వన్ తై జు యింగ్ ఈ టోర్నీకి దూరమైంది. అయితే రెండు సార్లు చాంపియన్, మూడోసీడ్ కరోలినా మారిన్ (స్పెయిన్) నుంచి ప్రమాదం పొంచి ఉంది. మహిళల సింగిల్స్‌లో రితుపర్ణ, తన్వీలాడ్ కూడా బరిలో ఉన్నప్పటికీ ఈ ఇద్దరి నుంచి పతక ప్రదర్శన ఆశించలేం.

సూపర్ ఫామ్‌లో శ్రీకాంత్: ఈ ఏడాది వరుసగా రెండు సూపర్ సిరీస్ టైటిళ్లు నెగ్గి, మూడు టోర్నీల్లో ఫైనల్ చేరిన శ్రీకాంత్ టైటిల్ ఫేవరెట్లలో ఒకడిగా బరిలోకి దిగుతున్నాడు. ఎనిమిదో సీడ్ శ్రీకాంత్ తొలిరౌండ్లో రష్యాకు చెందిన సెర్గీ సిరాంత్‌తో తలపడనున్నాడు. రెండో రౌండ్లో అతనికి లూకాస్ కోర్వీ (ఫ్రాన్స్) లేదా లిన్ యు (తైపీ) ఎదురవనున్నారు. పురుషుల సింగిల్స్‌లో 15వ సీడ్ సాయి ప్రణీత్ కూడా టైటిల్ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. సయ్యద్ మోడీ గ్రాండ్‌ప్రీ విజేత సమీర్ వర్మ, అజయ్ జయరాం కూడా ఈ టోర్నీలో బరిలోకి దిగుతున్నారు. ఇక మహిళల డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప-సిక్కిరెడ్డి జోడీ మెరుగైన ప్రదర్శన చేయాలని భావిస్తోంది. పురుషుల డబుల్స్‌లో మను అత్రి-సుమీత్ రెడ్డి, చిరాగ్ సేన్-సాత్విక్ సాయిరాజ్, అర్జున్-రామచంద్ర జోడీలు బరిలో నిలిచాయి. మిక్స్‌డ్‌లో సుమీత్ రెడ్డితో కలిసి అశ్విని తలపడుతోంది. సిక్కిరెడ్డి-ప్రణవ్ చోప్రా కలిసి ఆడనున్నారు.

ఫార్మాట్ మారినా.. టీమిండియా పవర్ ఫుల్ ఆటలో ఎలాంటి మార్పు రాలేదు..! టెస్టుల్లో శ్రీలంకను చిత్తుగా ఓడించిన కోహ్లీసేన.. వన్డేల్లోనూ ప్రత్యర్థికి దడపుట్టించింది..! ఓ దశలో 139/1తో పటిష్ఠ స్థితిలో నిలిచిన లంకను యువ బౌలర్లు 77 పరుగుల తేడాతో 9 వికెట్లు పడగొట్టి తక్కువ స్కోరుకే కట్టడి చేసేశారు..! ఆపై, భీకర ఫామ్‌లో ఉన్న శిఖర్ ధవన్ (90 బంతుల్లో 20 ఫోర్లు, 3 సిక్సర్లతో 132 నాటౌట్) మెరుపు శతకంతో విజృంభించగా.. విరాట్ కోహ్లీ (70 బంతుల్లో 10 ఫోర్లు, సిక్సర్‌తో 82 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో దంబుల్లాలో తిరుగులేని విజయాన్ని ఖాతాలో వేసుకుంది...!

విరాట్ కోహ్లీ (82 నాటౌట్)

దంబుల్లాలో ధనాధవన్..

200 పైచిలుకు లక్ష్య ఛేదనలో బంతుల పరంగా భారత్‌కు ఇదే అది పెద్ద విజయం. ఈ మ్యాచ్‌లో 127 బంతులు మిగిలుండగానే భారత్ నెగ్గింది.

శతక్కొట్టిన శిఖర్

శిఖర్ ధవన్
బంతులు: 90
ఫోర్లు: 20
సిక్సర్లు: 3
రన్స్: 132 నాటౌట్

71
ఈ మ్యాచ్‌లో శతకం కోసం ధవన్ తీసుకున్న బంతులు. వన్డేల్లో అతనికిదే ఫాస్టెస్ట్ సెంచరీ. 2013లో వెస్టిండీస్‌పై 73 బంతుల్లో చేసిన సెంచరీని అధిగమించాడు.

● చెలరేగిన విరాట్
● సత్తా చాటిన బౌలర్లు
● తొలి వన్డేలో భారత్ జయభేరి
● 9 వికెట్లతో చిత్తయిన లంక

దంబుల్లా: టెస్టు సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా వన్డే సిరీస్‌నూ అద్భుతంగా ఆరంభించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో శ్రీలంకను 9 వికెట్లతో చిత్తుగా ఓడించింది. లంక నిర్దేశించిన 217 పరుగుల లక్ష్యాన్ని భారత్ 28.5 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఓపెనర్ రోహిత్ (4) విఫలమైనా 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ధవన్, విరాట్ రెండో వికెట్‌కు అజేయంగా 197 పరుగులు జోడించి జట్టును గెలిపించారు. తొలుత మనబౌలర్ల ధాటికి లంక 43.2 ఓవర్లలో 216 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ డిక్‌వెలా (64) అర్ధ శతకంతో ఆకట్టుకున్నాడు. అక్షర్ కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో (10-0-34-3)తో చెలరేగగా, చాహల్, కేదార్, బుమ్రా రెండేసి వికెట్లు తీశారు. ఈనెల 24న పల్లెకెలెలో రెండో వన్డే జరగనుంది.

ధవన్, కోహ్లీ దూకుడు..: స్వల్ప ఛేదనలో ఓపెనర్ రోహిత్ నాలుగు పరుగులకే రనౌటయ్యాడు. టీమిండియా తడబడింది ఆ ఒక్కచోటే. అప్పటికే.. మూడు ఫోర్లు బాది ఊపుమీదున్న ధవన్ వన్‌డౌన్‌లో వచ్చిన కోహ్లీతో కలిసి ఆతిథ్య బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఒక ఎండ్‌లో కోహ్లీ నేర్పుగా ఆడుతూ స్ట్రయిక్ రొటేట్ చేయగా.. ధవన్ తనదైన ధనాధన్ షాట్లతో చెలరేగిపోయాడు. చూడచక్కటి స్ట్రోక్స్‌తో బౌండ్రీలు రాబట్టాడు. క్రీజులో కుదురుకున్నాక కోహ్లీ కూడా బ్యాట్ ఝుళిపించాడు. సందకన్ వేసిన 13వ ఓవర్లో పుల్‌షాట్‌తో మిడ్‌మికెట్ మీదుగా సిక్సర్ కొట్టిన శిఖర్ 36 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాతా మరింత రెచ్చిపోయిన అతను 71 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కోహ్లీ 49 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్కు దాటాడు. ఆపై ఇద్దరూ బౌండ్రీలే లక్ష్యంగా బ్యాటింగ్ చేయడంతో లక్ష్యం ఇట్టే కరిగిపోయింది.

ఆరంభం వాళ్లదే కానీ..: అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లంకకు ఓపెనర్లు డిక్‌వెలా, గుణతిలక (35) అదిరిపోయే ఆరంభం ఇచ్చారు. పేసర్లు భువనేశ్వర్ (0/33), హార్దిక్ (0/35) బౌలింగ్‌లో ఎదురుదాడికి దిగడంతో తొమ్మిదో ఓవర్లోనే లంక స్కోరు యాభై పరుగులు దాటింది. అయితే, యువ స్పిన్నర్ చాహల్ తన రెండో ఓవర్లోనే గుణతిలకను అవుట్ చేసి జట్టుకు బ్రేక్ ఇచ్చాడు. అయినా.. వెనక్కుతగ్గని డిక్‌వెలా.. కుశాల్ మెండిస్ (36)తో కలిసి ధాటిగా ఆడాడు. 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న డిక్‌వెలా రెండో వికెట్‌కు కుశాల్‌తో 65 రన్స్ జోడించాడు. అయితే 25వ ఓవర్లో డిక్‌వెలాను ఎల్బీ చేసిన కేదార్ ఈ జోడీని విడదీశాడు. కాసేపటికే మెండిస్‌ను అవుట్ చేసిన అక్షర్ ఆతిథ్య జట్టును గట్టి దెబ్బకొట్టాడు. అప్పటికి 150/3తో నిలిచిన లంక సులభంగా 280 స్కోరు చేసేలా కనిపించింది. కానీ, వరుస ఓవర్లలో 5 వికెట్లు పడగొట్టిన బౌలర్లు లంకను ఉక్కిరిబిక్కిరి చేశారు. కెప్టెన్ తరంగ (13), కపుగెదెర (1), డిసిల్వ (2), తిసార పెరీర (0), సందకన్ (5) ఇలా.. వచ్చినవారిని వచ్చినట్టు పెవిలియన్ చేర్చారు. మాథ్యూస్ (36 నాటౌట్).. మలింగ (8)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 22 పరుగులు జోడించి లంకను 200 మార్కు దాటించాడు.

స్కోరుబోర్డు

శ్రీలంక: డిక్‌వెలా (ఎల్బీ) కేదార్ 64, గుణతిలక (సి) రాహుల్ (బి) చాహల్ 35, మెండిస్ (బి) అక్షర్ 36, తరంగ (సి) ధవన్ (బి) కేదార్ 13, మాథ్యూస్ (నాటౌట్) 36, కపుగెదెర (రనౌట్/కోహ్లీ) 1, డిసిల్వ (సి) కేదార్ (బి) అక్షర్ 2, పెరీర (బి) బుమ్రా 0, సందకన్ (ఎల్బీ) అక్షర్ 5, మలింగ (స్టంప్డ్) ధోనీ (బి) చాహల్ 8, ఫెర్నాండో (బి) బుమ్రా 0; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 43.2 ఓవర్లలో 216 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-74, 2-139, 3-150, 4-166, 5-169, 6-176, 7-178, 8-187, 9-209; **బౌలింగ్:** భువనేశ్వర్ 6-0-33-0, హార్దిక్ 6-0-35-0, బుమ్రా 6.2-0-22-2, చాహల్ 10-0-60-2, కేదార్ 5-0-26-2, అక్షర్ 10-0-34-3.

భారత్: రోహిత్ (రనౌట్/కపుగెదెర) 4, ధవన్ (నాటౌట్) 132, కోహ్లీ (నాటౌట్) 82; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 28.5 ఓవర్లలో 220/1; వికెట్ పతనం:** 1-23; **బౌలింగ్:** మలింగ 8-0-52-0, ఫెర్నాండో 6-0-43-0, మాథ్యూస్ 2-0-9-0, పెరీర 2-0-18-0, సందకన్ 6-0-63-0, డిసిల్వ 4.5-0-35-0.

మొక్కనాటి నీరు పోసి..

దంబుల్లా: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ.. బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మ జగమెరిగిన ప్రేమ జంట. వీరు చెట్టపట్టాలేసుకుంటూ తిరుగుతున్న ఏ ఫొటోలైనా అభిమానులకు యమ క్రేజ్. ఎప్పుడూ షాపింగ్ మాల్‌లోనో, రెస్టారెంట్‌లోనో, విదేశీ వీధుల్లోనో కనిపించే ఫొటోలకు భిన్నంగా వీరి చిత్రమొకటి సోషల్ మీడియాలో తెగ చెక్కర్లు కొడుతోంది. శ్రీలంకలో ఖుషీఖుషీగా గడిపిన ఈ జోడీ.. ఓ మొక్కనాటి నీరుపోస్తున్న ఫొటో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ జంటకు ఎంత పర్యావరణ స్పృహో అని వారి అభిమాన గణం తెగ మురిసిపోతోందట.

● టీమిండియాకు ఎప్పటికీ మద్దతు

ముంబై: ఎటువంటి పరిస్థితుల్లోనైనా తన మద్దతు టీమిండియాకేనని సచిన్ టెండూల్కర్ అన్నాడు. జట్టు అంచనాల మేర రాణించినా.. రాణించకపోయినా తన మద్దతు మాత్రం ఎప్పటికీ మారదని స్పష్టంచేశాడు. 'పురుషుల జట్టయినా మహిళల జట్టయినా వారికి ఎల్లప్పుడూ నా శుభాశీస్సులుంటాయి' అని ఐడీబీఐ ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ముంబై హాఫ్ మారథాన్‌ను ఆదివారం ఇక్కడ ప్రారంభించిన అనంతరం సచిన్ విలేకరులతో మాట్లాడుతూ అన్నాడు.

● హారికకు గెలుపు

అబుదాబి: ద్రోణవల్లి హారిక అబుదాబి చెస్ ఫెస్టివల్లో మరో గేమ్ గెలిచింది. వరుసగా మూడు డ్రాల తర్వాత ఆదివారం జరిగిన ఏడో రౌండ్‌లో అడిన్ సులేమన్లీ (అజర్‌బైజాన్)పై గెలిచింది. కాగా ఆరో రౌండ్‌లో స్పెయిన్ మాస్టర్ ఆంటోనియో పజోస్ పోర్టాతో హారిక పాయింట్ పంచుకుంది. దీంతో మొత్తం 7 రౌండ్ల నుంచి హారిక 4.5 పాయింట్లు సాధించింది.

చాంప్ రుత్వికా శివాని

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలంగాణ యువ షట్లర్ గద్దె రుత్వికా శివాని టైటిల్ నెగ్గింది. పుణెలో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో శివాని 21-10, 21-13తో అనురా ప్రభుదేశాయ్ (గోవా)ను వరుస సెట్లలో ఓడించి విజేతగా నిలిచింది.

యువీ రీఎంట్రీ కష్టమే..!

న్యూఢిల్లీ: యువరాజ్ సింగ్.. మళ్లీ భారత జట్టులో చోటు సంపాదించడం కష్టమేనని సీనియర్ ప్లేయర్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. శ్రీలంకతో వన్డే సిరీస్‌కు యువీని పక్కన బెట్టారు. అయితే అతడిని తప్పించలేదని.. విశ్రాంతి మాత్రమే ఇచ్చామని చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ చెప్పాడు. ఈ నేపథ్యంలో యువీ పునరాగమనాన్ని గంభీర్ విశ్లేషించాడు. అసలు జట్టులోకి రీఎంట్రీ కోసం ప్రయత్నిస్తున్న ఆటగాడికి 'విశ్రాంతి' అనే పదం వాడడం సరైనది కాదన్నాడు.

ఆశలన్నీ సాక్షి, బజరంగ్‌లపైనే..

నేటినుంచి ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్

పారిస్ : ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ సోమవారం ఇక్కడ ప్రారంభం కానున్నాయి. అయితే రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్, ఆసియా చాంపియన్ బజరంగ్ పునియాపైనే భారత్ ఆశలు పెట్టుకుంది. రియో ఒలింపిక్స్ 58 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన సాక్షి మాలిక్.. ఆసియా చాంపియన్‌షిప్స్‌లో 60 కేజీల కేటగిరీలోకి మారి రజత పతకం గెలుచుకుంది. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో 60 కిలోల విభాగానికే అర్హత సాధించింది.

పట్నా తొలి ఓటమి

● అదరగొట్టిన పుణెరి పల్టన్
● జైపూర్‌పై యోధా గెలుపు

కబడ్డీ మ్యాచ్‌లకు నేడు విశ్రాంతి

పుణెరి-పట్నా మ్యాచ్ దృశ్యం

లఖ్‌నవ్: డిఫెండింగ్ చాంపియన్ పట్నా పైరేట్స్ ఈ సీజన్‌లో తొలి ఓటమి చవిచూసింది. ప్రొ కబడ్డీ లీగ్ లఖ్‌నవ్ అంచెలో భాగంగా ఇంటర్ జోన్ చాలెంజ్‌లో పట్నా పైరేట్స్ 42-47తో పుణెరి పల్టన్ చేతిలో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో ఐదు మ్యాచ్‌లాడిన పట్నాకు ఇదే తొలి ఓటమికావడం విశేషం. పట్నా స్టార్ రైడర్ పర్దీప్ నర్వాల్ 19 రైడ్ పాయింట్లతో విజృంభించినా తన జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. పుణెరి రైడర్ రాజేష్ మొండల్ పది, దీపక్ నివాస్ హుడా తొమ్మిది రైడ్ పాయింట్లు సాధించారు. డిఫెండర్ రహ్మన్ ఆరు టాకిల్ పాయింట్లతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. రైడింగ్‌లో పట్నా మొత్తం 31 పాయింట్లతో పైచేయి సాధించినా.. డిఫెన్స్‌లో తేలిపోయింది. కాగా.. రైడింగ్‌లో మొత్తం 29 పాయింట్లు రాబట్టిన పుణెరి.. డిఫెన్స్‌లోనూ 12 పాయింట్ల తో పైచేయి సాధించింది. సెకండాఫ్‌లో పర్దీప్ సూపర్ రైడ్‌తో మూడు పాయింట్లు తేవడంతో పట్నా 20-30తో నిలిచింది. 32వ నిమిషంలో పర్దీప్ మరో సూపర్ రైడ్ చేయడంతో పట్నా రేసులోకొచ్చినట్టు కనిపించింది. కానీ.. మరోవైపు తన ఆధిక్యం పెంచుకుంటూ పోయిన పుణెరి 40-30తో నిలిచింది. మరో మూడు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా పట్నా వరుస పాయింట్లతో దూసుకొచ్చినా.. ఫలితం లేకపోయింది. ఆఖరి రైడ్‌లో వికాస్ జగ్లాన్ మూడు పాయింట్లు తెచ్చినా అది ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. కాగా.. యూపీ యోధాతో జరిగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 24-22తో ఉత్కంఠ విజయం సాధించింది. చివరి వరకూ ఆధిక్యంలోనే ఉన్న యోధా 40వ నిమిషంలో ఆలౌటై మ్యాచ్‌ను చేజార్చుకుంది. జైపూర్ జట్టులో తుషార్ 5, నితిన్ 5, జస్వీర్ సింగ్ 4 పాయింట్లు సాధించారు.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విక్టరీ

బర్మింగ్‌హామ్: ఆరంభ (డే/నైట్) టెస్ట్‌లో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 209 పరుగులతో వెస్టిండీస్‌పై గెలిచి.. 1-0తో సిరీస్‌లో ఆధిక్యం సాధించింది. ఫాలోఆన్ ఆడుతున్న విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 137 పరుగులకే కుప్పకూలింది. బ్రాత్‌వైట్ (40) టాప్ స్కోరర్. స్టువర్ట్ బ్రాడ్ 3 వికెట్లు పడగొట్టగా.. ఆండర్సన్, జోన్స్, అలీ రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 514/8 (డిక్లేర్) స్కోరు చేయగా.. విండీస్ 168 పరుగులకే ఆలౌటైంది. ఇక ఇరు జట్ల మధ్య ఈ నెల 25న లీడ్స్‌లో రెండో టెస్ట్ మొదలుకానుంది.

ఇంగ్లండ్ ఆటగాళ్ల ఆనందం

హైదరాబాద్ శుభారంభం

అహ్మదాబాద్ : ఇండియన్ క్యూ మాస్టర్స్ లీగ్‌లో హైదరాబాద్ హస్లర్స్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 4-1తో గుజరాత్ కింగ్స్‌ను చిత్తుచేసింది. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో చెన్నై స్ట్రైకర్స్ 4-1తో ఢిల్లీ డాన్స్‌పై విజయం సాధించింది.

ఉత్తరప్రదేశ్‌లోని సిద్దార్థ్‌నగర్ ప్రాంతంలో వరద కారణంగా జలదిగ్బంధంలో చిక్కుకుని హెలికాప్టర్ సహాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు

ఒక ఫొటో చెప్పే కథ!

ఈ ఫొటో జనవరి 28న ఓవల్ ఆఫీసులో తీసినది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడితో ఫోన్‌లో మాట్లాడుతుంటే.. ముందు అయిదుగురూ శ్రద్ధగా వింటున్నారు. వారెవరో కాదు.. ట్రంప్ కోరి తెచ్చుకున్న సలహాదారులు. ట్రంప్‌తో వేగలేని వాళ్ల కొలువు ఎన్నాళ్లో సాగలేదు. ఈ ఫొటోలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ తప్ప మిగతా నలుగురూ ఇప్పుడు ట్రంప్‌తో లేరు. వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ రీన్స్ ప్రీబస్, జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ ఫిన్, ముఖ్య వ్యూహకర్త స్టీఫెన్ బానన్‌పై వేటు పడగా, ప్రెస్ సెక్రటరీ సీన్ స్పైసర్ మాత్రం వైదొలిగారు. ట్రంప్ నిర్ణయాల్లో, మాటల్లో నిలకడ లేమిని సూచిస్తుందంటూ ఈ ఫొటో వైరల్ అయింది. కాగా, ట్రంప్ మరో సలహాదారు కార్ల్ ఐకన్ కూడా తప్పుకున్నారు.

నిర్లక్ష్యంతోనే ప్రమాదం

స్వాములను కాపాడిన ముస్లింలు!

ఉత్కల్ రైలు ప్రమాదఘటనలో తీవ్రంగా గాయపడి బోగీల్లో చిక్కుకుపోయిన ఏడుగురు సాధువులు స్థానిక ముస్లింల చొరవతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఏడుగురు సాధువులు హరిద్వార్‌కు వెళ్లేందుకు మధ్యప్రదేశ్‌లోని మోరానాలో ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ప్రమాదం జరిగిన వెంటనే వీరు ప్రయాణిస్తున్న బోగీ నుజ్జునుజ్జయింది. అందులో చిక్కుకుపోయిన సాధువులను స్థానిక ముస్లింలు బయటకు తీసుకొచ్చారు. 'ఆ ముస్లింలే మా ప్రాణాలను కాపాడారు' అని భగవాన్ మహరాజ్ సాధువు పేర్కొన్నారు.

(మూడో పేజీ తరువాయి)

సీనియర్ సెక్షన్ ఇంజినీర్, జూనియర్ ఇంజినీరును సస్పెండ్ చేశారు. చీఫ్ ట్రాక్ మేనేజర్‌ను బదిలీ చేశారు. ప్రమాదంపై ప్రాథమిక విచారణ పూర్తయిందని, పూర్తి స్థాయి విచారణను నేటి నుంచి ప్రారంభిస్తామని మహ్మద్ జంషెడ్ తెలిపారు. రైల్వే మంత్రి ఆదేశాల మేరకు ప్రమాదానికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 'ప్రమాదం జరిగిన ఖతౌలీ ప్రాంతంలో రెండు రోజులుగా రైల్వే ట్రాక్ మరమ్మతులు జరుగుతున్నాయి. రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ విషయాన్ని సమీపంలోని రైల్వే స్టేషన్లకు తెలపలేదు' అని జంషెడ్ చెప్పారు. "15 మీటర్ల మేర పట్టాలను తీసేసి, మరమ్మతులు చేస్తున్నారు. దూరం నుంచి పూరీ- హరిద్వార్ రైలు వస్తూ కనిపించింది. దీంతో, కూలీలు హడావిడిగా అప్పటికప్పుడు రైలు పట్టాలను అమర్చారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో, పట్టాలను, పరికరాలను అక్కడే వదిలేసి కూలీలు పరుగులు తీశారు. ఆ తర్వాత అవి పట్టాలు తప్పిన ఏ1 కోచ్ కింద కనిపించాయి" అని మరో రైల్వే అధికారి వివరించారు. ఏ1 బోగీ కింద పట్టాలు విరిగిపోయి ఉన్నాయని, వాటికి సంబంధించిన క్లాంపులు మరోవైపు చెల్లాచెదురై ఉన్నాయని వివరించారు. రైల్వే ఇంజనీరింగ్ విభాగం మాత్రం మరమ్మతుల విషయమై ఖతౌలి స్టేషన్ అధికారులను హెచ్చరించినట్లు చెబుతున్నారు. 20 నిమిషాలపాటు రైళ్ల రాకపోకలకు అనుమతించవద్దని కోరామని వారు తెలిపారు. ఖతౌలి స్టేషన్ సూపరింటెండెంట్ రాజిందర్ సింగ్ మాత్రం మరమ్మతులపై తమకు ఎవ్వరూ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో రైలు 100 కిలోమీటర్ల వేగంతో వెళుతోందని రైల్వే ఉన్నతాధికారి ఆర్ఎన్ సింగ్ తెలిపారు. ప్రమాదానికి మరమ్మతులే కారణమని ఓ రైల్వే అధికారి మీడియాకు చెబుతున్నట్లు ఉన్న ఓ ఆడియో క్లిప్‌ను రైల్వే అధికారులు పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి బాధ్యులు ఎవరో వెంటనే తేల్చాలని కేంద్ర రైల్వే మంత్రి సురేశ్ ప్రభు ఆదేశించారు. ప్రమాద ఘటనపై రైల్వే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఉత్కల్ ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలు ఏమైనా తెలిస్తే అందజేయాల్సిందిగా ప్రజలకు రైల్వే అధికారులు విజ్ఞప్తి చేశారు. కాగా, ఉత్కల్ రైలు ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన వ్యక్తి.. రైల్వే అధికారులు తనకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదంలో తన ఇల్లు పూర్తిగా ధ్వంసమైందని, పరిహారం చెల్లించకుంటే రైల్వే అధికారులపై కేసు దాఖలు చేస్తానని ఆయన తెలిపారు.

ప్రమాదానికి గురైన బోగీలను తరలిస్తున్న దృశ్యం

త్రుటితో తప్పిన మరో ప్రమాదం..

యూపీలోని తుండ్లా నుంచి ఢిల్లీ వెళుతున్న మెమూ రైలు తుండ్లా జంక్షన్ దాటిని కొద్దిసేపటికే చక్రాల్లో లోపం తలెత్తింది. పెద్ద శబ్ధంతోపాటు పొగ రావడం ప్రారంభించింది. దీన్ని గమనించిన ప్రయాణికులు రైల్వే సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రైలును చామ్రోలా స్టేషన్‌లో నిలిపివేశారు.

పట్టాలు తప్పిన 'నైతికత'

ముజఫర్‌నగర్‌లో ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడానికి రైల్వే అధికారుల నిర్లక్ష్యమే కారణం. బాధితులకు రైల్వే శాఖ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం ప్రకటించాయి. మరి ఈ ఘటనకు నైతిక బాధ్యత ఎవరిది? ప్రస్తుత సురేశ్ ప్రభుతో కలిపి భారత రైల్వేకు ఇప్పటి వరకూ 43 మంది మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. కానీ, వీరిలో నైతిక బాధ్యత తీసుకుంది ఇద్దరు మాత్రమే! 1956లో తమిళనాడులోని అరియాలూర్‌లో రైలు ప్రమాదం జరిగి 142 మందికిపైగా మరణించినప్పుడు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి లాల్ బహదూర్‌శాస్త్రి రాజీనామా చేశారు. 43 ఏళ్ల తర్వాత 1999లో అసోంలో గైస్వాల్ రైలు ప్రమాదంలో కనీసం 290 మంది చనిపోవడంతో రైల్వే మంత్రి నితీశ్ కుమార్ సైతం నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. 2000లో రెండు ప్రమాదాలు జరగడంతో నాటి మంత్రి మమతాబెనర్జీ కూడా రాజీనామా చేసినా... ప్రధాని వాజ్‌పేయి అంగీకరించలేదు.

రైల్వేలో సాంకేతికత ఎండమావేనా!

'రైళ్ల నిర్వహణ అత్యంత సంక్లిష్టమైనది. మానవ తప్పిదాలను వీలైనంతగా తగ్గించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం రైల్వేలకు ఎంతైనా ఉంది. యాంత్రీకరణ ద్వారా ప్రమాదాలను వీలైనంత వరకు తగ్గించే అవకాశం ఉంటుంది'.. గత ఏడాది కాన్పూర్ సమీపంలో ఇండోర్-పట్నా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం అనంతరం రైల్వే టాస్క్‌ఫోర్స్ కమిటీ ఇచ్చిన నివేదిక సారాంశం ఇది. కానీ ఆ దిశగా రైల్వేలు అడుగులు వేస్తున్న దాఖలాల్లేవు. ఐదేళ్లలో 586 రైలు ప్రమాదాలు జరగ్గా వాటిలో 53 ప్రమాదాలు పట్టాలు తప్పడం వల్లే జరిగాయి. మానవ తప్పిదాలతోపాటు బోగీల డిజైన్లలో లోపాలు.. ట్రాక్‌ల నిర్వహణలో ఉదాసీనత.. రైలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు వీలైనంతగా ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు లింకే హాఫ్‌మన్ బుచ్ కోచ్‌ను వినియోగంలోకి తేవాలని రైల్వే భద్రతపై ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ ఎప్పుడో సిఫారసు చేసింది. ప్రమాదం జరిగినప్పుడు ఉత్కల్ ఎక్స్‌ప్రెస్‌లో బోగీలన్నీ పాత కాలం నాటి ఎల్‌బీహెచ్ కోచ్‌లు కావడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది.

వీసా ఆంక్షలున్నా మనమే టాప్!

- **హెచ్-1బి అప్లికేషన్లలో భారతీయులవే అధికం**

ముంబై, ఆగస్టు 20: ఇటీవలి కాలంలో వీసాల జారీలో అమెరికా కొన్ని ఆంక్షలు విధించినప్పటికీ భారతీయులు మాత్రం వెనకడుగు వేయడం లేదు. హెచ్-1బి వీసా దరఖాస్తుదారుల్లో భారతీయులే అత్యధిక సంఖ్యలో ఉన్నారని అమెరికా ఇమ్మిగ్రేషన్ సంస్థ వెల్లడించింది. గతేడాది అక్టోబర్ 1 నుంచి ఈ ఏడాది జూన్ 30 వరకు 2.47 లక్షల మంది భారతీయులు హెచ్-1బి వీసాల కోసం దరఖాస్తులు చేసుకున్నారట. మొత్తం దరఖాస్తుదారుల్లో భారతీయులు 74 శాతం అని వెల్లడించింది. కాగా, 2006-2017 మధ్య 21.83 లక్షల మంది భారతీయులు హెచ్-1బి వీసాల కోసం దరఖాస్తు చేసుకున్నట్టు వెల్లడించింది.

విద్యార్థులకు పంద్రాగస్టు ఫైన్

- **వేడుకలకు రానందుకు 2500 జరిమానా**

చెన్నై, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరుకాని విద్యార్థులకు ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం జరిమానా విధించడం చర్చనీయాంశంగా మారింది. చెన్నై పురసైవాక్కంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వివిధ తరగతులకు చెందిన 19 మంది విద్యార్థులు హాజరుకాలేదు. విద్యార్థుల గైర్హాజరును సీరియస్‌గా పరిగణించిన యాజమాన్యం.. వారికి ఒక్కొక్కరికీ రూ.2,500 జరిమానా విధించింది. జరిమానా చెల్లించే వరకు పాఠశాలకు రావద్దని ఆదేశించింది. పాఠశాల యాజమాన్యం తీరును కొందరు తప్పుబడుతున్నారు.

బాలికలకు 40% సీట్లు: నఖ్వీ

న్యూఢిల్లీ: కేంద్రం మైనారిటీ విద్యార్థుల కోసం 100 నవోదయ తరహా పాఠశాలలు, 5 ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పనుంది. వీటిలో బాలికలకు 40 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించింది. దేశంలో మైనారిటీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ విద్యా సంస్థలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు వచ్చే ఏడాది నుంచి వీటిని ప్రారంభిస్తామన్నారు.

దేశ నిర్మాణంలో రాజీవ్ పాత్ర ఎంతో ఉంది: మోదీ

- **మాజీ ప్రధానికి అంజలి ఘటించిన కాంగ్రెస్ ప్రముఖులు**

న్యూఢిల్లీ: దేశ నిర్మాణంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ పాత్ర ఎంతో ఉందని పీఎం మోదీ ప్రశంసించారు. ఆదివారం రాజీవ్ జయంతి సందర్భంగా రాజీవ్‌ను గుర్తుచేసుకుంటూ మోదీ ట్వీట్ చేశారు. 'ఈరోజు మాజీ ప్రధాని శ్రీ రాజీవ్‌గాంధీని, దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకోవాల'ని పేర్కొన్నారు. ఇక, రాజీవ్ గాంధీ సమాధి ఉన్న 'వీర్‌భూమి'లో కాంగ్రెస్ ప్రముఖులు అంజలి ఘటించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, రాహుల్, ప్రియాంక తదితరులు 'వీర్‌భూమి'లో రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు.

ఈపీఎస్, ఓపీఎస్ విలీనం నేడే!

చెన్నై, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అధికార పార్టీ అన్నాడీఎంకేలో ఏర్పడిన ఎడప్పాడి, ఓపీఎస్ వర్గాలు తిరిగి కలిసిపోయేందుకు ముహూర్తం కుదిరింది. ఇరుపక్షాల మధ్య సాగిన చర్చలు కొలిక్కిరావడంతో సోమవారం సాయంత్రం ఓపీఎస్, ఈపీఎస్(ఎడప్పాడి పళనిస్వామి) వర్గాలు ఒక్కటి కానున్నాయనే ప్రచారం ఊపందుకుంది. సీఎం ఎడప్పాడి పళనిస్వామి వర్గం, మాజీ సీఎం ఒ. పన్నీర్‌సెల్వం వర్గం గత శుక్రవారం రాత్రి మెరీనాబీచ్‌లోని జయలలిత సమాధి వద్ద ఒక్కటయ్యేందుకు అన్ని ఏర్పాట్లు జరిగినా, చివరి క్షణంలో ఇది నిలిచిపోయింది. అయితే, వీరి మధ్య రెండు రోజులుగా సాగిన రహస్య చర్చలు ఫలించాయి. దీంతో సోమవారం విలీన ప్రకటన వెలువడే సూచనలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. పన్నీర్ సెల్వానికి డిప్యూటీ సీఎం పదవితోపాటు ప్రజాపనుల శాఖను కూడా ఇచ్చేందుకు సీఎం ఎడప్పాడి సమ్మతించినట్లు తెలుస్తోంది. ఈయన వర్గంలోని మాజీ మంత్రి పాండియరాజన్‌కు ఆర్థిక శాఖను, ఎమ్మెల్యే సెమ్మలైకి గృహ నిర్మాణ శాఖను కేటాయించే అవకాశముంది. ప్రస్తుతానికి పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి కోసం పట్టు పట్టద్దని ఎడప్పాడి చేసిన విన్నపాన్ని పన్నీర్ మన్నించినట్లు తెలుస్తోంది. ఎడప్పాడి, పన్నీర్ వర్గాలకు అమావాస్య సెంటిమెంట్ కలిసిరానుంది! జయలలితసెంటిమెంట్‌ని కొనసాగిస్తూ.. అమావాస్య కావడంతో సోమవారమే విలీనంపై ప్రకటన చేయాలని ఓపీఎస్, ఈపీఎస్ నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

కేంద్ర మంత్రులూ జాగ్రత్త!

(మూడో పేజీ తరువాయి)

మంత్రులుగానీ, వారి బంధువులుగానీ దుర్వినియోగం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు. కొందరు మంత్రుల తీరు పట్ల కొన్నాళ్లుగా తీవ్ర అసంతృప్తితో ఉన్న మోదీ.. ఇటీవల నిర్వహించిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు వారికి స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు సమాచారం. సార్వత్రిక ఎన్నికలకు ఎంతో సమయం లేనందున.. ప్రజల్లో స్వచ్ఛమైన పాలనపై ఉన్న భరోసాను ఇకముందూ అందించాలనే పట్టుదలతో మోదీ ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'తిరంగా యాత్ర'తో ప్రజల్లో సమగ్రత భావం పెంపొందుతుందని ప్రధాని మోదీ అన్నారు. 2022 వరకు నిర్దేశించుకున్న నవ భారత నిర్మాణ లక్ష్యంలో ప్రజలను మమేకం చేసేందుకే పార్టీ ఈ యాత్ర చేపట్టిందని మోదీ చెప్పారు. ఎక్కడా రాజీ లేకుండా నిబద్ధతతో ర్యాలీలు నిర్వహిస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలను ఆయన అభినందించారు.

మంత్రులు, అధికారులకు కరెంటు కార్లు!

న్యూఢిల్లీ: పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి విద్యుత్‌తో నడిచే కారుల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని చూస్తోంది. తొలుత మంత్రులు, అధికారులకు వీటిని సమకూర్చడం ద్వారా ప్రభుత్వం నుంచే మార్పు ప్రారంభం కావాలని భావిస్తోంది. ఇందులో భాగంగా 10వేల విద్యుత్ కారుల కోసం ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది. ప్రభుత్వ వినియోగంలో ఉన్న వాహనాల్లో 40 శాతాన్ని విద్యుత్ వాహనాలతో భర్తీ చేయాలనుకుంటున్నట్లు ఈఈఎస్ఎల్ ఎండీ సౌరబ్ కుమార్ చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.